అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 1-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 3 సంచిక : 214 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

కార్పొరేట్ల గాలం

బొగ్గు గనులు, స్పెక్ట్రం కేటాయింపుల ద్వారా కేంద్ర ప్రభుత్వం భారీగానే వనరులు సమీకరించినా, వేలంలో వీటిని పొందిన బడా కంపెనీలు రుణాల కోసం మళ్లీ బ్యాంకులను ఆశ్రయిస్తున్నాయి. ఇప్పటికే రూ లక్షల కోట్ల నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ)తో సతమతమవుతున్న బ్యాంకులకు తాజా రుణాలపై ఒత్తిళ్లు తప్పకపోవచ్చు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ అంచనా ప్రకారం బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు రూ 6.12 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అధికారికంగానే వసూలు కాని అప్పుల కుప్ప ఈ రకంగా పేరుకుపోతే ఇక రాజకీయ ఒత్తిళ్లతో ప్రభుత్వ రంగ బ్యాంకులు భారీ మౌలిక ప్రాజెక్టులకు ఎలాంటి విచారణ లేకుండానే రూ వేల కోట్ల రుణ సంతర్పణ చేయడం సహజమే. ఇక కార్పొరేట్ రుణ పునర్వ్యవస్థీకరణ, ఇతర రుణ వ్యవస్థీకరణ స్కీముల కింద ఆయా కంపెనీల పట్ల బ్యాంకులు తమ ఉదారతను చాటుకుంటుండటంతో ఎన్‌పీఏలు విచ్చలవిడిగా పెరగడానికి అనుమతిస్తున్నాయి. ఆయా కార్పొరేట్ దిగ్గజాలకు ఇచ్చిన ఈ తరహా రుణాలు ఇంకా ఒత్తిడికి గురయ్యే ఆస్తుల జాబితాలోకి అధికారికంగా చేరకపోవడం గమనార్హం. అయితే ఇవి కూడా రేపో, మాపో రద్దుల పద్దులోకి ఎక్కే ప్రమాదం పొంచి ఉందనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

అప్పుల కోసం బ్యాంకుల చెంతకు...



- నిరర్థక ఆస్తులపై ఒత్తిళ్లు
- ఎన్‌డీఏ తీరుతో ఎన్‌పీఏలకు రెక్కలు



న్యూఢిల్లీ: ఎన్‌పీఏ సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే..అది సంక్షోభంగా ఎగిసి బ్యాంకింగ్ వ్యవస్థనూ, ఆర్థిక వ్యవస్థనూ ముంచెత్తే ప్రమాదం నెలకొంది. దీన్ని పసిగట్టిన ప్రభుత్వం ఈ ఏడాది మేలో బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్‌ను సవరిస్తూ ఆర్డినెన్స్‌ను తీసకువచ్చింది. దీని ద్వారా బ్యాంకు రుణాల (ఎన్‌పీఏ) రికవరీకి సంబంధించి పూర్తి అధికారం ఆర్‌బీఐకి కట్టబెడుతూ ఈ నిర్ణయం తీసుకుంది.మరోవైపు బాసెల్ 3 నిబంధనల ప్రకారం మార్చి 2019 నాటికి బ్యాంకులు దాదాపు రూ 6 లక్షల కోట్ల మూలధనాన్ని సమీకరిం చుకోవాల్సి ఉంది. ఓ వైపు పేరుకుపోతున్న నిరర్థక ఆస్తులు..మరోవైపు బాసెల్ 3 నిబంధనల గడువు ముంచు కొస్తుండటంతో బ్యాంకులపై విపరీతమైన ఒత్తిడి నెలకొన్నది.ఇన్ని ప్రతికూలతల మధ్య రుణ వితరణ బ్యాంకులకు కత్తిమీద సాము వంటిదే. ఇక అప్పుల ఊబిలో కూరుకుపోయిన కంపెనీలకు రుణాల నిరాకరణ పాటిస్తే వేలంలో రూ వేల కోట్లు వెచ్చించి పొందిన బొగ్గు గనులు, స్పెక్ట్రం వంటి వనరుల అభి వృద్ధి నిలిచే ప్రమాదం ఉన్న దని ప్రభుత్వ వర్గాల అభిప్రాయం. అదే ...9లో

నెలకోసారి బాదుడే

- వంటగ్యాస్‌పై సబ్సిడీ ఎత్తేయనున్న కేంద్రం
- ప్రతి నెలా రూ. 4 పెంచేందుకు నిర్ణయం



న్యూఢిల్లీ: వంట గ్యాస్ సిలిండర్‌పై సబ్సీడీని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఆ భారాన్ని ప్రజలపై రుద్దేందుకు నిర్ణయించింది. వచ్చే ఏడాది మార్చి కల్లా మొత్తం సబ్సిడీని ఎత్తివేసేందుకు సిలిండర్‌పై ప్రతి నెలా రూ. 4 పెంచాలని నిర్ణయం తీసుకున్నది. ప్రభుత్వ రంగ ఇంధన సంస్థలను ఆదేశించినట్లు లోక్‌సభలో కేంద్ర చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. '14.2 కేజీల సబ్సీడీ వంటగ్యాస్ సిలిండర్‌పై నెలకు రూ.2 చొప్పున పెంచాలని ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థకు గతంలో చెప్పాం. ఇప్పుడు, ఆ మొత్తాన్ని రెట్టింపు చేస్తూ నిర్ణయం తీసుకున్నాం. ఇలా వచ్చే ఏడాది మార్చి నాటికి వంటగ్యాస్‌పై సబ్సీడీని పూర్తిగా ఎత్తివేయాలని నిర్ణయించాం' అని ధర్మేంద్రప్రదాన్ చెప్పారు. గృహ వినియోగదారులకు ఇప్పటివరకూ ఏడాదికి 12 ఎల్పీజీ సిలిండర్లను సబ్సిడీ మీద ఇస్తున్న విషయం తెలిసిందే. 12 దాటి విక్రయించే ప్రతి సిలిండర్‌కూ వినియోగదారులు మార్కెట్ రేటును చెల్లించాల్సి వచ్చేది. '14.2 కేజీల సిలిండర్‌పై ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు 2016 జులై 1 నుంచి ప్రతి నెలా రూ. 2 (వ్యాట్ కాకుండా) పెంచుతూ వస్తున్నాయి' అని ప్రదాన్ చెప్పారు. అలాగే జూన్ 1 నుంచి ప్రతి నెలా రూ. 4 పెంచాలని ఈ ఏడాది మే 30న కంపెనీలను ఆదేశించినట్టు తెలిపారు. సబ్సిడీ పూర్తిగా తొలగి పోయేవరకు, లేదా 2018 మార్చి వరకూ, లేదా తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఈ ధరల పెంపు కొనసాగుతుందని అన్నారు. ప్రసుత్తం ఢిల్లీలో సబ్సీడీ గ్యాస్ సిలిండర్ ధర రూ. 477.46గా ఉన్నది. గతేడాది జూన్‌లో దీని ధర రూ. 419.18. సబ్సిడీయేతర గ్యాస్ ధర అంటే మార్కెట్ రేటు రూ. 564.





తెలంగాణ ఇచ్చింది ఇసుక మాఫియా కోసమా?

- ప్రజలు కోరుకున్న తెలంగాణ రాలేదు : లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ 9లో



2లో

498-ఎ పటిష్టం చేయాలి

బడిపిల్లల బువ్వకు బంగారం తాకట్టు

- కష్టాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు 9లో



ఈఎస్‌వోపీ ప్రోత్సాహకం కట్..?

మొండి బకాయిల వసూళ్లలో విఫలమైతే ..


- 8 లక్షలమంది బ్యాంక్ ఉద్యోగులపై ప్రభావం
- ఆర్థికశాఖ పరిశీలనలో ప్రతిపాదన

ముంబయి: మొండి బకాయిల వసూలుకు సంబంధించి లక్ష్యాలను సాధించడంలో విఫలమైతే బ్యాంకు ఉద్యోగులకు ప్రోత్సహకాలను నిలిపివేయాలన్న ప్రతిపాదనను ఆర్థికశాఖ పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. బ్యాంకుల నికర ఆస్తులు కనీసం 65 శాతానికి తగ్గకుండా ఉండాలని, నిరర్థక ఆస్తులు 35 శాతానికి అధికంగా ఉండకుండా నిర్దేశించాలని బ్యాంక్స్ బోర్డు బ్యూరో సూచించింది. ఈమేరకు ఫలితాలను సాధించడంలో విఫలమైతే సంబంధిత బ్యాంకు ఉద్యోగులను ఆ ఆర్థిక సంవత్సరం ఎంప్లాయ్ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్(ఈఎస్‌వోపీ)కు అనర్హు లుగా నిర్ణయించాలని బ్యూరో సూచించింది. ఈ నిబంధనలపై తమ అభిప్రాయాలు తెలియ జేయాలంటూ ఐదు ప్రభుత్వరంగ బ్యాంకుల ఉన్నతాధికారులకు ఆర్థికశాఖ ...10లో

అమెరికాకు పుతిన్ షాక్ !

- 755 మంది అమెరికా దౌత్యాధికారుల్ని పంపేస్తున్నాం 7లో

దళితులు సత్తా చూపాలి



- మూడెకరాలివ్వకుంటే... 21 లక్షల పరిహారం ఇవ్వండి
- ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి : దళిత పోరుగర్జన ముగింపు సభలో సున్నం రాజయ్య, జాన్‌వెస్లీ 9లో

పౌష్టికాహార లోపంతో.. మూడేండ్లలో 7వేలమంది చిన్నారుల మృతి

ముంబయి : బీజేపీ పాలిత మహారాష్ట్రలో పౌష్టికాహార లోపం వల్ల చిన్నారుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. మహారాష్ట్రలోని 16 గిరిజన జిల్లాల్లో గత మూడేండ్లలో 7004 మంది చిన్నారులు మృతి చెందినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇదే సమయంలో అనారోగ్య కారణాలతో చిన్నారుల తల్లులు(బాలింతలు) 864మంది మృతి చెందారు. 2014-15లో 3022 మంది, 2015-16లో 1912మంది, 2016-17లో 2070మంది చిన్నారులు పౌష్టికాహార లోపం వల్ల మృతి చెందారు. కాగా, 2014-15లో 285 మంది, 2015-16లో 296మంది, 2016-17లో 283మంది బాలింతలు మరణించారు. ఈ వివరాలను స్త్రీ,శిశు సంక్షేమశాఖమంత్రి పంకజ్‌ముండే ఆ రాష్ట్ర శాసనమండలిలో కాంగ్రెస్‌పక్ష సభ్యుడు శరద్‌రాన్‌పైజ్ అడిగిన ప్రశ్నకు రాతపూర్వకంగా సమాధానమిస్తూ తెలిపారు.

'కలాం ముస్లిం కాదు'..

న్యూఢిల్లీ : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహం వద్ద బైబిల్, ఖురాన్ ఉంచడంపై నెల కొన్న వివాదం సద్దుమణగక ముందే అసలు కలాం ముస్లిమే కాదని ముస్లిం అనుకూల గ్రూప్ నేత చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. విగ్రహాలకు మొక్కడం, నగ్న సాధువులను గౌరవించడం వంటి పనులు చేసిన కలాం ముస్లిం ఎంతమాత్రం కాదని తమిళనాడు తోహిద్ జమత్ నేత జైనులబుదీన్ వ్యాఖ్యానించారు. కలాం రాష్ట్రపతి అయ్యే వరకూ ఆయన ఎవరికీ తెలీదు..ఆయన వేలాది శాస్త్రవేత్తల సమూహంలో ఒకరు మాత్రమే..విగ్రహాలకు మొక్కడం, శంకరాచార్య నుంచి ఆశీస్సులు పొందేందుకు అభ్యంతరం చెప్పకపోవడం కలాం అర్హతలుగా బీజేపీ, సంఘ్ పరివార్‌లు గుర్తించి ఆయనను రాష్ట్రపతిని చేశాయి' అన్నారు. కేవలం పేరులోనే ఆయన ముస్లిం అంటూ కలాం మెమోరియల్‌లో ఖురాన్ పెట్టకపోతే తాము నిరసన తెలిపేవారం కాదని జైనులబుదీన్ స్పష్టం చేశారు.కలాం స్మారక కేంద్రంలో ఆయన విగ్రహం పక్కన భగవద్గీతను ఉంచడంపైనా వివాదం నెలకొన్న క్రమంలో ముస్లిం నేత చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కలాం మెమోరియల్ వ్యవహారాలపై తమిళనాడులో రాజకీయ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రపతిగా విశిష్ట సేవలందించిన కలాం నిబద్ధతను కొనియాడని నేతలు, గ్రూపులు వారి రాజకీయాలు, సిద్ధాంత ప్రయోజనాల కోసం కీచులాడుకోవడంపై ఆందోళన వ్యక్తమవుతున్నది.

సాక్ష్యాలను తారుమారు చేయడం తీవ్రమైన నేరం : సుప్రీం

న్యూఢిల్లీ : సాక్ష్యాలను తారుమారు చేయడం, కృత్రిమ సాక్ష్యాలను సృష్టించడం వంటి నేరాలు తీవ్రమైనవని సుప్రీంకోర్టు పేర్కొన్నది. 2002లో గోద్రాలో జరిగిన అల్లర్ల కేసులో సాక్ష్యాలను తారుమారు చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్‌ఖాన్ పఠాన్‌పై కేసు నమోదు చేయాలని 2010లో సెషన్స్‌కోర్టు పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించింది. సెషన్స్‌కోర్టు తీర్పును గుజరాత్ హైకోర్టు సమర్థించింది. హైకోర్టు తీర్పుపై సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్, సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సీజేపీ) సంస్థ సభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ అమితావా రాయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కేసుపై సోమవారం విచారణ చేపట్టింది. పోలీసులు రైస్‌ఖాన్‌పై తప్పుడు కేసు నమోదు చేసి వేధిస్తున్నారని పిటిషనర్ తరపున కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. ఈ కేసులో జోక్యం చేసుకునే హక్కు తీస్తా సెతల్వాద్‌కు గానీ, సీజేపీ సంస్థలకు గానీ లేదని అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. గోద్రా అల్లర్లకు సంబంధించిన కేసులో సాక్షిగా ఉన్న రైస్‌ఖాన్ సాక్ష్యాలను తారుమారు చేశాడని పేర్కొన్నారు. అందుకే పోలీసులు అతన్ని విచారిస్తున్నారని, కేసు విచారణ తుది దశలో ఉన్నదని అన్నారు. తుషార్ మెహతా వాదనలతో ఏకీభవించిన ద్విసభ్య ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. కేసు తదుపరి విచారణను ఆగస్టు 21కి వాయిదా వేసింది.

'తస్లీమా గోబ్యాక్'

ఔరంగాబాద్ : బంగ్లాదేశ్ వివాదాస్పద రచయిత్రి తస్లీమా నస్రీన్‌కు ఔరంగాబాద్‌లోని చికల్‌థానా విమానాశ్రయంలో నిరసన సెగ తాకింది. ఎంఐఎం కార్యకర్తలు పెద్ద ఎత్తున విమానాశ్రయానికి చేరుకుని తస్లీమా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఆమె బస చేయనున్న హోటల్ వద్ద కూడా ఎంఐఎం కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకోవడాన్ని గుర్తించిన అధికారులు ఆమెను ముంబయికి తిరిగి పంపించారు. చికల్‌థానా ఎయిర్‌పోర్ట్ వద్ద ఎంఐఎం ఎమ్మెల్యే ఇంతియాజ్ జలీల్ మాట్లాడారు. 'ఇస్లాం మత భావాలను దెబ్బతీసే విధంగా రచనలు చేసిన తస్లీమాకు ఔరంగాబాద్‌లో కాలుపెట్టనివ్వమన్నారు. విద్వేష భావాలున్నవారికి ఈ నగరంలో ప్రవేశం లేదు' అని అన్నారు. ఔరంగాబాద్‌లో శాంతిభద్రతలు తమ అదుపులోనే ఉన్నాయని డీసీపీ రాహుల్ శ్రీరామే అన్నారు. నిరసనకారులు పెద్ద ఎత్తున విమానాశ్రయానికి తరలి రావడంతో తస్లీమాను తిరిగి ముంబయికి పంపించామని అన్నారు. కాగా, తస్లీమా 1994లో దేశ బహిష్కరణకు గురయ్యారు. ఐరోపా, అమెరికాలో 10 ఏండ్ల పాటు నివసించారు. అనంతరం 2005 లో భారత్‌కు తిరిగి వచ్చారు. 2008లో మరోసారి దేశ బహిష్కరణకు గురయ్యారు. ప్రస్తుతం ఆమె స్వీడన్‌లో ప్రవాసముంటున్నారు. ఆమె వీసాను గతనెల23న కేంద్ర హోం శాఖ ఏడాదిపాటు పొడిగించింది.

బురఖాలో వచ్చి బ్యాంకు లూటీ

శ్రీనగర్ : జమ్ము కాశ్మీర్ రాష్ట్రం అనంతనాగ్ జిల్లాలోని అర్వాన్ గ్రామంలోని ఓ బ్యాంకులో దోపిడి జరిగింది. గుర్తు తెలియని దుండగులు బురఖాలు ధరించి బ్యాంకులోకి చొరబడ్డారు. అనంతరం క్యాషియర్‌ను తుపాకులతో బెదిరించి రూ.5లక్షలు దోచుకెళ్లారు. ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపిన వివరాల ప్రకారం..ముగ్గురు ఉగ్రవాదులు బ్యాంకు లూటీలో పాల్గొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నామని అన్నారు. ఉగ్రవాదులే ఈ దోపిడీకి పాల్పడ్డారని అనుమానిస్తున్నారు. కాగా, జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలోని బ్యాంకులు తరచూ దోపిడీకి గురవుతున్నాయి. ఉగ్రవాదులు తమ కార్యకలాపాల కోసం బ్యాంకుల్లోకి చొరబడి డబ్బులు దోచుకెళ్తున్నారు. దీంతో, ఆరాష్ట్ర ప్రభుత్వం కొంత కాలం నగదు రహిత లావాదేవీలపై దృష్టి పెట్టింది. అయితే, రాష్ట్ర ప్రజలు క్యాష్‌లెస్ వైపు మొగ్గుచూపకపోవడంతో బ్యాంకులు ఇటీవలే నగదు జమ, ఉపసంహరణలను పునరుద్ధరించాయి.

పార్టీ పదవి వీడను : అమిత్ షా

లక్నో : బీజేపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసే ప్రశ్నే లేదని అమిత్ షా అన్నారు. తాను ఆ పదవిలో ఎంతో సంతోషంగా, మనస్ఫూర్తిగా పనిచేస్తున్నానని చెప్పారు. రాజ్యసభకు ఎన్నికైతే పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తారన్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. బీహార్‌లో మూడు రోజులు పర్యటించేందుకు వచ్చిన ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. బీహార్‌లో ఏ పార్టీని బీజేపీ చీల్చలేదని చెప్పారు. అవినీతి పరులతో కలిసి పనిచేసేందుకు ఇష్టపడనందువల్లే నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారన్నారు. పార్టీ అధ్యక్షుడిగా పనిచేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు.



రాజీ ప్రసక్తేలేదట సార్..! కాంట్రాక్టరు అంటున్నాడు.. ఎప్పటిలాగే రోడ్లు వేయాల్సిందేన

చదువుకు కష్టాలెన్నో..



ఇండోర్ : సర్కారు బడులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన ప్రభుత్వాలు గాలికొదిలేస్తున్నాయి. ఏదో నెపంతో ప్రయివేటు స్కూళ్లకు ప్రయోజనం కలిగే అడుగులేయటానికి సిద్ధమైపోతున్నాయి. మధ్యప్రదేశ్‌లోనూ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో సమీపంలో స్కూళ్ల మూతపడటంతో చిన్నారులు విద్యకు దూరమవుతున్నారు. ధర్మపురి సంకుల్‌లోని పిప్లియా కమీన్ పంచాయతీలోని మీరాపూర్‌లో 21 మంది చదువుకుంటున్నారు. అక్కడి పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉండటంతో..ఆ స్కూలు మూతపడింది. దీంతో కిలోన్నర మీటరు దూరంలో ఉన్న స్కూలుకు వెళ్లాలంటే.. మురుగుకాల్వలు, నీటి గుంతలను దాటుకుని వెళ్లాల్సివస్తోంది. తమ పిల్లల చదువులు దూరం కాకుండా కొందరు తండ్రులు వారిని భుజాలపై ఎక్కించుకుని పాఠశాలలకు తీసుకెళ్లాల్సి వస్తున్నది.

బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో చిత్రాలు


అమానుషం..



మనుషుల శవాలు తరలించేందుకు ముందుకు రాని అంబులెన్స్‌లు...గోవులు మరణిస్తే రయ్ మంటూ దూసుకొస్తున్నాయి..మధ్యప్రదేశ్ ప్రభుత్వం మరణించిన, గాయపడిన గోవులు, పశువుల కోసం హైటెక్ అంబులెన్స్ స్కీమ్‌ను ప్రారంభిస్తున్నది.నిరుపేద రోగులకు మాత్రం అంబులెన్స్‌లు ఆమడదూరంలో నిలుస్తున్నాయి.మధ్యప్రదేశ్‌కే చెందిన టికంగర్‌లో ఓ ఆస్పత్రి కుమారుడి శవాన్ని తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌ను కోరిన తండ్రికి వాహనం నిరాకరించింది.గత ఏడాది ఒడిషాకు చెందిన ధనమాంజీకి అంబులెన్స్ ఇవ్వడానికి ఆస్పత్రి నిరాకరించడంతో తన భార్య శవాన్ని భుజాలపై పదికిలోమీటర్ల వరకూ నడుచుకుంటూ తీసుకెళ్లిన దృశ్యం దేశమంతటినీ నివ్వెరపరిచింది..

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోన్న బీజేపీ

- రాజ్యసభ ఎన్నికల్లో గెలిచేందుకు డబ్బులు ఎర
- కోట్లు పెట్టి ఎమ్మెల్యేలను కొంటున్నారు
- పార్లమెంట్ ఉభయ సభల్లో ఆందోళన



న్యూఢిల్లీ : గుజరాత్ రాజకీయ పరిస్థితులపై పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. గుజరాత్ లో పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయని, బీజేపీ ప్రజాస్వామ్యన్ని ఖూనీ చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. రాజ్యసభ ఎన్నికల్లో గెలిచేందుకు ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు బీజేపీ పాల్పడుతుందని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. కోట్లు పెట్టి ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారని, ఇందుకోసం అధికార యంత్రాంగాన్ని వాడుకొంటుందని కాంగ్రెస్ విమర్శించింది. సోమవారం లోక్‌సభ, రాజ్యసభల్లో గుజరాత్ లో పార్టీ ఫిరాయింపుల అంశాన్ని కాంగ్రెస్ నేతలు లేవనెత్తారు. లోక్‌సభలో ఈ అంశంపై లేవనెత్తగా, రాజ్యసభలో ఏకంగా ఆందోళనకు దిగారు. లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కాగానే కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే ఈ విషయాన్ని ప్రస్తావించారు. బీజేపీ మద్దతిస్తే రూ.15 కోట్లు ఇస్తామంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆఫర్ ఇచ్చారని ఖర్గే ఆరోపించారు. అధికార పార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఒత్తిడికి గురిచేస్తుందన్నారు. ఆకర్ష్ కమల్ అయిపోయిందని, ఇది ప్రజాస్వామ్యంపైనే దాడి అని, దీనిపై చర్చ జరపాలని ఖర్గే డిమాండ్ చేశారు. అయితే స్పీకర్ ఇందుకు నిరాకరించడంతో కాంగ్రెస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు.

మరోవైపు గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల అంశం రాజ్యసభను కుదిపేసింది. అధికార, ప్రతిపక్షాలు పోటాపోటీగా నిరసన చేపట్టడంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. దీంతో డిప్యూటీ చైర్మెన్ కురియన్ సభను పది నిమిషాలు వాయిదా వేశారు. సభ ప్రారంభం కాగానే గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బెంగళూరు రిసార్ట్‌లో అనుభవిస్తున్న రాజభోగాలపై అధికార బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసారు. ఓ పక్క రాష్ట్రం వరదలతో అతలాకుతలం అవుతుంటే... ప్రజా ప్రతినిధులకు ఫైవ్ స్టార్ సౌకర్యాలేంటని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు కాంగ్రెస్ నేతత్వంలోని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ధ్వజమెత్తాయి. గుజరాత్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీ భయపెట్టి, డబ్బులు ఎరవేసి లాగేస్తోందని నిరసన తెలిపారు. వెల్‌లోకి దూసుకెచ్చి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

రాజ్యసభలో మోడీకి షాక్

- ఓటింగ్‌లో ఓడిన ఎన్డీయే సర్కారు



రాజ్యసభలో మోడీకి షాక్ తగిలింది.విపక్షాలు ప్రవేశపెట్టిన కీలకబిల్లు పాస్‌కావటంతో అధికారపక్షానికి మింగుడు పడటంలేదు. బ్యాక్ వర్డ్ తరగతులకు చట్టబద్ధమైన హోదా కల్పించే చర్యలంటూ కేంద్రమంత్రి థవర్‌చంద్ గెహ్లాట్ 123 వ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు.ఈ బిల్లును ఎలాగైనా పాస్ చేయించాలన్నదే మోడీ సర్కార్ వ్యూహం. అయితే ప్రస్తుతం కమిషన్ మూడుకు పరిమితమైతే..దీన్ని ఐదు పెంచాలనీ, మైనార్టీ మహిళకు ఆ కమిషన్‌లో చోటు కల్పించాలనీ ప్రతిపక్షపార్టీలు పట్టుబట్టాయి. దీనిపై నాలుగు గంటలపాటు చర్చకు జరిగింది. ఆ తర్వాత ఓటింగ్ జరపాలనటంతో..డిప్యూటీ చైర్మెన్ కురియన్ ఓకే అనేశారు.ఇది అధికార పక్షం ఊహించని పరిణామం.కాగా సభలో ఎన్డీఏ సభ్యులు గైర్హాజరవ్వటంతో మోడీకి ఆగ్రహం తెప్పించింది. ప్రతిపక్ష పార్టీలు చేసిన ప్రతిపాదనకు అనుకూలంగా 75 మంది చేయి ఎత్తగా ,54 మంది (అధికారపక్షసభ్యులు) వ్యతిరేకించారు.ఇలా ప్రతిపక్ష సభ్యులు ఎన్డీఏ సర్కారును ఇరుకున పెట్టి బిల్లు పాస్ చేయించుకోవటంతో సఫలీకృతులయ్యారు.ఇపుడు ఆ బిల్లును తిరస్కరించటం ఎలా అని అధికారపక్షం మల్లగుల్లాలు పడుతున్నది.

జీఎం ఆవాల పంటకు అనుమతిపై.. సుప్రీంను 45రోజుల సమయం కోరిన కేంద్రం

న్యూఢిల్లీ : జన్యుమార్పులు(జీఎం) చేసిన ఆవాలకు వాణిజ్య పంటగా అనుమతి ఇవ్వాలా?లేదా?అనే దానిపై తమ నిర్ణయాన్ని 45 రోజుల్లో వెల్లడిస్తామని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. జీఎం ఆవాలపై నిషేధం విధించాలని కోరుతూ వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టడానికి ముందు కేంద్రప్రభుత్వ అభిప్రాయాన్ని తెలపాలని గతేడాది సుప్రీంకోర్టు ఆదేశించింది. సోమవారం ఇదే అంశంపై సుప్రీంకోర్టు తిరిగి విచారణ చేపట్టగా, కేంద్రం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ పిఎస్ నరసింహ 45 రోజుల గడువు కోరారు. ఆవాల పంటను విత్తడం అక్టోబర్ నుంచి మొదలు కానున్న నేపథ్యంలో తదుపరి విచారణను సెప్టెంబర్ రెండో వారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. జీఎం ఆవాలకు కేంద్రం ఓవేళ అనుమతిస్తే, ఈలోగా తమ తీర్పును ప్రకటించేందుకు వీలవుతుందని ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్, న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం కేంద్రానికి సూచించింది. జీఎం ఆవాలకు వాణిజ్య పంటగా అనుమతించే విషయంలో గతేడాది అక్టోబర్ 7 నుంచి స్టే కొనసాగుతోంది. జీఎం ఆవాల పంటను సవాల్ చేస్తూ అరుణా రోడ్రిగ్స్ వేసిన పిటిషన్‌పై న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ తన వాదన వినిపించారు. పలు వ్యవసాయ క్షేత్రాల్లో జీఎం ఆవాలను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా విత్తుతున్నట్టు ప్రశాంత్‌భూషణ్ కోర్టు దృష్టికి తెచ్చారు. జీవ భద్రతకు సంబంధించిన అంశాలను వెబ్‌సైట్‌లో పెట్టకుండా ప్రయోగాలు నిర్వహించడం సరైంది కాదని ఆయన తెలిపారు.

ఇందుకు సంబంధించిన నియంత్రణ వ్యవస్థ పనితీరు నత్తనడకన సాగుతున్నందున ఈ విత్తనంపై పదేండ్ల నిషేధం విధించాలని ఆయన కోరారు. నిపుణుల కమిటీ ఇదే సూచన చేసినట్టు ఆయన తెలి పారు. దీంతోపాటు హెచ్‌టీ ఆవాలకు సంబంధించిన పలురకాలపైనా పదేండ్ల నిషేధాన్ని నిపుణుల కమిటీ సూచించినట్టు రోడ్రిగ్స్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.




498ఎ ను పటిష్టం చెయ్యాలి

ఢిల్లీ: మహిళలపై జరిగేదాడులు, హింసను అరికట్టేందుకు ఉద్దేశించిన 498ఎ పటిష్టపరచాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు వద్ద ధర్నా జరిగింది. 498ఎ సెక్షన్‌ను బలహీన పరిచేందుకు జరుగుతున్న ప్రయత్నాలను నిరిసిస్తూ జరిగిన ఈ కార్యక్రమంలో 16 మహిళా సంఘాలు పాల్గొన్నాయి. ఈ సెక్షన్ కింది పురుషులపై తప్పుడు కేసులు పెడుతున్నారన్న వాదాన్ని మహిళా సంఘాల నేతలు తోసి పుచ్చారు. ఎన్నో త్యాగాల ఫలితంగా సాధించుకున్న 498ఎ మహిళలకు రక్షణ కల్పిస్తోందని ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే చెబుతున్నారు.

అసమ్మతి రాజద్రోహం కానేకాదు..

ప్రజాస్వామ్యానికి ఆలంబన

- మోడీకి మాజీ సైనికుల బృందం బహిరంగ లేఖ



న్యూఢిల్లీ : ప్రభుత్వంపై అసమ్మతి అనేది రాజద్రోహం కాదని, అది ప్రజాస్వామ్యంలో మౌలికమైన కీలక అంశమని 114 మంది మాజీ సైనికులతో కూడిన బృందం స్పష్టం చేసింది.ప్రధాని నరేంద్ర మోడీ సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లకు రాసిన బహిరంగ లేఖలో దేశ లౌకిక స్ఫూర్తికి విఘాతం కలిగించేలా దేశంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను వారు ప్రస్తావించారు.తాజా ఘటనలు రాజ్యాంగంలో పొందుపరుచిన లౌకిక, ప్రజాస్వామిక విలువలకు తూట్లు పొడిచాయని ఆందోళన వ్యక్తం చేశారు. లేఖ సారాంశం పరిశీలిస్తే... దేశవ్యాప్తంగా పెరుగుతున్న విభజిత శక్తుల కార్యకలాపాలు విస్తుగొలుపుతున్నాయి. ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా పరిణమించే ఇలాంటి మత ప్రాదిపదికన విభజన జరిగేలా చోటుచేసుకుంటున్న పరిణామాలతో కలత చెంది మేము ఈ లేఖ రాయాల్సి వస్తున్నది..మేం ఏం రాజకీయ పార్టీకి చెందిన వారం కాదు. భారత రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా వ్యవహరించడమే మా కర్తవ్యం..దేశంలో ప్రస్తుతం నెలకొన్న భయం, విద్వేష, అనుమానాస్పద వాతావరణానికి వ్యతిరేకంగా ఇటీవల దేశమంతటా జరిగిన నాట్ ఇన్ మై నేమ్ క్యాంపెయిన్‌లో మేం పాల్గొన్నాం.. ప్రస్తుత పరిణామాలపై చేపట్టిన ఆన్‌లైన్ ప్రచారం లక్షల మంది గొంతుకగా మారిన విషయం తెలిసిందే...సాయుధ దళాలు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా ఉంటాయి. భిన్న మతాలు, కులాలు, భౌగోళిక ప్రాంతాల వంటి అసమానతలు విడిచి సైనికులంతా దేశ రక్షణ కోసం భుజం భుజం కలిపి పనిచేస్తారు.ఒక కుటుంబంగా మేం ముందుకు వెళతాం..మరి అలాంటిది ఇప్పుడు దేశంలో జరుగుతున్న దేంటి..? సైనికులతో పాటు రాజ్యాంగంపైనా దాడులు జరుగుతున్నాయి..హిందూ శక్తుల కనుసన్నల్లో గో రక్షకుల పేరిట పౌరసమాజంపై దాడులు చోటుచేసుకుంటున్నాయి. ముస్లింలు, దళితులే లక్ష్యంగా సాగుతున్న దాడులు, వేధింపులను తీవ్రంగా ఖండిస్తున్నాం. మీడియా సంస్థలపై దాడుల ద్వారా భావ ప్రకటనా స్వేచ్ఛపై విధిస్తున్న సంకెళ్లను వ్యతిరేకిస్తున్నాం..జాతి వ్యతిరేకులుగా ముద్ర వేసి పౌర సమాజ గ్రూపులు, విశ్వవిద్యాలయాలు, జర్నలిస్టులు, మేధావులపై విచ్చలవిడిగా దాడులు పెచ్చుమీరడం విచారకరం. ఇవన్నీ చూస్తూ మేం ఎంతోకాలం భరించలేం. రాజ్యాంగ హక్కుల్ని కాలరాస్తుంటే మౌనంగా ఉండలేం. మన వైరుధ్యాలే మన బలం. అసమ్మతి అనేది రాజద్రోహం కానేకాదు..అది ప్రజాస్వామ్యానికి ఆలంబన.దేశంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై మా ఆందోళనను కేంద్రంతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకుని రాజ్యాంగ హక్కులకు విఘాతం కలుగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలి.

ఆగస్టు 6న అఖిల పక్ష సమావేశం

సీఎం విజయన్ చొరవ

- శాంతియుత వాతావరణ స్థాపనకు నిర్ణయం



తిరువనంతపురం : కేరళలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త హత్య ఘటన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆగస్టు 6న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సీపీఐ(ఎం) పాటు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కూడా ఈ సమావేశంలో పాల్గొంటున్నట్టు తెలిపారు. ఇక తిరువనంతపురం, కొట్టాయం, కన్నూరులలో కూడా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలతో శాంతి సమావేశాలు జరుగుతాయన్నారు. జిల్లాలలో కూడా ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్థానిక పత్రికలు పేర్కొన్నాయి. ఇక ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త హత్య అనంతరం జరిగిన పరిణామాలపై ముఖ్యమంత్రి విజయన్ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ చీఫ్ రాజశేఖర్, ఆ పార్టీ ఎమ్మెల్యే ఓ. రాజగోపాల్, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు పి.గోపాలకృష్ణమూర్తి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి కొడియెరి బాలకృష్ణన్‌లు పాల్గొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త హత్యకు సంబంధించిన కేసులో ఇప్పటికే ఎనిమిది మంది నిందితులు అరెస్టయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మణికందన్ ఒక రౌడీషీటర్. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త రాజేష్-మణికంఠల మధ్య వ్యక్తిగత వివాదాలున్నాయన్నాయని ప్రాథమికంగా నిర్ధారించారు. కేరళలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఆదివారం కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

సూట్‌కేసులో యువతి మొండెం

- ముంబయిలో ఘటన

ముంబయి : నవీ ముంబయిలోని పామ్ బీచ్ రోడ్డులో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. యువతిని హత్యచేసి, ఆమె మొండాన్ని ఒక సూట్‌కేసులో పెట్టి ఇక్కడి పొలంలోదానిని వదిలేసి వెళ్ళారు దుండగులు. ఆమె 20-35 ఏండ్ల మధ్య వయస్కురాలై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆ పొలం యజమాని మహేంద్ర టాండెల్ సోమవారం పొలంలోకి వెళ్ళగా ఒక మూల సూట్‌కేసు పడివుండటం చూశాడని, దానిని ఎత్తేందుకు ప్రయత్నించగా, చాలా బరువుగా ఉండటంతో... అనుమానం వచ్చి తమకు సమాచారమిచ్చినట్టు పోలీసులు తెలిపారు. అక్కడకు చేరుకున్న ఎన్‌ఆర్‌ఐ కోస్టల్ పోలీసు స్టేషన్ సిబ్బంది సూట్‌కేసును తెరిచారు. అందులో తలలేని మహిళ మృతదేహం ఉంది. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నవీ ముంబయి మున్సిపల్ ఆస్పత్రికి తరలించినట్టు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 'బాధితురాలిని గుర్తించేం దుకు ఆ ఫొటోను అన్ని పోలీస్‌స్టేషన్‌లు, కంట్రోల్ రూములకు పంపాం. అదృశ్యమైన వారి రికార్డులను కూడా మేం తనిఖీలు చేస్తున్నాం' అని డీసీపీ ఎస్ పథారే చెప్పారు.

పతంగి కోసం షాపునకు వెళితే...

పతంగి కొనుక్కునేందుకు ఓ చిన్నారి షాపుకు వెళితే.. ఆమెపై దుకాణదారుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన దేశరాజధాని ఢిల్లీలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈశాన్య ఢిల్లీలోని కరవాల్ నగర్‌లో ఆరేండ్ల మైనరుపై జరిగిన ఈ దారుణ ఘటనకు సంబంధించి షాపు యజమానిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా నేరాన్ని అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు. బాధితురాలు సోదరుడితో కలసి షాపుకు వెళ్ళిందని, అర్ధగంట అయినా వారు ఇంటికి తిరిగి రాకపోవడంతో పిల్లల కోసం తల్లిదండ్రులు వెతుక్కుంటూ వెళ్ళారని పోలీసులు తెలిపారు. ముందు కొడుకును చూసిన తల్లిదండ్రులు, కూతురు కోసం వెతికారు. ఆమె దుకాణం లోపలి నుంచి ఏడ్చుకుంటూ బయటకు వచ్చింది, నిలదీయగా అసలు విషయం చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీజేపీతో చేతులు కలపడం దురదృష్టకరం

- నోరువిప్పిన జేడీయూ నేత



పాట్నా : జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ బీజేపీతో చేతులు కలపడంపై ఆ పార్టీ నేత శరద్ యాదవ్ తొలిసారిగా నోరువిప్పారు. 'నితీశ్ కుమార్ నిర్ణయంతో నేను అంగీకరించడంలేదు. బీజేపీతో ఆయన చేతులు కలపడం దురదృష్టకరం' అని శరద్ యాదవ్ అన్నారు. '11 కోట్ల మంది బీహార్ ప్రజలు మహా కూటమి కోసం తీర్పునిచ్చారు. నితీశ్ కుమార్ కూటమిని విచ్చిన్నం చేశారు. మహా కూటమి నుంచి బయటకువచ్చి బీజేపీతో కలవడం ఆయన వ్యక్తిగత నిర్ణయం' అన్నారు. బీజేపీతో కలిసి నితీశ్ కుమార్ గత వారం రాష్ట్రంలో అధికార పీఠాన్ని కైవశం చేసుకోవడంపై ఆ పార్టీ నేతల నుంచే తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, సీపీఐ(ఎం) నేత సీతారాం ఏచూరి, సీపీఐ నేత డి రాజా తదితరులు సహా ప్రతిపక్ష సీనియర్ నేతలను శరద్ యాదవ్ భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఆర్‌జేడీ నేత పిటిషన్‌ను కొట్టివేసిన కోర్టు

బీజేపీతో కలిసి జేడీ(యూ) ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడాన్ని సవాలుచేస్తూ ఆర్‌జేడీ నేత దాఖలు చేసిన పిటిషన్‌ను పాట్నా హైకోర్టు కొట్టివేసింది. బీహార్ ప్రజలు మహా కూటమికి అధికారాన్ని కట్టబెట్టారని, ముఖ్యమంత్రి పీఠంపై కూర్చునే హక్కు నితీశ్ కుమార్‌కు లేదని, వెంటనే ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆర్‌జేడీ ఎమ్మెల్యే సరోజ్ యాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. జేడీయూ, బీజేపీ ప్రభుత్వ ప్రభుత్వ ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి పదవికి నితీశ్ రాజీనామా చేసిన తర్వాత, అసెంబ్లీలో 80 మంది ఎమ్మెల్యేలు గల ఏకైక పెద్ద పార్టీ ఆర్‌జేడీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించలేదని సరోజ్ యాదవ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. నితీశ్ బలపరీక్షలో నెగ్గారంటూ ఆర్‌జేడీ నేత పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

రూ. 90 లక్షల ఇసుక కుంభకోణం కేసు లాలూ తనయుడిపై ప్రారంభమైన దర్యాప్తు

ఆర్‌జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ పెద్ద కుమారుడు, పర్యావరణ శాఖ మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్‌కు ప్రమేయముందంటూ ఆరోపణలు వచ్చిన 90 లక్షల ఇసుక కుంభకోణం కేసుపై బీహార్ ప్రభుత్వం విచారణ చేపట్టింది. మంత్రి తన పదవిని దుర్వినియోగం చేసి, రెండు ఎకరాల విస్తీర్ణంలోని పాట్నా జూ నుంచి ఇసుక అక్రమంగా తరలించారని మాజీ మంత్రిపై ఆరోపణలు వచ్చాయి. ఇసుక కుంభకోణంతోపాటు, మహాకూటమి ప్రభుత్వంలో ఆయన కుమారులు జరిపిన ఇతర అక్రమాలపై కూడా త్వరలో విచారణ ప్రారంభిస్తామని బీజేపీ నేత, బీహార్ కొత్త మంత్రి సుశీల్ కుమార్ అన్నారు. ఇది చాలా చిన్న కుంభకోణం, ఇసుక మైనింగ్ మాఫియాలో ఆర్‌జేడీ నేతలు చాలా మందికి ప్రమేయముంది. ఈ ఇసుక మైనింగ్ మాఫియా ద్వారా ఆర్‌జేడీకి రాజకీయ నిధులు సమకూరుతున్నాయి. పాట్నా పోలీసులు ఇసు మైనింగ్ మాఫియాపై చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే 34 మందిని అదుపుచేశారు. ఆర్‌జేడీ నేతలు ప్రమేయమున్న ఇసుకమాఫియాపై చర్యలను మేం ప్రారంభించాం' అని సుశీల్ కుమార్ మోడీ అన్నారు.

కాళేశ్వరం పంప్‌హౌస్‌ల పనులు పూర్తి చేయాలి



మంత్రి హరీశ్‌రావు ఆదేశం

- 2018 మార్చి తుది గడువు
- పంపులు, మోటార్లు సరఫరా చేసే విదేశీ ప్రతినిధులతో సమావేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మూడు పంప్‌హౌస్‌ల నిర్మాణాన్ని 2018 మార్చి లోగా పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. సోమవారం జలసౌధలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ప్రాజెక్టు పనులపై మంత్రి సమీక్షించారు. పంప్‌లు, మోటార్లు, ఇతర ఎలక్ట్రో మెకానికల్ పరికరాలు సమకూర్చే విదేశీ కంపెనీల ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. ఇండియాతో పాటు ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, చైనా, అమెరికా, బ్రిటన్, బ్రెజిల్, జర్మనీ తదితర దేశాల ప్రతినిధులు, ఆ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్న 'మేఘా' ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడానికి పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టు సంస్థలను మంత్రి ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేవలం సాగునీరే కాకుండా హైదరాబాద్ నగరానికి తాగునీరు కూడా అందిస్తామని మంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టుతో మిషన్ భగీరథను అనుసంధానం చేసి 2017 డిసెంబర్ నాటికి తాగునీటి సరఫరా చేస్తామని తెలిపారు. పంప్‌హౌస్‌లు, బ్యారేజీలు నిర్ణీత కాలపరిమితి లోగా పూర్తి చేయడం అవసరమన్నారు. పంప్‌లు, మోటార్లు, ఇతర సాంకేతిక పరికరాలు త్వరగా సమకూర్చుకోవాలన్నారు. సుందిళ్ల పంప్‌హౌస్‌కు సంబంధించిన సివిల్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పంప్‌లు, మోటార్లు, యంత్ర పరికరాలు సకాలంలో అందించాలని విదేశీ సంస్థలను మంత్రి కోరారు. పరికరాల నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ లేదని ఆయన స్పష్టం చేశారు. కాళేశ్వరం పనులను సకాలంలో పూర్తి చేసి ఆసియాలోనే రికార్డు నెలకొల్పాలని మంత్రి సూచించారు. 2018 జూన్‌కు ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ఖరీఫ్ సీజన్‌లో గోదావరి జలాలను పంట పొలాలకు అందించాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. వివిధ దశల్లో పూర్తి చేయాల్సిన పనులకు మంత్రి కాలవ్యవధి నిర్ణయించారు. దీనికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు.

మూడు పంపింగ్ స్టేషన్లలో పంప్‌లు, మోటార్ల ఏర్పాటు, సబ్‌స్టేషన్ల నిర్మాణం, విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్ల ఏర్పాటుపై మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ఈఎన్‌సీ మురళీధరరావు తదితరులు హాజరయ్యారు.

జలాశయాల కనీస నీటిమట్టాల నిర్ధారణకు ఆదేశం

తాగునీటి కోసం వినియోగించే వివిధ జలాశయాలు కనీస నీటిమట్టాలను నిర్ధారించాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు.

జాతీయ జలవిధానంలో తాగునీటి అత్యంత ప్రాధాన్యమున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, మిషన్ భగీరథ, పట్టన నీటి సరఫరా అధికారులతో మంత్రి సమావేశమయ్యారు. 2017 డిసెంబర్ నాటికి మిషన్ భగీరథ కింద తాగునీటి సరఫరా ప్రారంభం కావాల్సి ఉన్నందున జలాశయాల్లో కనీస నీటి మట్టం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో ఎల్లంపల్లి, మిడ్‌మానేర్ జలాశయాలు కీలకం కావడంతో గోదావరి నీటిని వీటిలో నింపగలిగితే హైదరాబాద్ తాగునీటి అవసరాలకు, వందలాది గ్రామాలు, పట్టణాలకు తాగునీటి సమస్య శాశ్వతంగా తీరుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. తాగునీటి పథకాల అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

హమాలీల సమస్యల పరిష్కారానికి కృషి

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హమాలీల న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, వెంటనే సమ్మెను విరమించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ హమాలీలకు విజ్ఞప్తి చేశారు. మంత్రి ఈటల రాజేందర్‌తో చర్చించి, వీలైనంత త్వరలో సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యలను పరిష్కరించాలని జూలై 25 నుంచి హమాలీలు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం తెలంగాణ సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రతినిధులతో పౌరసరఫరాల భవన్‌లో కమిషనర్ చర్చలు జరిపారు. గతంలో ఇచ్చిన జీవో ప్రకారం ఈఎస్‌ఐ చట్టాన్ని హమాలీలకు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని, స్వీపర్ల కనీస వేతనం అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్.బాలరాజు, ఉపాధ్యక్షుడు ఎస్‌కే బాబుమియా మాట్లాడుతూ 50 ఏండ్లు నిండిన గీత, చేనేత, బీడీ కార్మికులకు ఇస్తున్నట్టు హమాలీలకు కూడా వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని, తొలగించిన సెక్యూరిటీ గార్డులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. కమిషనర్ మాట్లాడుతూ హమాలీల్లో క్రమశిక్షణ, పనితీరు మరింత మెరుగుపడాలని సూచించారు.

చాలీచాలని కమిషన్‌తో బతకలేకపోతున్నాం

- ప్రభుత్వం ఆదుకోవాలి: రేషన్ డీలర్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నామమాత్రపు కమిషన్‌తో జీవనాన్ని కొనసాగించలేకపోతున్నామని, ప్రభుత్వం తమను అన్నివిధాలా ఆదుకోవాలని పలువురు రేషన్ డీలర్లు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వంపై నమ్మకంతో నమ్మకంతో సమ్మెను విరమిస్తున్నామని తెలిపారు. ఆర్‌టీసీ, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, హోంగార్డులు, జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులు ఇలా ప్రతివర్గానికి ప్రభుత్వం న్యాయం చేసింది. తమకు కూడా న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్ బాబు నాయకత్వంలోని రేషన్ డీలర్ల బృందం కమిషనర్ సీవీ ఆనంద్‌తో సోమవారం పౌరసరఫరాల భవన్‌లో సమావేశమయ్యారు. సోమవారం నాటికి దాదాపు పదమూడు వేల మంది డీడీలు కట్టారని, ఈసేవలో సర్వర్ పనిచేయడంలేదని అందువల్ల డీడీలు కట్టడానికి మరో రెండు రోజులు గడువు ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. గారిని కోరారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్, కమిషనర్ సీవీ ఆనంద్‌కు సంఘం కృతజ్ఞతలు తెలిపింది.

16లోగా హెల్త్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

- నాన్ అక్రిడిటెడ్, రిటైర్డ్ జర్నలిస్టులకు అవకాశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న నాన్ అక్రిడిటెడ్, రిటైర్డ్ జర్నలిస్టులు ఈనెల 16లోగా హెల్త్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం కోరింది. సోమవారం హైదరాబాద్‌లోని సమాచార భవన్‌లో అక్రిడిటేషన్, హెల్త్ కార్డుల రాష్ట్రస్థాయి సమీక్ష కమిటీ సమావేశం చైర్మెన్ అల్లం నారాయణ అధ్యక్షతన జరిగింది. దీనికి జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు క్రాంతికిరణ్, పల్లె రవికుమార్, విరాహత్ అలీ, బి.బసవపున్నయ్య, ఉద్యోగ, జర్నలిస్టుల ఆరోగ్య పథకం సీఈవో డాక్టర్ కె పద్మ, ఆరోగ్యశ్రీ ట్రస్టు జనరల్ మేనేజర్ సోమ శేఖర్, సమాచార శాఖ సంయుక్త సంచాలకులు ఇ వెంకటేశం, అసిస్టెంట్ డైరెక్టర్ ఎంఏ హష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య పథకం అమలును సమీక్షించారు. దరఖాస్తులను సమాచార శాఖ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ రాష్ట్ర కేంద్రం అయితే సమాచార భవన్, జిల్లాల్లో అయితే డీపీఆర్‌ఓలకు దరఖాస్తులను సమర్పించాలని కోరారు. దరఖాస్తు లను సమర్పించే ముందు పత్రిక, మీడియా సంస్థ యాజమాన్యం వద్ద లేదా బ్యూరో చీఫ్ లేదా ఎడిషన్ ఇన్‌చార్జి లేదా జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సంతకంతో ధ్రువీకరణ చేయించి నిర్ణీత గడువు లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు తమ గుర్తింపు కార్డు లేదా అపాయింట్‌మెంట్ లెటర్ జతచేయాలని కోరారు.

సంపాదకీయం

నేరెళ్ల మార్కు ప్రజాస్వామ్యం

రాష్ట్రంలో పోలీసు దర్బార్ ఫలితాలు సత్తా చూపిస్తున్నాయి. చిత్రహింసలు ప్రజలకు హెచ్చరికగా నిలిచాయి. పోలీసు మార్కు మర్యాదలకు మచ్చుతునకలుగా సాక్షాత్కరించాయి. ఇది తెలంగాణ ప్రజలకు ఉద్యమ నాయకత్వం అందించిన బహుమానం. జులై నాలుగున అరెస్టు చేసిన నిరుపేదలు, దళితులు నాలుగు రోజుల పాటు ఎక్కడున్నారో తెలియదు. ఏడవ తేదీన అరెస్టు చేసినట్టుగా అధికారికంగా తెలిపారు. అర్ధరాత్రి నిద్రలేపి అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు. శరీరంలో ప్రయివేటు భాగాల్లో కరెంటు షాకులిచ్చారు. గంజాయి కేసులో ఇరికిస్తామన్నారు. భార్యా బిడ్డల మీద వ్యభిచారం కేసు పెడతామని బెదిరించారు. ఇతకూ వారు చేసిన నేరం ఏమిటి? ఇసుక మాఫియా ఆగడాలను ప్రశ్నించడమే. సహజ వనరులను కొల్లగొడుతూ మనుషుల ప్రాణాలను పశుప్రాయంగా పరిగణిస్తున్న అధికార దర్పం మీద తిరగబడటమే వారు చేసిన పాపం. దళిత మహిళలు, తెలంగాణ ఆడబిడ్డలు... రోదిస్తూ తమ తమ భర్తలు ఎక్కడున్నారో చూపించాలనీ కాళ్లా వేళ్లా పడుతుంటే.. జిల్లా పోలీసు బాసు నవ్వుతున్నారట! ఇది ఖాకీలు పోలీసు దర్బార్ నుండి పొందిన నూతనోత్తేజ ఫలితం. పోలీసు అధిపతులకు రాష్ట్ర ప్రభుత్వాధినేతలు అందించిన అభినందనల మాల చూపిన దారి. జిల్లాలో అత్యున్నత పోలీసు అధికారి దళితులను రోడ్డు మీదకు వస్తే నల్లుల్లా నలిపేస్తామన్నారంటే.. పరిస్థితి ఎక్కడిదాకా వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. ఎవరి ఆశీర్వాద ఫలితమో గ్రహించవచ్చు.

అధికార పార్టీలోకి ఫిరాయించిన నేతలకు ఇదొక సంపాదన మార్గంగా కూడా పాలకులు పంపకాలు చేశారు. రాజులు అగ్రహారాలను దానమిచ్చినట్టు ఇక్కడ ఇసుక క్వారీలను కట్టబెట్టారు. అందుకే ప్రశ్నించడాన్ని సహించలేక పోతున్నారు. ఎంతటి దాడులకైనా తెగబడుతున్నారు. ఉద్యమ నాయకత్వానికి ఉద్యమ సమాధానం తప్ప మరొకటి ఆనదు కదా!



మాఫియాలను మరెవ్వరూ ప్రశ్నించకుండా, తలెత్తుకుని తిరగకుండా ఇదొక హెచ్చరికగా తెలంగాణ సమాజానికి చెప్పదలిచారు. ధిక్కారము సైతునా... అన్నట్టుగా సర్కారు కొరడా ఝుళిపిస్తున్న ది. చిన్న జిల్లాలంటే ఏదో ఒరిగిపోతుం దని కలలుగన్న ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. ప్రజల చేరువలోకి ప్రభుత్వ యంత్రాంగం వస్తుందంటే ఏమో అనుకున్నారు. ప్రజల వద్దకు పాల న సంగతేమిటో గానీ జనం మీద పోలీ సు జులుం మాత్రం మరింత సులువైం ది. నిమిషాల్లో ఎస్పీ సహా పోలీసు అధికారులంతా జనం మీద విరుచుకుపడ్డారు. మాఫియా సేవలో తరించారు. చిన్న జిల్లాలైతే రియల్‌ఎస్టేట్ ఎ ా ్య ఎ ా ం ౕ ం పుంజుకుంటుందనుకున్నారు. తమ జిల్లా కేంద్రం అభివృద్ధి చెందుతుందని కలలుగన్నారు. జిల్లా కేంద్రం తమకు దగ్గరవుతుందని ఆశపడ్డారు. రియల్ ఎస్టేట్ సంగతీ అభివృద్ధి సంగతీ ఏమోగానీ... దళితవాడలు, పేదల గుడిసెలు, మారుమూల గ్రామాలకు పోలీసు అధికారులూ, వారి మందీ మార్బలం మాత్రం మరింత దగ్గరైంది. నిముషాల్లో వాలిన పోలీసులు విశ్వరూపం ప్రదర్శించారు. చిత్రహింసలు పెట్టిందే కాకుండా దెబ్బతిన్న వారిలో నలుగురే దళితులని మాట్లాడుతున్నారు. దళితులు కాకపోతే చిత్రహింసలకు గురిచేయవచ్చా? ఈ ఘటన అంతా కేవలం ఒక రోడ్డు ప్రమాదం పర్యవసానంగా కొట్టిపారేస్తున్నారు. రోజుకు 1500 లారీలతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారికి నేతల అండదండలను కప్పిపెట్టే కుయుక్తి తప్ప మరొకటి కాదు. నయీం నేర సామ్రాజ్యంతో మొదలైంది. ఒక్కటేమిటీ? ఇప్పుడు ఇసుక మాఫియా, భూమాఫియా, డ్రగ్స్ మాఫియా... ఇంకా ఎన్ని చూడవల్సి వస్తుందో! మాఫియా నీడలో సేదతీరే పాలకులు గానీ, వారి పోలీసు బలగాలు గానీ ఇక చట్టాన్నీ, రాజ్యాంగాన్నీ ఖాతరు చేస్తారనుకోవడం భ్రమ. నేరెళ్ల పేదలే కాదు.. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కూడా వీరికి లెక్కకాదు. ఆమె ఫిర్యాదును కూడా కొన్ని గంటలపాటు ఎస్పీ ఖతరు చేయలేదు. కదా! ఇక సిరిసిల్ల పేదలొక లెక్కా!

ఇంత జరుగుతున్నప్పటికీ పాలకులు మాత్రం నీరో చక్రవర్తి చెప్పుల్లోనే కాళ్లు పెట్టారు. కనీస పశ్చాత్తాపం లేదు. ప్రజాస్వామ్యమంటే లెక్కలేదు. ఒక్క పోలీసు అధికారి మీద కూడా చర్య లేదు. పైగా బాధితులకు అండగా నిలవటాన్ని కూడా సహించగల స్థితిలో పాలకులు లేరు. బహిరంగ సభలకు అనుమతి లేదు. నీతి సూత్రాలు చెబుతూ నిరంకుశ పోకడలు పోతున్నారు. ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయంటున్నారు. ప్రజలను రెచ్చగొడుతున్నాయని నిందిస్తున్నారు. బాధిత ప్రజలకు అండగా నిలబడటం రాజకీయం అని శాపనార్థాలు పెడుతున్నారు. ప్రజలకు కనీసం భరోసానిచ్చే వారు లేకుండా చేసి వారి నోరు మూయించి, మాఫియాకు రాష్ట్ర సంపదను వడ్డించే ప్రయత్నమే తప్ప మరొకటి కాదది. చిత్రహింసలెందుకు పెట్టారనే ప్రశ్నకు సమాధానం చెప్పకుండా... ఇసుక తవ్వకాలను క్రమబద్ధీకరించామంటున్నారు. ప్రభుత్వం ఆదాయం పెరిగిందంటున్నారు. నిజమే... ఇసుక తవ్వకాలు పెరిగాయి. ఇసుక ధర సిమెంటుతో సమానమైంది. ఆ మేరకు ప్రభుత్వ ఆదాయం పెరిగింది. అధికార పార్టీ నేతలకూ, అధికారులకూ అంతకన్నా అనేక రెట్లు అక్రమాదాయం పెరిగింది. అధికార పార్టీలోకి ఫిరాయించిన నేతలకు ఇదొక సంపాదన మార్గంగా కూడా పాలకులు పంపకాలు చేశారు. రాజులు అగ్రహారాలను దానమిచ్చినట్టు ఇక్కడ ఇసుక క్వారీలను కట్టబెట్టారు. అందుకే ప్రశ్నించడాన్ని సహించలేక పోతున్నారు. ఎంతటి దాడులకైనా తెగబడుతున్నారు. ఉద్యమ నాయకత్వానికి ఉద్యమ సమాధానం తప్ప మరొకటి ఆనదు కదా!

టీఎస్‌పీఎస్సీ భుజాలపై సర్కారు గన్ను




ఎం. విప్లవకుమార్

**నిరాశ నిస్పృహల మధ్య
ఒక నిరుద్యోగిని ఫ్రేమ్‌కట్టినా
అందమైన సమాధి కట్టినా
ఆ నేరం ప్రభుత్వానిదే....** అని హెచ్చరించాడు తెలంగాణ కవిత్వ మాంత్రికుడు అలిశెట్టి ప్రభాకర్. ఉమ్మడి రాష్ట్రంలో నిరుద్యోగులు పిట్టల్లా నేల రాలారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆ పరిస్థితి కొనసాగుతూనే ఉన్నది. జగిత్యాల జిల్లా గట్టుపల్లి సతీష్, సూర్యాపేట జిల్లా బారెడ్డి వెంకట్ రెడ్డి, నల్లగొండ జిల్లా సాయికుమార్ 2017 మార్చి నుండి జూన్ మధ్య ఉద్యోగం దొరకక ఆత్మహత్యలు చేసుకున్నారు. ఎవరి కుట్రలకు బలవుతున్నారు వీరంతా..? స్వరాష్ట్రం స్వయం పాలనలో కూడా నిరుద్యోగులు ప్రాణాలర్పించక తప్పని పరిస్థితి తలెత్తింది. తిరుగుబాటు తత్వమున్న తెలంగాణ నేలకు తిరోగమన ఆలోచనల తీర్థం పోసిన దుర్మార్గులెవ్వరు? ఉద్యోగాల కోసం ఊపిరి వదులుతున్నా పాలకులెవ్వరూ నోరు మెదపరు. పైగా ఇదిగో డీఎస్సీ, అదిగో డీఎస్సీ అంటూ 30 సార్లు ప్రకటించి నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను ముప్పతిప్పలు పెట్టి కోచింగ్ సెంటర్ల కోరలకు బలి చేస్తూనే ఉన్నారు. మానసికంగా, ఆర్థికంగా కుంగిపోతూ డిప్రెషన్‌కి గురైన నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సాక్షాత్తు రాజ్యాధినేత ఉపనేతల స్థాయిలో చేసిన ప్రకటనలు అబద్ధమైపోతున్నాయి. మూడు నెలల్లో 8792 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని మార్చి 24న తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించి నాలుగు నెలలైంది. కోర్టు ఆదేశాలను ఖాతరు చేయలేదు. గులాబీ రాజ్యంలో జవాబే కరువైంది.

యువతను కోర్టుల చుట్టూ తిప్పకుండా పనిలో నిమగ్నమయ్యేటట్టు చేయాలి. వారి అర్హతకు తగిన కొలువు ఇవ్వాలి. అది జరగనప్పుడు యువత ఆగ్రహించడం అనివార్యమవుతుంది. తీయని మాటలతో నోటిఫికేషన్ల ఆశలు చూపిస్తూ పాలకులు ఎంతకాలం దాటవేయజాలరు. ఎన్నికల సహాయంతో మరోసారి ఓట్ల రాజకీయానికి ఉపాధి సమస్యను వాడుకుందామనుకుంటే అర్థం చేసుకోలేని అమాయకులు కాదు యువత.

ఉద్యోగాల కల్పనలో వైఫల్యాలు ఎవరి ఖాతాలో జమవుతున్నాయి? పాలకులకు అంటాల్సిన బురద ఎవరికంటుతున్నది? పాలకులకు నిరుద్యోగులకు మధ్య బదనామవుతున్నది ఎవరు? ప్రభుత్వం ఎవరి భుజాలపై తుపాకి పెట్టి నిరుద్యోగులను కాలుస్తున్నది? 14 లక్షల మంది నిరుద్యోగులతో "తల్లడిల్లుతున్న తెలంగాణ" అంటూ ఉద్యమించినవారు తత్తరపాటుకు గురికావడం, ప్రభుత్వ తప్పులకు బలికావడం ఆవేదనా భరితం. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పడినప్పుడు లోగో విడుదల చేసినప్పుడు తెలంగాణలో నిరుద్యోగానికి చెక్‌పెట్టే పెన్సిలిన్ మందు టీఎస్‌పీఎస్సీయే అన్నట్టు యువరాజు ప్రకటించారు. తెలంగాణ యువత ఆకాంక్షల ప్రతిరూపం టీఎస్పీఎస్సీ అని ఊదరగొట్టారు. కొలువుల జాతర, కొలువులే కొలువులు, తీపికబురు ప్రకటనలన్నీ తిప్పేసిన కాలెండర్‌లోని మాసిపోయిన పేజీల్లాంటివే. 2014 డిసెంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన టీఎస్పీఎస్సీ పాలకమండలి చైర్మన్‌గా, సామాజిక శాస్త్ర ఆచార్యులే సారథిగా ఎంపికయ్యాడన్న సంబరం తెలంగాణ యువతకు ఎన్నో రోజులు మిగల్లేదు. నవ తెలంగాణా లో ముద్రితమైన జె.వి. కార్టూన్ వలె టీఎస్పీఎస్సీ ఎన్ని నోటిఫికేషన్స్ బాణాలు వేసినా తిరిగొచ్చి తమ బుట్టలోనే పడుతున్నాయి. గవర్నర్‌కిచ్చిన టీఎస్పీఎస్సీ నివేదిక ప్రకారం 2017 జనవరి 19 నాటికి భర్తీ చేసిన ఉద్యోగాలు 4295 మాత్రమే. ఈ ఆరు నెలల్లో భర్తీ చేసిన 9962 కానిస్టేబుల్ పోస్టులతో కలిపి 14,257 పోస్టులు ఈ మూడేండ్లలో టిఎస్పీఎస్సీ ద్వారా మొత్తం భర్తీ చేసిన ఉద్యోగాలు ఇంకా విడుదల చేయాల్సి ఉన్న 510 ఎస్ఐ పోస్టుల ఫలితాలు ఎన్ని రోజులు ముగబెడతారో వేచి చూడాలి. అగ్రికల్చర్, హార్టికల్చర్ ఆఫీసర్స్ పోస్టులు, ఎక్స్‌టెన్షన్ పోస్టులకు సంబంధించిన నాలుగు నోటిఫికేషన్స్ కోర్టుల్లో నెలల తరబడి ఉండి ఎట్టకేలకు బయటపడ్డాయి. కానిస్టేబుల్ ఫలితాల నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



గ్రూప్ - 1, 2 గురుకులాల నోటిఫికేషన్లు కూడా కోర్టు కేసుల్లోనే ఇరుక్కుపోయి ఉన్నాయి. ఒక దాని తర్వాత ఒకటి ఏడు నోటిఫికేష్స్ లొసుగుల కారణంగా కోర్టుకెక్కి పెండింగ్‌లో ఎందుకుండాల్సి వస్తున్నది? న్యాయపరమైన చిక్కులు రాకుండా చూసుకోవడం కంటే పాలకుల వైపు నుండి చిక్కులు లేకుండా చూసుకోవడమే టీఎస్పీఎస్సీ తిప్పలుగా కనిపిస్తున్నది. ఈనేపథ్యంలోనే టెట్, డీఎస్సీలను టీఎస్పీఎస్సీ నిర్వహించొద్దని నిరుద్యోగుల నుండీ యువజన సంఘాల నుండీ డిమాండ్లు వెల్లువెత్తాయి. అవినీతి రహిత, ఆదర్శ వ్యవస్థగా తీర్చిదిద్దుతామన్న టీఎస్పీఎస్సీ ఏర్పడిన మూడేండ్లలోనే కోర్టుల చుట్టూ తిరుగుతూ అక్రమాలు, అవకతవకలు జరిగాయనీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తూ టీఎస్పీఎస్సీ నిజాయితీని శంకించే స్థితికి ఎందుకొచ్చింది.

టీఎస్పీఎస్సీ స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థ. ఒక రాజ్యాంగ బద్ధ సంస్థగా మార్గదర్శకాల ప్రకారం స్వతంత్రంగా పనిచేయాలి. ఖాళీలు, ఇండెంట్ల ప్రతిపాదనలతోపాటు మార్గదర్శకాలను కూడా పాలకపక్షం ప్రభావితం చేయడం మూలంగానే టీఎస్‌పీఎస్సీ పరాధీనతకు గురవుతుంది. ఉస్మానియా విద్యార్థులతోపాటు రాష్ట్రంలో ఎక్కడా ఉద్యోగాలకోసం ధర్నాలు చేసే అవసరం రాకుండా, నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చేవిధంగా చూస్తానని చెప్పిన మాటలు మరువజాలము. కమిషన్ సభ్యులు, కమిటీ మేధావులు, న్యాయనిపుణులు ఇలా ఎంతోమంది తనకు అందుబాటులో ఉన్నా ఇక్కడ నిర్ణయించే పరిస్థితి లేదు. టీఆర్ఎస్ భవన్ నుండో, ప్రగతిభవన్ నుండో వస్తున్న రాజకీయ ఆధిపత్యానికి తలొగ్గి మార్గదర్శకాలివ్వడం మూలంగానే ప్రతి నోటిఫికేషనూ న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తున్నది. ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేయడం ఇష్టంలేకనే ఇలాంటి లొసుగులకు తావిస్తోందని నిర్ధారణకు రావచ్చు. అందుకే నోటిఫికేషన్స్‌లోని లొసుగుల కారణంగా విడుదలైన వెంటనే వివాదాలతో కోర్టు కెక్కుతున్నాయి. ఇప్పటివరకు వేశామని చెపుతున్న 34 నోటిఫికేషన్స్ 10 వేల పోస్టులకు మించిన నోటిఫికేషన్ ఒక్కటీ లేదు. కానిస్టేబుల్, గురుకులాల నోటిఫికేషన్స్ మినహాయిస్తే అన్నీ చిన్నవి, అతి చిన్నవీ, సూక్ష్మమైనవే. ఈ నోటిఫికేషన్స్ పెనంపైన దొర్లిపడ్డ నీటి బిందువులాంటివే. ప్రభుత్వం ప్రకటించిన ఒక లక్షా ఏడు వేల ఏడు వందల నలభైనాలుగు పోస్టులూ, 2014జూన్ తర్వాత ఐన 30 వేల ఖాళీలూ 2017 జూన్ 15 నాటికి అయిన 15 వేల ఖాళీలతోపాటు, కొత్త జిల్లాలకు అవసరమైన 87 వేల 801 పోస్టులూ, 23080 ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులూ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పోస్టులు కూడా ఇలా మొత్తం కలిపి 2,63,625 పోస్టులు భర్తీ చేయాల్సినదానికి 14 లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు.

ఉద్యోగాల భర్తీ కోసం టీఎస్పీఎస్సీకి ఒక స్పష్టమైన ప్రణాళిక లేదు. ఇది "శక్తి దారిద్ర్యంకాదు, స్వేచ్ఛా దారిద్ర్యమే." మూడేండ్లవుతున్నా కనీసం ఇయర్ కాలెండర్ లేదు. ప్రభుత్వం ఖాళీల ఇండెంట్ ఇచ్చినపుడే నోటిఫికేషన్స్ ఇస్తామంటున్నారు. నిజమే కదా! ఇది ప్రభుత్వం చేయవల్సిన పని. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాదిరిగా టిఎస్పీఎస్సీ ఇయర్ కాలెండర్ ప్రకటిస్తే తప్పేమిటి? ఇందుకు ప్రభుత్వం ఎందుకు అనుమతించడం లేదు. 440 మంది ఉద్యోగులు టీఎస్పీఎస్సీకి అవసరముండగా 128 మంది మాత్రమే ఉన్నారు. వారిలో 40 మంది అటెండర్లే. ఈ రెండున్నరేండ్లలో 22 ఖాళీలు ఏర్పడగా మిగిలింది 106 మంది మాత్రమే. టీఎస్పీఎస్సీ కనీసం తన ఖాళీలను తనే భర్తీ చేసుకునే స్థితిలో లేదు. ఖాళీలున్నది నిజం. వాటిని భర్తీ చేయాల్సిన అవసరం తెలంగాణ బిడ్డల త్యాగాలంత నిజం. అలాంటప్పుడు ఒక రాజ్యాంగ బద్ధ సంస్థగా టీఎస్పీఎస్సీ డిజిటలైజేషన్ ప్రారంభించి 90శాతం పూర్తి చేయడం శుభపరిణామమే. కడుపులో తిండి లేకుండా కాపీష్కుడు కండ లేకుండా పైపై మెరుగులు ఎన్ని దిద్దినా నిరర్థకమే. కంప్యూటర్లు చూపించి, కమ్మని ముచ్చట్లు చెప్పి దేశానికే ఆదర్శం అంటే ఎట్లా సారూ? డిజిటలైజేషన్ కోసం కాదు గదా సారూ దివిటీల వలె శరీరాల్ని వెలిగించి తెలంగాణ కావాలని నినదించింది! తనువులను తాంబాలంలో పెట్టి తెలంగాణ తల్లికి హారతిస్తున్నప్పుడు ఆటంకాలు, అభ్యంతరాలేవీ విన్పించవాయెగా సారూ! త్యాగమే మా భోగం తెలంగాణే మా జీవన యోగం అని నిరుద్యోగులంతా నిప్పుల జెండాలై రెపరెపలాడింది ఎందుకు? తెలంగాణలో కడుపుకోత, కంటిశోకం కలలుగన్నది దేనిని? కొలువులనే కదా సారూ! మూడేండ్లలోనే వేలాది ఎకరాల భూములు కార్పొరేట్ విదేశీ కంపెనీలకు కట్టబెట్టవచ్చు. ఎమ్మెల్యే నుండి ముఖ్యమంత్రి వరకు లక్షల రూపాయలు జీతాలు పెంచుకోవచ్చు. సర్పంచ్, ఎంపీటీసీల నుండి ప్రజా ప్రతినిధులందరికి నెలవారీగా జీతాలివ్వొచ్చు. ఇన్నింటికి లేని ఇబ్బందులు, ఆటంకాలు మా కొలువుల దగ్గరే ఎందుకని గోసదీస్తున్న యువత అడుగుతోంది.

అట్టహాసాల నోటిఫికేషన్లు, అవాంతరాల ప్రహసనాలతో విసిగివేసారుతున్న నిరుద్యోగులు టీఎస్పీఎస్సీ యెడల విశ్వాసం కోల్పోతున్నారు. కనుకనే న్యాయం కోసం న్యాయస్థానం మెట్లపై తచ్చాడుతున్నారన్న విషయం నిజం. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, యువతను కోర్టుల చుట్టూ తిప్పకుండా పనిలో నిమగ్నమయ్యేటట్టు చేయాలి. వారి అర్హతకు తగిన కొలువు ఇవ్వాలి. అది జరగనప్పుడు యువత ఆగ్రహించడం అనివార్యమవుతుంది. తీయని మాటలతో నోటిఫికేషన్ల ఆశలు చూపిస్తూ పాలకులు ఎంతో కాలం దాటవేయజాలరు. ఎన్నికల సహాయంతో మరోసారి ఓట్ల రాజకీయానికి ఉపాధి సమస్యను వాడుకుందామనుకుంటే అర్థం చేసుకోలేని అమాయకులు కాదు యువత.

సెల్: 9030546896

మెయిల్ @ నవతెలంగాణ

జేఎన్‌టీయూహెచ్ వైఖరి మారాలి...



పోటు నారాయణ

జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం నిర్ణయాలు సవ్యంగా లేవు. అనేక సాంకేతిక సమస్యలున్నాయి. పాలక మండలి నిర్ణయాలు అటు అధ్యాపకులను, ఇటు విద్యార్థు లను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాయి. ఇటీవలి క్రెడిట్ బేస్డ్ సిస్టమ్ మూలంగా విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేయాల్సి వస్తుంది. అంతేకాదు, విద్యార్థులు ఒక ఏడాదితోపాటు అనేక అవకాశాలు కోల్పోయే అవకా శముంది. ఈడిటెన్షన్ వలన విదేశాలకు వెళ్లాలను కునే విద్యార్థులకి నిరాశే మిగులుతుంది. వారు ఏదైనా ఉద్యోగం, లేదా పై చదువులకి వెళ్లాలను కుంటే అక్కడ వారికి అర్హత ఉండదు. సాధారణంగా నాలుగేండ్లలో అయిపోవాల్సిన బీటెక్ ఈ డిటెన్షన్ విధానం వలన అదనంగా ఒకటీ లేదా రెండేండ్లు పడుతుంది. సప్లిమెంటరీ పరీక్షలని రద్దు చేసి విద్యార్థుల్ని మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది. ఇంతకు ముందు తుది పరీక్షల ప్రవేశాలలో మార్కులు ఇచ్చేవాళ్లు కానీ, ఇప్పుడు పాయింట్స్ విధానం ప్రవేశపెట్టి గందరగోళానికి దారి తీసింది. పరీక్షల్లో ఉత్తీర్ణత కాని విద్యార్థులు వారు ఎన్ని మార్కుల దగ్గర ఉత్తీర్ణత కోల్పోయారో తెలుసుకోవటం కష్టం. విద్యార్థి రీవాల్యుయేషన్, రీకౌంటింగ్‌కి దరఖాస్తు చేసుకోవాలనుకున్న అసలు మార్కులు తెలియని గందరగోళ పరిస్థితి. అలా రీవాల్యుయేషన్, రీకౌం టింగ్‌కి దరఖాస్తు చేసుకున్నా ఆ ఫలితాలు ఎప్పుడొస్తాయో తెలియని అయోమయ పరిస్థితి. విద్యారం గంలో డ్రాపవుట్స్ పెరుగుతున్న వేళ ఇక్కడ విశ్వవిద్యాలయమే విద్యార్థులను డ్రాప్ అవుట్ చేస్తున్నది. విద్యార్థులకి ఆయా సెమిస్టర్‌లలో ప్రవేశపెట్టే సబ్జెక్టుల ఎన్నిక కూడా నామమాత్రంగా ఉంటున్నది. ఉదాహరణకి ఈసెమిస్టర్‌లో రెండో ఏడాది కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకి డేటా స్ట్రక్చర్స్ సబ్జెక్ట్ ఓరియెంటెడ్ ప్రోగ్రామింగ్ రెండూ ఒకే సెమి స్టర్‌లో పొందుపరిచారు. ఇవి రెండూ కంప్యూటర్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్. ఒకటవ పీరియడ్ డీఎస్, రెండో పీరియడ్ ఊప్స్ ఉంటే రెండింట్లో ఒకే కాన్సెప్ట్ రెండు విధాలుగా రిప్రెజెంట్ చేయాల్సి ఉంటుంది. ఒక విద్యార్థిగా ఒకే కాన్సెప్ట్ రెండింటిలో ఎలా రిప్రె జంట్ చేస్తారు? చివరికి వారికి ఏదీ పూర్తిగా రాదు. ఒక సెమిస్టర్ తర్వాత మరొకటి పరిచయం చేస్తే బాగుంటుంది. విద్యార్థులపైన ఒత్తిడి కలిగించే ఇటువంటి చర్యలకి స్వస్తి పలికి, మానవతా వాదా న్ని దృష్టిలో పెట్టుకొని, పాలకమండలి జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకొని విద్యార్థులకి న్యాయం చేయా లి. వెంటనే విద్యార్థులకి పాయింట్ విధానం ఎత్తివే యాలి. అడ్వాన్సుడు సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించి విద్యార్థులకి న్యాయం చేయాలి. ఇక నుండి ఏ సబ్జెక్టు ఎవరు దిద్దారు వారి అనుభవం ఎంత అనేది వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలి. రీవాల్యూయేషన్, రీకౌంటింగ్ ఫలితాలు దరఖాస్తు చేసుకున్న వారం లేక పది రోజులలో విడుదల చేయాలి.

సెల్ : 970868721

ప్రజావాణి

డ్రగ్స్..పబ్బులు..

.డ్రగ్స్...డ్రగ్స్....ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఇదే మాట్లాడుతున్నారు. అసలు ఈ డ్రగ్స్ వాడకాన్ని వదిలించాలంటే ముందు నగరంలోని పబ్బులను ఎత్తేయాలి. నగరంలోని పబ్బులన్నీ బడాబాబుల వ్యవహారంగా ఆరోపణలొస్తున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ కాలేజీల్లోని పిల్లలకు ఈ డ్రగ్స్ బాగా అందుబాటులో ఉంటాయనే ప్రచారంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రచారం మాటేమోగానీ, ప్రభుత్వం మాత్రం ఇంతవరకూ డ్రగ్స్ మాఫియాలోని పెద్దోళ్లను అదుపులోనికి తీసుకోలేదు. తమ పిల్లల్ని అదే కాలేజీల్లో చదువు కొనసాగించాలా, లేదా అనే తర్జనభర్జనతో సతమతమవుతున్నారు. లేదా మరో నగరంలో చదివించాలని అనుకున్నా ఇంత సడెన్‌గా మళ్లీ అంతంత భారీ ఫీజులు ఎలా కట్టగలమని కూడా ఆందోళన చెందుతున్నారు. తక్షణం పబ్బుల్ని మూసేయడానికి సర్కార్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


– మీరాబాయి, బల్కంపేట

తల్లిపాలే శ్రేష్ఠం...

బిడ్డలకు తల్లిపాలే శ్రేష్ఠం. తల్లిపాలలోని పోషక విలువలు పిల్లలలో చురుకుదనాన్నీ, తెలివితేటల్నీ పెంచుతాయి. ఫాటీ ఆమ్లాలు పిల్లల మెదడు అభివృద్ధి చెందడంలో బాగా తోడ్పడతాయి. ఎక్కువ కాలం పాలు యిస్తే ఆ పిల్లలలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఊపిరితిత్తుల వ్యాధులు, రక్తపోటు రాకుండా తల్లిపాలు నిరోధించగల్గుతాయి. తల్లిపాల వల్ల శిశుమరణాల సంఖ్య తగ్గుతుంది. బిడ్డలకు పాలిచ్చే తల్లులకు బ్రెస్టు క్యాన్సర్ వచ్చే అవకాశం 60శాతం వరకూ తగ్గుతుందని డాక్టర్లు చెబుతున్నారు. ఇలాంటి విషయాలను తల్లిదండ్రులకు అవగాహన కల్గించడం కోసం ప్రతి ఏడాది ఆగస్టు ఒకటవ తేదీన తల్లిపాల దినోత్సవంగా నిర్వహిస్తుంటారు.

– శ్రావ్యారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

స్వేచ్ఛా వాణిజ్యం చర్చలు.. హైదరాబాద్ తర్వాత..



అరిబండి ప్రసాద్‌రావు

గత స్వేచ్ఛా ఒప్పందాల దుష్ప్రభావాల నేపథ్యంలో హైదరాబాద్ చర్చల సందర్భంలో "స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రజా ప్రతిఘటన వేదిక" ఏర్పడింది. ఈవేదికలో వివిధ ప్రజా సంఘాలున్నాయి. ఈ ఒప్పందాల వల్ల వచ్చిన, రాబోయే దుష్ప్రభావాల నుండి దేశ ప్రజలను చైతన్యపరిచి, వాటిని ఎదుర్కొనేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను ప్రజల భాగస్వామ్యంతో ఈ వేదిక రూపొందిస్తుంది.

చరిత్రలోనే అతిపెద్ద (మెగా) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద చర్యలు "ఆర్‌సీఈపీ (రీజనల్ కాంప్రహెన్సివ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్)" అనే పేరుతో జులై 24–28 మధ్య హైదరాబాద్‌లో రహస్యంగా 16 దేశాల మధ్య జరిగాయి. వీటిలో భారత్‌తోబాటు శక్తివంతమైన చైనా, జపాన్, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా న్యూజిలాండ్‌లు 10 ఏషియన్ దేశాలు పాల్గొన్నాయి. ఈ చర్చలు 2012లో ప్రారంభమైనాయి. హైదరాబాద్‌లో 19వ రౌండ్ జరిగింది. ప్రధానంగా ఈ చర్చల్లో ఉత్పత్తులు, సేవలు, తయారీ రంగం, వాణిజ్యం పెట్టుబడులు, ఆర్థిక, సాంకేతిక సహకారాలు, పేటెంట్లకు సంబంధించిన అంశాలు చర్చించినట్టు తెలుస్తోంది. ఈ చర్చల్లో దాదాపు 27 శాతం ప్రపంచ వాణిజ్యం (దాదాపు 75 లక్షల కోట్ల డాలర్ల విలువగలవి), 52 శాతం ప్రపంచ జనాభా భవిష్యత్తు ఇమిడి ఉన్నాయి.

"స్వేచ్ఛా, వాణిజ్యం ఒప్పందం" పదాలు మభ్యపూర్వకమైనవి. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో ఈ ఒప్పందాల్లో అంతే స్వేచ్ఛ ఉంటుంది. కేవలం వస్తువులు, పెట్టుబడులు ఈ ఒప్పంద దేశాల్లో స్వేచ్ఛగా ప్రయాణించే వీలుంటుంది గానీ శ్రామికులకు, సాంకేతిక నిపుణులకు, ఇతరులకు ఇలా వీలుండదు. వాణిజ్యం కూడా కచ్చితంగా మార్కెట్ సూత్రాలకు అనుగుణంగా జరిగేది కాదు. అభివృద్ధి చెందిన, ధనిక దేశాలు వారి ఉత్పత్తులకు భారీ రాయితీలను అందిస్తూ, ఏ దిగుమతి సుంకం లేకుండా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో చౌకగా 'డంపు' చేయటం ఈ వాణిజ్యంలో ఇమిడి ఉంది. ఈ ఒప్పందాలు సమానుల మధ్య జరుగుతున్నవి కావు. కార్పొరేట్ సంస్థలు, ఫైనాన్స్ పెట్టుబడి పక్షాన ఆయాదేశాల ప్రభుత్వాలు నర్మగర్భంగా అదిరింపు, బెదిరింపులతో, ఆర్థిక ఒత్తిళ్ళతో జరుగుతున్నవివి. ప్రపంచ వాణిజ్య సంస్థలో సాధించుకోలేని సౌకర్యాలను స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందాల ద్వారా ఫైనాన్స్ పెట్టుబడి, కార్పొరేట్ యాజమాన్యాలు రాబట్టుకోవటం ఈ ఒప్పందాల లక్ష్యం. అందువల్ల స్వేచ్ఛా వాణిజ్యాల నియమ నిబంధనలు ప్రపంచ వాణిజ్య సంస్థ నియమ నిబంధనలకన్నా కఠినంగా ఉంటాయి. చౌకగా ఒకేసారి దిగుమతయ్యే వస్తువులు (డంపింగ్) స్థానిక ఉత్పత్తిని, కార్మికుల ఉపాధి, వేతనాలపై దుష్ప్రభావం కలిగి ఉన్నాయి. ఇప్పుడు హైదరాబాద్ చర్చల్లో మన దేశ వ్యవసాయ రంగంపై ఆధారపడిన దాదాపు 52 శాతం పైగా జనాభా, దేశ ఆహార భద్రత కార్మికుల ఉపాధి వేతనాలు ఇమిడి ఉన్నాయి. చర్చలు రహస్యంగా జరగడంతో తీసుకున్న నిర్ణయాలు తెలియడం లేదు. కానీ, 2018 మధ్యనాటికి ఈ చర్చలు ముగుస్తాయని సంకేతాలొస్తున్నాయి.

చేదు అనుభవాలు

ఇంతవరకు మన దేశం 11 స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందాలను కుదుర్చుకుంది. వీటి నియమాలతో 22 శాతం వరకే అమలయ్యాయి. వీటి దుష్ప్రభావాలను అనుభవి



స్తున్నాం. కేవలం శ్రీలంక ఒప్పందం వల్ల రబ్బరు, కాఫీ, టీ, మిరియాల ధరలు కుప్పకూలడంతో కేరళ రైతులు సంక్షోభంలో పడ్డారు. ఇలాగే మలేషియా నుండి చౌక పామాయిల్ దిగుమతి అవడంతో మన ఆయిల్ ఫామ్ రైతులు సంక్షోభంలో పడ్డారు. హరిత విప్లవం వల్ల సాధించిన ఆహార స్వయం సమృద్ధిని వంటనూనె, పప్పుధాన్యాల దిగుమతితో కోల్పోయాం. ఏదో పేరుతో గోధుమలు, బియ్యం, పత్తి, పంచదార, పండ్లు, చివరకు కొన్ని కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. దీనివల్ల స్థానిక ఉత్పత్తిదారులు గిట్టుబాటుగాని మద్దతుధరలు కూడా లభించక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ సంక్షోభ పరిస్థితుల నుండి బయటపడేయడానికి చేష్టలుడిగిన పాలకులను చూస్తున్నాం. అందువల్ల చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు పూర్తిగా అమలయితే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవటం కష్టంకాదు.

హైదరాబాద్ చర్చల్లో 92 శాతం వస్తువులపై దిగుమతి సుంకాలను పూర్తిగా ఉపసంహరించాలని అభివృద్ధి చెందిన దేశాలు డిమాండ్ చేయగా భారతదేశం 85 శాతం వస్తువులకు ఒప్పుకున్నదని సంకేతాలు వచ్చాయి. కాని భారత్ ఆశిస్తున్న సేవల రంగంలో ఎలాంటి సౌలభ్యాలను పొందలేదు. ఈ ఒప్పందం వల్ల ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ చౌకపాల ఉత్పత్తులు నిరాటంకంగా దిగుమతైతే కష్టకాలాల్లో రైతుల్ని ఆదుకుంటున్న మన పాడిరంగం ఏంకావాలి? ఇంత తీవ్ర పరిణామాల వల్ల ప్రభావితమయ్యే ప్రజలను, రాష్ట్ర ప్రభుత్వాలను, చివరికి పార్లమెంటులోపల చర్చించకుండా ఏకపక్షంగా మెగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద చర్చలలో మాట్లాడటం ఏ మాత్రం ఔచిత్యం లేదు.

ఇప్పటికే చేసుకున్న వాణిజ్య ఒప్పందాల ప్రభావాలను, అంచనా వేసి ప్రజలకు వివరించాలి. తీవ్ర దుష్ప్రభావాలను ఎదుర్కొంటున్న వ్యవసాయమే జీవనాధారంగా గల వారికి, కార్మికులకు, ఇతరులకు రక్షణ వలయం ఏర్పర్చాలి. వీటిని పట్టించుకోకుండా వ్యవసాయ బాగోగులను రాష్ట్ర ప్రభుత్వాలే చూసుకోవాలని చెప్పడం అత్యంత బాధ్యతారాహిత్యం.

దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రజాబాహుళ్యానికి నష్ట పరిచే ఏ విదేశీ ఒప్పందాలను రహస్యంగా చేసుకునే వీలులేకుండా ప్రత్యేక చట్టాన్ని చేయాలి. పార్లమెంటు అంగీకారం లేకుండా ఇటువంటి ఒప్పందాలను చేసుకోకూడదు.

ప్రత్యామ్నాయాలు

దేశ ప్రజల ఆహార సార్వభౌమత్వానికి గ్యారంటీతో స్థానిక ఉత్పత్తిని సుస్థిరంగా కొనసాగే పద్ధతులను అనుసరించాలి. స్థానిక ప్రజల అత్యవసరాలను తీర్చడానికి స్థానిక తయారీదారులకు తప్పనిసరిగా లైసెన్స్ ఇచ్చే పద్ధతి కొనసాగించాలి. జీవరాసులు, స్థానిక విజ్ఞానంపై ఎటువంటి పేటెంట్ హక్కులను గుర్తించకూడదు.

అత్యవసర ప్రజా సేవలు–విద్య, వైద్యం, నీటి సరఫరా, సానిటరీ, ప్రభుత్వ సేకరణ లాంటి అంశాలను వాణిజ్య చర్చల నుండి మినహాయించాలి. పెట్టుబడిని, కార్పొరేట్ సంస్థలను రక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకోకూడదు. స్థానిక ప్రభుత్వాలను కోర్టుకీడ్చే అవకాశం కార్పొరేట్ యాజమాన్యాలకు కల్పించకూడదు. రహస్య వాణిజ్య ఒప్పందాలకు బదులు పారదర్శికంగా చర్చించి ఒప్పందాలను చేసుకోవాలి. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలను ఒకే గాట కట్టే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను చేసుకోకూడదు.

వ్యవసాయ శాస్త్రవేత్త,
సెల్: 9490098903

మానవి
నవతెలంగాణ

సొగసు చూడతరమా

సందర్భమేదైనా సరే.... అందరిలో ప్రత్యేకంగా, హుందాగా, అందంగా కనిపించాలని ప్రతి మహిళ కోరుకుంటుంది. అలాంటి వారికి చక్కగా నప్పుతాయి బెనారస్ పట్టు చీరలు. ఇష్టమైన రంగుల్లో పెద్ద అంచులతో... కొత్త డిజైన్స్‌లో మగువల మనసును దోచేసుకుంటున్నాయి. అకేషన్ ఏదైనా కానీ ఈ చీరలు వేటికి సాటి రావనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇంతటి వైవిధ్యభరితమైన బెనారస్ చీరలు ఈ పెండ్లిండ్ల వేళ.. మీకోసం!



ఇట్లా చేద్దాం

వంకాయ ముక్కలు నల్లబడకుండా ఉండాలంటే కూర వండేటప్పుడు చెంచా పాలు పోయాలి.

మదర్ జోన్స్



మేరీ హారిస్ జోన్స్
(1 ఆగస్టు 1837- 30 నవంబర్ 1930)

కార్మికులను, వారి కుటుంబాలను ఏకం చేసి హక్కుల కోసం పోరాడే చైతన్యం కల్పించిన మహిళ మేరీ హారిస్ జోన్స్. మైనింగ్ వర్కర్స్ కోసం గళం విప్పిన ఆమెను అమెరికాలో అత్యంత ప్రమాదకరమైన మహిళగా మైనింగ్ యాజమాన్యాలు అభివర్ణించాయి. 20వ శతాబ్దం ప్రారంభంలోనే ఆమె కార్మికుల పక్షాన నిలిచి వారి కోసం జైలుకు సైతం వెళ్లారు. కార్మికులల్లో పోరాటశక్తిని నింపి మదర్ జోన్స్‌గా కార్మికులచేత పిలిపించుకున్నారు.

ఐర్లాండ్‌లోని కార్క్ కౌంటీలో మేరీ జోన్స్ జన్మించారు. ఐరిష్‌లో ఏర్పడిన కరువు పరిస్థితులు వారి కుటుంబం ఉత్తర అమెరికాకు వలస వెళ్లడానికి కారణమయ్యాయి. మొదట్లో కెనడాలో కొద్ది రోజులు ఉన్నారు. టొరంటో నార్మల్ స్కూలులో ఆమె చదువుకున్నారు. ఆ తర్వాత చికాగో ఆ నుంచి మెంఫిస్‌వెళ్లారు. అక్కడ ఆమె డ్రస్ మేకర్‌గా పనిచేస్తున్న సమయంలో జార్జ్ జోన్స్ పరిచయం అయ్యారు.'నేషనల్ యూనియన్ ఆఫ్ ఐరన్ మోల్డర్స్' సభ్యుడిగా ఉన్న జార్జ్ పరిచయం, అతనితో వివాహం ఆమెలో చైతన్యస్ఫూర్తిని కలిగించింది. ఆ తర్వాత అదే యూనియన్ ఇంటర్నేషనల్ సంస్థగా మారింది. భవననిర్మాణ కార్మికులను, పరిశ్రమల్లోనూ, ఉత్పత్తి సంస్థల్లోనూ పనిచేసే కార్మికులను ఏకం చేసింది. 1867 లో వందలాది మంది మరణానికి కారణమైన ఎల్లో ఫీవర్ మేరీ భర్తను, వారి నలుగురు పిల్లలను బలితీసుకుంది. ఊహించని ఈ విషాదం మేరీ జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. ఆమె తిరిగి చికాగో చేరుకుని డ్రస్‌మేకర్‌గా తన పాత జీవితాన్ని ప్రారంభించారు. చిన్న షాపు నిర్వహిస్తూ ఉన్న సమయంలో మరో విషాదం చోటుచేసుకుంది. 1871లో సంభవించిన గ్రేట్ చికాగో ఫైర్‌లో ఆమె షాపు పూర్తిగా తగలబడిపోయింది. ఎన్నో ఇండ్లు, షాపులు అగ్నికి ఆహుతి అయ్యాయి. దిక్కు తోచని స్థితిలో మేరీ దేశవ్యాప్తంగా ప్రయాణం చేయడం ప్రారంభించారు. దేశం నాటకీయ మార్పులు.. పారిశ్రామికీకరణ పని స్వభావం మారడం ఆమెలో కొత్త ఆలోచనలకు రూపం పోసింది. కార్మికుల పోరాటాలకు మద్దతుగా ఆమె అనేక పట్టణాలకు వెళ్లారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల గొంతుకగా మారారు. ఈ క్రమంలో జైలు శిక్షకూడా అనుభవించారు. లక్షలాది మంది కార్మికులకు ఆమె మదర్ జోన్స్‌గా మారారు. ఎక్కడ కార్మికులు ఉంటే అక్కడ మదర్ ఉన్నారు.

"పిరికితనాన్ని వదిలి వేయాలి. నేను ఒకసారి జైలుకు వెళ్లాను. అయినా మళ్లీ పోరాడుతాను. పోరాడుతూనే ఉంటాను. మీరు పిరికివారైతే చెప్పండి.. మీ తరపున కూడా నేను పోరాడతాను"

మదర్ జోన్స్ కూడా బాల కార్మికుల గురించి చాలా ఆందోళన చెందారు. 'మేం స్కూలులో ఉంటాం. గనులలో కాదు' అంటూ చిన్నారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని ఉద్యమించారు. కార్మికుల పని గంటలను 60 నుంచి 55కు తగ్గించాలని పోరాటం చేశారు. అమెరికా కార్మికులే కాదు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్మికులందరి గురించి ఆలోచించారు మదర్ జోన్స్. ❄

పువ్వులతో సౌందర్యం...



పువ్వులు ఆస్వాదించడానికే కాదు.. అందాన్నివ్వడానికి ఉపయోగపడతాయి. రకరకాల పువ్వులను ఉపయోగించి వివిధ రకాల ఫేస్ ప్యాక్‌లను ప్రయత్నించవచ్చు . అవేంటో మీరూ చూడండి..


- తాజాగా ఉన్న మందారం పువ్వులను ఒక వారం పాటు ఎండ బెట్టి తర్వాత పొడి చేసుకోవాలి. ఫేస్ ప్యాక్ వేసుకోవాలనుకున్నప్పుడు, ఒక బౌల్ తీసుకుని అందులో ఒక స్పూన్ మందారం పువ్వు పౌడర్, బ్రౌన్ రైస్ పౌడర్ వేసి కలపాలి. ఇందులో కొద్దిగా పెరుగు, కలబంద గుజ్జు వేసి ప్యాక్‌లా పెట్టుకోవాలి.
- గులాబీ రేకులను ఒక రోజంతా నానబెట్టాలి. మరుసటి రోజు తీసి మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. దీనికి పెరుగు, తేనె కలిపి మిక్స్ చేయాలి. మొత్తం మిశ్రమాన్ని బాగా కలిపి ముఖానికి ప్యాక్ వేసుకోవాలి.
- బంతిపూల రేకులను తీసుకుని మెత్తగా పేస్ట్ చేయాలి. ఈ పేస్ట్‌ను ఒక బౌల్లోకి తీసుకుని, పెరుగు, గంధం పొడి వేసి మొత్తం బాగా కలుపుకోవాలి. డ్రైగా మారితే రోజ్‌వాటర్ కలుపుకోవచ్చు. రెడీ అయిన తర్వాత ముఖానికి ప్యాక్ వేసుకోవాలి
- మల్లెపువ్వుల రేకులకు నీళ్ల కలిపి ముద్దగా నూరుకోవాలి. దీనికి తేనె కలిపి మెత్తని పేస్ట్ గా చేసుకోవాలి. ఇది సెన్సిటివ్ స్కిన్‌కు బాగా పనిచేస్తుంది. ❄

బాదం బెనిఫిట్స్



- చెడు కొలెస్ట్రాల్ తగ్గించుకోవడానికి బాదం బాగా సహాయపడుతుంది.
- బాదంలో అధికంగా ఉండే విటమిన్స్, మినరల్స్... మెగ్నీషియం, జింక్ వంటి మినిరల్స్ జుట్టు పెరుగుదలకు ఉపయోగ పడతాయి. విటమిన్ 'బి' జుట్టును కాంతివంతంగా మార్చుతుంది.
- బాదంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్, మోనోశ్యాచురేటెడ్ ఫ్యాట్స్, మెగ్నీషియం, కాపర్ వంటివి గుండె, రక్తనాళాల యొక్క ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతాయి.
- బాదంలో ఉండే మెగ్నీషియం కంటెంట్ కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి చర్మంలో ముడతలు ఏర్పడకుండా నివారిస్తుంది. విటమిన్ 'ఇ' యాంటీ ఏజింగ్‌గా పనిచేస్తుంది.
- బాదంలో ఉండే విటమిన్ 'ఇ' జ్ఞాపకశక్తిని పెంచుతుంది. బ్రెయిన్ వయస్సును తగ్గిస్తుంది.
- బాదంలో ఉండే కొలెస్ట్రాల్ తగ్గించే గుణాలు, యాంటీఆక్సిడెంట్స్, గాల్ స్టోన్స్ ఏర్పడకుండా నివారిస్తాయి. ❄

వేధింపుల ప్రొఫెసర్



పనిప్రాంతాల్లో మహిళలపై వేధింపుల నిరోధక చట్టం వచ్చి నాలుగేండ్లు. కానీ ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదు. దాంతో మహిళలు ఉద్యోగాలు పోగొట్టుకుంటున్నారు. కొందరైతే ప్రాణాలే కోల్పోతున్నారు. అత్యున్నత విద్యాసంస్థలైన ఐఐటీల్లోనూ వేధింపులు కొనసాగుతున్నాయి. కేవలం వేధింపుల కారణంగా ఆ ఇద్దరు భార్యాభర్తలు తమ పీహెచ్‌డీలను కోల్పోవాల్సి వచ్చింది. ఆ ఉదంతంపై విద్యార్థిని తన కథను 'యూత్‌కి ఆవాజ్'తో పంచుకుంది.

భువనేశ్వర్‌లోని ఐఐటీలో...పీహెచ్‌డీలో చేరాను. మొదటినుంచి మా ప్రొఫెసర్ ప్రవర్తన నాతో విచిత్రంగా ఉండేది. 'నువ్వు నా కూతురులాంటిదానివి' అని చెబుతూనే ఆయన చూపిస్తున్న తేడాను గమనించాను. 2012 జనవరిలో అదే ప్రొఫెసర్ గైడెన్స్‌లో నాకు కాబోయే భర్త పీహెచ్‌డీలో చేరాడు. ఆ తరువాత 2012 నవంబర్‌లో మా ఇద్దరికి పెండ్లి జరిగింది. నా ఒక్కదానితోనే కాదు.. ఇతర విద్యార్థినిలతో కూడా అలాగే ప్రవర్తించడం మొదలుపెట్టాడు.

మానసిక వేధింపులు...

నేను గర్భిణి అని అతనికి తెలిసిన దగ్గరనుంచి మానసికంగా వేధించడం మొదలుపెట్టాడు. నాలుగో అంతస్తులో ఉన్న ల్యాబ్‌కి మెట్లెక్కి రావాలని బలవంతం చేసేవాడు. నా భర్త గురించి, అతని బాడీ లాంగ్వేజ్ గురించి కామెంట్ చేసేవాడు. మా వ్యక్తిగత విషయాలపై సూపర్‌వైజర్ కామెంట్ చేయడం నచ్చక... నా భర్త వ్యతిరేకిస్తే... 'నీ భర్త స్టూడెంట్‌లా ప్రవర్తించడం లేదు' అనేవాడు. నేను గర్భంతో ఉన్నానని తెలిసి కూడా కన్వీనియెన్స్ పేరుతో ల్యాబ్ షిఫ్ట్ చేయించాడు. ఐసీఎస్సార్, జెఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్ గైడ్‌లైన్స్ ఆధారంగా, పీహెచ్‌డీ రెగ్యులేషన్స్ ప్రకారంగానే 2013లో నేను ఆరు నెలలు ప్రసూతి సెలవులు తీసుకున్నాను. మూడు నెలల తరువాత నా ఫెలోషిప్‌ను ఆపేశాడు. అంతేకాదు సెలవులు లేవు... వచ్చి ల్యాబ్‌లో జాయినవ్వాలని ఆదేశాలిచ్చాడు. అంతేకాదు చేరిన తరువాత ఎలాంటి సెలవులు పెట్టొద్దని నిబంధనలు జారీ చేశాడు. మేల్ స్టూడెంట్స్‌ను బయటకు పంపి.. అమ్మాయిలను మాత్రం తన చుట్టూ ఉండేలా చూసుకునేవాడు. నేను లేని సమయంలో నా భర్తను మానసికంగా, శారీరకంగా వేధించాడు. స్కాలర్‌లాగా కాకుండా అటెండర్‌లా పనులు చెప్పేవాడు. అంతేకాదు 'నీ భార్య పనిచేస్తుంది కదా.. ఇంటినేం చక్కగా చూసుకోగలుగుతుంది. ఆ అమ్మాయికి విడాకులిచ్చేయి' అని నా భర్తకు చెప్పేవాడు.

విడాకులివ్వమని సలహా...

ఇవన్నీ చూసి సెలవులు ముగియకముందే చేరిపోయాను. 'యూనివర్సిటీలో ఎక్కువ సమయం ఉండలేకపోతున్నావు. ఇనిస్టిట్యూట్‌కు దగ్గరగా ఇల్లు మార్చుకో' అని బలవంతం చేశాడు. నేను తిరస్కరించాను. దానికి కక్ష సాధింపుగా నా భర్తను వేధించడం మొదలుపెట్టాడు. దాంతో 2014 జూన్‌లో నా భర్తకు 28 ఏండ్లకే బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చింది. శస్త్ర చికిత్స చేశారు. అంతే... 'నీ భర్త సాధారణ జీవితంలోకి రాలేడు. కాబట్టి... నీకు నేను అన్ని విధాలుగా అండగా ఉంటాను' అని భరోసా ఇవ్వడం మొదలుపెట్టాడు. రెండు నెలల తరువాత తిరిగి నా భర్త రీసెర్చ్‌లో చేరితే... ఆరోగ్యం బాగుండటం లేదు కాబట్టి.. పీహెచ్‌డీ రద్దు చేసుకోవాలని బలవంతం చేశాడు. ఆయన అందుకు నిరాకరిస్తే... మళ్లీ వేధించడం మొదలుపెట్టాడు. దాంతో 2015లో మరోసారి నా భర్త హాస్పిటల్ పాలు కావాల్సి వచ్చింది. నా థీసిస్ తొందరగా పూర్తి చేసుకుని అతని నుంచి స్వేచ్ఛ పొందాలని నేను ఆలోచిస్తుంటే.. నా భర్తను వేధించడమే పనిగా అతను పెట్టుకున్నాడు. నా భర్తకు విడాకులివ్వమని సలహా ఇచ్చేవాడు. నెలకు పదివేల రూపాయలు నీకు ఇస్తానని చెప్పేవాడు. అవేవీ వినకపోవడంతో... నా భర్తకు డిగ్రీ ఇవ్వనని తేల్చేశాడు. 2016 జనవరిలో నా భర్త సెమిస్టర్ రిజిస్ట్రేషన్‌ను ఆపేశాడు. డీఏసీ (డాక్టోరల్ అడ్వైజరీ కమిటీ) చెప్పాక అంగీకరించాడు.

కావాలని జాప్యం...

నా భర్త డిగ్రీ పేరుతో నన్ను భయపెట్టాలని చూశాడు. దాంతో పీహెచ్‌డీ నుంచి తాత్కాలిక సెలవు తీసుకుందామనుకున్నా. కానీ డీఏసీ అంగీకరించలేదు. నా సినాప్సిస్ (ప్రీ పీహెచ్‌డీ) సమర్పించాలని అడిగింది. దాంతో.. సెలవు కుదరలేదు. 2016 జూన్‌లో సినాప్సిస్ సబ్‌మిట్ చేశాను. డీఏసీ నన్ను ప్రశంసించింది. ఐఐటీ రూల్స్ ప్రకారం ఆరు నెలలలోపు థీసిస్ సబ్‌మిట్ చేయాలి. కరెక్షన్ కోసం నేను మా ప్రొఫెసర్ ముందు పెట్టినప్పుడు కావాలని... జాప్యం చేశాడు. 60రోజులు అనుమతి కోరుతూ డీన్‌కి లేఖ రాయించాడు. తరువాత అది 90 రోజులకు పొడిగించాడు. ఆ కాలంలో నన్ను తరచూ ఆఫీసుకు వచ్చి కలవమనేవాడు. నేను నిరాకరించేసరికి... సమస్యలు సృష్టించేందుకు ప్రయత్నించాడు. అందులో భాగంగా జులై 2016లో నా భర్త రిజిస్ట్రేషన్ పేపర్స్ మీద సంతకం చేసేందుకు నిరాకరించాడు.

సంతకానికి నిరాకరణ...

చివరకు నేను ఒడిస్సా స్టేట్ ఉమెన్ కమిషన్, నేషనల్ ఉమెన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశాను. అది అంతర్గత కమిటీలోనే దర్యాప్తు చేయాలని సూచించారు. ఆ కమిటీలో ఎవ్వరూ ప్రొఫెసర్స్ స్థాయిలో లేరు. అందరూ మా ప్రొఫెసర్ చెప్పిన మాటలు వింటూ ఆయనవైపు మొగ్గు చూపేవారే. చివరకు డీఏసీ ముందుకు వెళ్తే... డీఏసీ నా భర్త వెంటనే ఐఐటీ నుంచి వెళ్లిపోవాలని తీర్మానించింది. దీనికి నిరసన తెలిపితే... చివరకు 2016 ఆగస్టులో రీసర్చ్ రిపోర్ట్ అంతా సమర్పించాలని 'డీన్ ఆఫ్ అకాడమిక్స్' అడిగారు. ఐఐటీ పీహెచ్‌డీ కాలపరిమితి ఎనిమిది ఏండ్లు. కానీ నాలుగున్నరేండ్లకే పూర్తి చేసి ఇవ్వాలని కోరడం అన్యాయం.

భర్త పీహెచ్‌డీ రద్దు..

ఓవైపు నా థీసిస్‌ను కూడా కావాలని మా ప్రొఫెసర్ రిజెక్ట్ చేశాడు. మరింత డాటా కావాలని కోరాడు. డాటా ఉన్నా కావాలనే సబ్‌మిట్ చేయడం లేదని, ఐఐటీ నుంచి పీహెచ్‌డీ డిగ్రీ పొందేంత అర్హత నాకు లేదని డీఏసీకి రిపోర్ట్ చేశాడు. నా థీసిస్ చూసిన తరువాత డీఏసీ షాక్‌కు గురైంది. అంతా బాగున్నా సూపర్‌వైజర్ అనైతికంగా ప్రవర్తిస్తున్నాడంటూ డీఏసీ నుంచి కొందరు సభ్యులు రాజీనామా చేశారు. మరోవైపు నా భర్త కేసును రీసర్చ్ ప్రోగ్రామ్ ఎవాల్యుయేషన్ కమిటీకి ఫార్వర్డ్ చేశారు. అక్కడినుంచి సెనేట్‌కు పంపారు. ఎలాంటి నోటీసులు లేకుండానే 2017లో ఫిబ్రవరిలో నా భర్త పీహెచ్‌డీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తున్నట్టు ఆదేశాలు ఇచ్చారు.

ఫిర్యాదు చేసినా చర్యలు లేవు...

పీహెచ్‌డీ టైమ్‌లోనే నాకు ఉద్యోగం వచ్చింది. పీహెచ్‌డీ ఆఫ్ ఐఐటీ రెగ్యులేషన్స్ ప్రకారం, ప్రభుత్వ ఉద్యోగనంలో ఉన్నవారు పీహెచ్‌డీని పార్ట్‌టైమ్ చేసుకునే అవకాశం ఉంటుంది. కానీ సెమిస్టర్‌కు ఫుల్‌టైమ్ జిస్ట్రేషన్ చేయాలని పట్టుబట్టారు. సూపర్‌వైజర్ మార్చాలని కోరినా మార్చలేదు. ఆయన తీరుపై ఫిర్యాదు చేసినా ఎలాంటిచర్యలు తీసుకోలేదు. చివరకు నేను తాత్కాలిక సెలవు పెట్టాను. చివరకు ఈ ఏడాది జూన్‌లో నా పీహెచ్‌డీని కూడా రద్దు చేశారు. కేవలం ఒక ప్రొఫెసర్ వేధింపుల కారణంగా ఇద్దరం పీహెచ్‌డీ కోల్పోవాల్సి వచ్చింది. బాధితులుగా మిగిలిపోవాల్సి వచ్చింది. ఇది రాసింది నాకో, నా కుటుంబానికో న్యాయం జరగాలని కాదు. అత్యున్నత విద్యాసంస్థల్లో జరుగుతున్న వేధింపులను అందరికి తెలియజేయాలన్నదే నా ఉద్దేశం. ❄

ఏపీ ఎన్జీవో సంఘానికి అప్పగించండి

నవతెలంగాణ-హైదరాబాద్

హైదరాబాద్ గన్‌ఫౌండ్రీలోని ఏపీ ఎన్జీవో భవన్‌లోని కొన్ని గదులకు తెలంగాణ భాగ్యనగర్ ఎన్జీవో అసోసియేషన్ వేసిన తాళాలు, అక్కడ పెట్టిన బోర్డులు తీసి ఏపీ ఎన్జీవో సంఘానికి అప్పగించాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి టి. రజనీలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం తీర్పు వెలువరించింది. ఏపీ ఎన్జీవో సంఘంలో సభ్యత్వం ఉన్న భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో అసోసియేషన్‌లోని వారు ఏటా చందా బకాయిలు చెల్లించి, ఆ విధంగా వార్షిక చందాను రెండు వారాల్లోగా చెల్లించిన వారికి ఏపీ ఎన్జీవో భవన్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఏపీ ఎన్జీవో సంఘాన్ని ఆదేశించింది. వీరికి ప్రత్యేకంగా గదులు కేటాయించరాదని, అదే సమయంలో ఏపీ ఎన్జీవో సంఘంలోని వారికి ఉన్న అన్ని వసతులు వీరికి కూడా ఉండాలని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది. ఏపీ ఎన్జీవో భవనంలోని కొంత మేరకు భాగాన్ని భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవోకు ఇస్తూ జీఏడీ ఆదేశాల మేరకు హైదరాబాద్ కలెక్టర్, ఆర్డీవోలు ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఏపీ ఎన్జీవో సంఘం సవాల్ చేసిన కేసులో ఆ ఉత్తర్వులను 8 వారాలు నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఆదేశాలిచ్చారు. దీనిని భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో అప్పీల్ చేసిన కేసులో నేడు ఈతీర్పు వెలువడింది.

11 నుంచి ప్రజల వద్దకు వైసీపీ

హైదరాబాద్ : ఈ నెల 11వ తేది నుంచి అక్టోబర్ 25 వరకూ వైసీపీ ప్రజల వద్దకు వెళ్లనుంది. ఆ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఈ కార్యక్రమం ముగి సిన వెంటనే జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర కూడా ప్రారంభం కానుంది. సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, పార్టీ బలోపేతంపై విస్తృతంగా చర్చ జరిగింది. ఆగస్టు 11 నుండి మూడు విడతలుగా ప్రజల వద్దకు వెళ్లాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

రెండు వారాల్లోగా పరిష్కరించండి

దళితుల సమస్యలపై10 వామపక్షపార్టీల డిమాండ్

విజయవాడలో రాష్ట్ర సదస్సు

- దాడులకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలకు పిలుపు
- ఏడు తీర్మానాలు ఆమోదం



దళితుల సమస్యలపై తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు

అమరావతి : దళితుల సమస్యల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని, రెండు వారాల్లోగా పరిష్కరించాలని వామపక్షాల నేతలు డిమాండ్ చేశారు.దళితులపై రాష్ట్రవ్యాప్తంగా దాడులు పెరిగిపోతున్నాయని, రాష్ట్రప్రభుత్వం వారి భూములపైనే కన్నేసిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దళితులకు భూముల్ని పంచకపోగా, వారు అనుభవిస్తున్న భూముల్ని లాక్కొన్నే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందన్నారు. చాపరాయిలో 16 మంది గిరిజనుల మరణం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమ న్నారు. దళితులపై దౌర్జన్యాలు జరుగుతున్న ప్రాంతాల్లో వామపక్ష పార్టీలు పర్యటించి, వారికి సంఘీభావాన్ని వ్యక్తం చేస్తాయన్నారు. దళితులు సాగించే పోరాటానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. దళితులపై దాడులు - కులవివక్షతను నిరసిస్తూ పది వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర సదస్సు విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సదస్సుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అధ్యక్షత వహించారు. సదస్సు తీర్మానాలను ప్రవేశపెట్టిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి మధు మాట్లాడుతూ ఇలపర్రు, దేవర పల్లి, చిత్తూరు జిల్లాల్లో మహాభారతం, గరగపర్రు ఘటనలు పైకి కనపడుతున్న సమస్యలని, ఇవి కాకుండా తీవ్రమైన సమస్యల్ని దళితులు ఎదుర్కొం టున్నారని వివరించారు. దళితుల సాగులో ఉన్న భూముల్ని నీరు-చెట్టు, ఆక్వా సాగుకు ప్రభుత్వం లాక్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లాలో మంత్రి కామినేని శ్రీనివాస్ నియోజకవర్గం లో అనేక గ్రామాల్లో అడ్డగోలుగా చేపల చెరువులు తవ్వారని, జిల్లాలో లక్ష ఎకరాల భూమిని పెత్తం దార్లు ఆక్రమించుకున్నారన్నారు. తల్లిదండ్రులు లేని బిడ్డలుగా దళితులు బతకాల్సిన పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. పెత్తందార్లు తప్పించుకుంటూ దళితులపై కేసులు పెడుతున్నా రని విమర్శించారు. ఎస్సీ,ఎస్టీ చట్టాన్ని గ్రామాల్లో పకడ్బందీగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ అధికారంలోకొచ్చాక దళితులు, మైనారిటీలు అభద్రతా భావానికి గురవుతున్నారని, ప్రత్యక్షంగా వారిపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.



ఉద్దానం సమస్యపై సీఎం చంద్రబాబును కలిసిన పవన్ కళ్యాణ్

అక్టోబర్ నుంచి ప్రజల్లోకెళ్తా : పవన్

అమరావతి: అక్టోబర్ నుంచి ప్రజల్లోనే ఉంటానని, రాజకీయాలకు పూర్తి స్థాయిలో సమయాన్ని కేటాయిస్తానని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తెలిపారు. గరగపర్రు విషయం తన దృష్టికి రాలేదని, తెలిసిన తరువాత వెళ్లాలంటే భద్రతాపరమైన సమస్యలున్నాయని తెలిపారు. ప్రజల్లో సంఘ విద్రోహకశక్తులు చొరబడి వినాశనానికి పాల్పడే అవకాశముందని, అందువల్లే అక్కడకు వెళ్లలేదని చెప్పారు. పైగా జనసేనకు నేతల్లేరన్నారు. దళితుల సాంఘిక బహిష్కరణ నేరమని పేర్కొన్నారు. ఉద్దానం కిడ్నీ సమస్యపై హార్వర్డ్ వైద్యబృందంతో కలిసి సోమవారం వెలగపూడి సచివాలయంలో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన అనంతరం విజయవాడలో ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పవన్ మాట్లాడారు. తాను టిడిపికి రహస్య మిత్రుడిని కాదని, నంద్యాల ఉప ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతివ్వాలనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా, ప్రజలకు నష్టం కలిగించే విధంగా తుందుర్రు అక్వా పార్కు ఏర్పాటు చేస్తే దానిని కచ్చితంగా వ్యతిరేకించాల్సిందేనన్నారు. ఈ దేశం అనేక కులాల, మతాల సమూహమని, కులాలు, మతాల ఆధారంగా సమాజాన్ని నిర్మించాలనుకోవడం ప్రమాదకరమన్నారు.

డీజీపీ కార్యాలయం ముందు మహిళ ఆత్మహత్యాయత్నం

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర డీజీపీ కార్యాలయం ముందు ఒక మహిళ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఖమ్మం జిల్లా భద్రాచలంకు చెందిన సోని తన సమస్యను చెప్పుకోవడానికి డీజీపీ కార్యాలయానికి వచ్చింది. తను చేయని నేరానికి స్థానిక పోలీసులు తనను వేధిస్తున్నారని, తన కు న్యాయం చేయాలని కోరుతు ఆమె డీజీపీని కలువడానికి వచ్చింది. అయితే తాను కలువడానికి అవకాశం దొరక్క పోవడంతో ఆవేదన చెంఇన సోని డీజీపీ కార్యాలయం ముందు ఫినాయిల్ తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే సైఫాబాద్ పోలీసులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమెకు ఎలాంటి ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. ఈఎస్ఐ ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతున్నట్టు తెలిపారు.

మన పిల్లల్లా చెట్లను పెంచాలి:అదనపు డీజీ

సమాజంలో ప్రతి ఒక్కరు మన పిల్లలను పెంచి నట్టుగానే మొక్కలను పెంచాలని రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ అంజనీకుమార్ అన్నారు. సోమవారం డీజీపీ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన హరితహారం కార్యక్రమంలో ఆయన పలు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డీజీపీ కార్యాలయానికి చెందిన పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీకే సింగ్ పదవీ విరమణ

రాష్ట్ర ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం ఐజీ వి కె సింగ్ సోమవారం పదవీ విరమణ చేశారు. 1985 బ్యాచ్ డీఎస్పీగా పోలీసు శాఖలో చేరిన సింగ్ అనంతరం ఐపీఎస్ అధికారిగా కన్వర్ట్ అయ్యారు.

డ్రగ్స్ అలవాటు లేదు: హీరో తనీష్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మత్తుపదార్థాలు తీసుకునే అలవాటు తనకు లేదని యువ హీరో అల్లడి తనీష్ అన్నారు. చిన్నతనం నుంచే సినీ పరిశ్రమతో అనుబంధం ఉందని, ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని కుటుంబ ప్రోత్సాహంతో ఈస్థాయికి వచ్చానని చెప్పారు. సినీ పరిశ్రమలో డ్రగ్స్ వ్యవహారం గురించి తెలియదన్నారు. ఇప్పుడిప్పుడే సినిమాల్లో నిలదొక్కుకుంటున్న తనకు ఈ పరిణామాలు తీవ్ర నష్టాన్ని కలిగించాయని ఆయన సిట్ అధికారుల సమక్షంలో బాధను వెలిబుచ్చారు. డ్రగ్స్ కేసు విచారణలో నోటీసులందుకున్న తనీష్ సోమవారం సిట్ ఎదుట హాజరయ్యారు. ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ప్రశ్నించారు. సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలన్నింటికీ తనీష్ నేరుగా జవాబులు చెప్పారు. కెల్విన్‌తో పరిచయాలపై నేరుగా ఆయనతో సంబంధాలు లేవని అయితే సినిమా ప్రమోషన్ సందర్భంగా ఒకటి,రెండు సార్లు మాట్లాడానని తనీష్ చెప్పినట్టు తెలిసింది. చిన్నతనం నుంచి సినిమాల్లో నటించడంతో తరుణ్‌తో చాలా దగ్గర సంబంధాలున్నాయన్నారు. నవదీప్‌తో పెద్దగా స్నేహం లేదన్నారు. సినీ పరిశ్రమలో పరిచయాలు చాలా ఎక్కువేనని అయితే వారి వ్యక్తిగత విషయాలు అలవాట్లు తెలియవన్నారు. తనీష్‌తో పాటు అఖిల్ చౌదరి, నిరుపమ రెడ్డిలను కూడా సిట్ ప్రశ్నించింది.

వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి కవిత !

- జగిత్యాల నుండి పోటీ చేసే అవకాశం
- పార్టీ నిర్ణయం మేరకు నడచుకుంటానని వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వచ్చే ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ కవిత అసెంబ్లీకి పోటీ చేయనున్నారా? పార్లమెంటుకు వెళ్లే ఆలోచన లేదా? అవుననే అంటున్నాయి అధికార టిఆర్ఎస్‌పార్టీ వర్గాలు. దీనిని ఎవరూ బహిరంగంగా ధ్రువీకరించకపోయినా 2019 ఎన్నికల్లో కవిత అసెంబ్లీకి పోటీ చేయనున్నారని తెలిసింది. ఇటీవల పరిణామాలను చూస్తే కవిత రాష్ట్ర రాజకీయాలవైపే ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. దీనిని విశ్లేషకులు కూడా కొట్టిపారేయడం లేదు. తెలంగాణకు సంబంధించి ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతీ పండుగ కవిత చేతుల మీదుగానే జరుగుతున్నది. జాగృతి సంస్థ కూడా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. కమిటీలు కూడా ఏర్పడ్డాయి. కేంద్రంలో ప్రభుత్వంలో చేరితే కేంద్రమంత్రిగా కవిత అయ్యే అవకాశం ఉందని గతంలో వార్తలు వచ్చాయి. ప్రతీ సందర్భంలోనూ కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం భేషరత్తుగా మద్దతిస్తున్నా క్యాబినెట్‌లో తీసుకోవడానికి ఎన్‌డిఎ కూటమి అంగీకరించలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో కవిత అసెంబ్లీవైపు దృష్టిసారించారని తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఎక్కడ నుండి పోటీ చేయాలన్నది సీటును కూడా ఎంపిక చేసుకున్నారని సమాచారం. 2019 ఎన్నికల్లో జగిత్యాల నుండి కవిత పోటీ చేయడం ఖాయమంటున్నారు పలువురు టిఆర్ఎస్‌నేతలు. ప్రస్తుతం కవిత నిజామాబాద్ ఎంపీగా కొనసాగుతున్నారు. ఎమ్మెల్యేగా పోటీచేయడంపై కొంతకాలంగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో దానిపై కవిత స్పందిస్తూ 'పార్టీ ఎలా నిర్ణయిస్తే అలా నడచుకుంటా. నేను ఎక్కడ పోటీ చేయాలో పార్టీ నిర్ణయం తీసుకుంటుంది.' అని మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు.

పంచాయతీరాజ్ టీచర్ల పదోన్నతుల ప్రక్రియపై యథాతథ స్థితి

నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్రపతి జారీ చేసిన ఏకీక త సర్వీసు నిబంధనల ఉత్తర్వుల మేరకు పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతుల కల్పన ప్రక్రియపై యథాతథ పరిస్థితిని కొనసాగించాలని హైకోర్టు తెలంగాణ సర్కార్‌ను ఆదేశాలిచ్చింది. ఈమేరకు న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి టి. రజనీలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం మధ్యంతర ఆదేశాలిచ్చింది. పంచాయతీరాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఏకీకత సర్వీసు నిబంధనలకు రాష్ట్రపతి జూన్ 23న ఆమోదం చెప్పడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి వీరాచారి, ఇతరులు హైకోర్టులో సవాల్ చేసిన కేసులో ఈ ఆదేశాలు వెలువడ్డాయి. రాజ్యాంగంలోని 371(డి) అధికరణానికి భిన్నంగా ఏకీక త సర్వీసు నిబంధనలకు రాష్ట్రపతి ఆమోదం చెప్పారని, ఇది రాజ్యాంగ వ్యతిరేకమని పిటిషనర్ల సీనియర్ న్యాయవాది ఎస్.రామచంద్రరావు వాదించారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతుల చర్యలను అడ్డుకోవాలన్నారు.రాష్ట్రపతికి అధికారం ఉందని తెలంగాణ రాష్ట్ర అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచందర్‌రావు బదులిచ్చారు.

చేనేతను జీఎస్టీ నుంచి మినహాయించాలి...

ఇదే డిమాండ్‌పై సెప్టెంబరు 11న ఢిల్లీలో ధర్నా

- రౌండ్‌టేబుల్‌లో చేనేత నాయకులు



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి, చిత్రంలో చెరుపల్లి, రమేశ్, గజం అంజయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీఎస్టీ వల్ల చేనేత రంగంపై తీవ్ర ప్రభావం పడుతున్నదని పలువురు వక్తలు చెప్పారు. అందువల్ల జీఎస్టీ నుంచి ఈ రంగాన్ని పూర్తిగా మినహాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా వీధి పోరాటాలు కొనసాగుతున్నప్పటికీ కేంద్రం పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 9న ఢిల్లీలో అన్ని పార్టీల ఎంపీలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. 10న అన్ని రాజకీయ పార్టీలకు వినతిపత్రాలు సమర్పించటం ద్వారా ఆయా పార్టీల మద్దతు కూడగడతామని తెలిపారు. 11న జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని వివరించారు. 'చేనేతను జీఎస్టీ నుంచి మినహాయించాలి, ఆ రంగానికి ప్రత్యేక పాలసీని ప్రకటించాలి..' అని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చేనేత నిపుణులు డాక్టర్ డి.నర్సింహారెడ్డి, వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు చెరుపల్లి సీతారాములు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిల్లలమర్రి బాలకృష్ణ, కోలా రామాంజనేయులు, నాయకులు జేఎన్ శేషయ్య తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి.. జీఎస్టీ వల్ల చేనేతరంగంపై పడే ప్రభావాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. చేనేతపై మోడీ సర్కార్ ఏకంగా 18 శాతం జీఎస్టీని విధించిందని తెలిపారు. చెరుపల్లి మాట్లాడుతూ... జీఎస్టీ వల్ల రాష్ట్రంలో చేనేత, వస్త్ర పరిశ్రమ కుదేలయిందని చెప్పారు. ప్రత్యేక పాలసీ అనేదే లేకపోవటం వల్ల ఆ రంగం తీవ్రంగా నష్టపోతున్నదని తెలిపారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన సభలో పాల్గొన్న ప్రధాని మోడీ.. చేనేతను రక్షించేందుకు వీలుగా అందరూ మొబైల్ లైట్లు ఆన్ చేయాలంటూ సభికులకు సూచించారని గుర్తుచేశారు. ఇప్పుడు అదే మోడీ.. చేనేతపై కూడా జీఎస్టీని బాదారని ఎద్దేవా చేశారు. ఇది బడా షాపింగ్ మాల్స్‌కు, పెద్ద పెద్ద వస్త్ర వ్యాపారులకు ఉపయోగపడేదే తప్ప సాధారణ చేనేత కార్మికులకు కాదని విమర్శించారు. ఇప్పటికైనా జీఎస్టీ నుంచి చేనేత రంగాన్ని మినహాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కళాకారుడు పద్మశ్రీ గజం అంజయ్య, వృత్తిదారుల రాష్ట్ర కన్వీనర్ ఎమ్‌వీ రమణ, తెలంగాణ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు గంజి మురళీధర్, సీనియర్ నాయకులు జెల్లా మార్కండేయులు, చిక్కా దేవదాసు, ఆలిండియా హ్యాండ్లూమ్ బోర్డు సభ్యుడు కర్నాటి ధనుంజయ, పాశికంటి లక్ష్మీనరసయ్య (సీపీఐ అనుబంధ చేనేత కార్మిక సంఘం), అవ్వారు వేణు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆవాసాలకు రోడ్డు సౌకర్యం

ఈఏడాది నుంచే ప్రారంభించాలని సీఎం ఆదేశం

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని గిరిజన ఆవాస ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రజలు నివసించే ప్రాంతాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు రూపొందించిన మూడేండ్ల ప్రణాళికను ఈ యేడాది నుంచే పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ప్రాంతంలో ఎస్టీ ఆవాస ప్రాంతాలకు రహదారి సౌకర్యం లేక స్థానికులు అత్యవసర సమయాల్లో పడుతున్న ఇబ్బందులు, వాటిపై పత్రికల్లో వచ్చిన కథనాలపై సీఎం స్పందించారు. సీఎంఓ ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డితో పాటు ఇతర అధికారులతో మాట్లాడారు. ఉట్నూరు ప్రాంతంలోని దొంగచింత - సోనాపూర్ రహదారిని వెంటనే నిర్మించాలని ఆదేశించారు. దీనిని రూ.89 లక్షల వ్యయంతో నిర్మించనున్నారు. మిగతా ఎస్టీ ఆవాస ప్రాంతాల రహదారుల విషయంలో కూడా వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మహేష్ దత్ ఎక్కా, కమిషనర్ లక్ష్మణ్‌లతో భూపాల్ రెడ్డి సమావేశం అయ్యారు. మొత్తం రాష్ట్రంలోని పన్నెండు వందల ఎస్టీ ఆవాస ప్రాంతాలకు రహదారి సౌకర్యం కల్పించే ప్రణాళికపై చర్చించారు. మొదటి ఏడాది రూ.250 కోట్లతో 432 ఆవాస ప్రాంతాలకు రహదారి సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు.

దిగ్విజయ్‌కు నోటీసులు పంపినా స్పందనలేదు : తలసాని

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వంపై నిరాదారణమైన ఆరోపణలు ఎవరూ చేసినా సహించబోమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్‌పార్టీ జాతీయ నేత దిగ్విజయ్‌సింగ్‌కు నోటీసులు పంపినా, ఇంతవరకు స్పందనలేదన్నారు. సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు ఎస్సీలు, బీసీల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఎద్దేవాచేశారు.

ఢిల్లీ డైరెక్షన్..గల్లీ యాక్షన్ : సుమన్

తెలంగాణ సమాజాన్ని కులాలవారీగా చీల్చి రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్‌పార్టీ కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నదని టిఆర్ఎస్‌పార్టీ ఎంపీ బాల్కసుమన్ అన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే ఆరూరు రమేశ్, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ కుట్రలో ఢిల్లీ డైరెక్షన్ అయితే గల్లీది యాక్షన్ అని సుమన్ అన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక అథారిటీ ఏర్పాటు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయనున్నట్టు రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. రోడ్డుప్రమాద బాధితులకు పూర్తిస్థాయి ఉచిత చికిత్సను అందిస్తామని చెప్పారు. రాష్ట్ర రోడ్డు భద్రతా కౌన్సిల్ నాల్గవ సమావేశం సోమవారంనాడు సచివాలయంలో జరిగింది. రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, అడిషనల్ డీజీపీ (రోడ్‌సేఫ్టీ) కృష్ణప్రసాద్, ఆర్థికశాఖ కార్యదర్శి శివశంకర్, హెూంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేదితో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేరెళ్ల సీఎం స్పందించరేం: బీజేపీ

నవతెలంగాణ -హైదరాబాద్ బ్యూరో

నేరెళ్లలో దళితులు, బీసీలపై పోలీసుల పాశవికదాడిపై సీఎం కేసీఆర్ ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె లక్ష్మణ్ అన్నారు. బాధితులపై సర్కారుకు ఎలాంటి సానుభూతి లేదని చెప్పడానికి ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలని ప్రశ్నించారు. సోమవారంనాడిక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఇక నుంచి నేరుగా రుణాలు

- కులవృత్తులకు ప్రోత్సాహం : ఈటల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇక నుంచి బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా రుణాలిస్తామని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో రజకుల కోసం ఆధునిక వాషింగ్ యంత్రాల ప్రదర్శన, అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏండ్ల నుంచి పాత పద్ధతులపైనే కులవృత్తుల వారు ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ఆధునిక పరికరాలు అందజేయండం ద్వారా అధిక ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. బీసీ అభివృద్ధి శాఖ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా 119 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదని అన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ బిఎస్ రాములు మాట్లాడుతూ బీసీలు ఏ రంగంలో ఎదగాలను కుంటే ఆయా రంగానికి బీసీ కమిషన్ తోడ్పాటు అందిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజేయగౌడ్, ప్రభుత్వ గౌరవ సలహాదారు రామలక్ష్మణ్, బీసీ అభివృద్ధి శాఖ కమిషనర్ జెడి అరుణ, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య బట్టు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధిహామీ పనుల తనిఖీ'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనుల సమీక్ష, సామాజిక తనిఖీల పరిశీలన కోసం రాష్ట్ర వ్యాప్తంగా 30 జిల్లాల్లో అంబుడ్స్‌మెన్‌ను నియమిం చాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించింది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రత్యేకంగా జీవో నెంబరు 57ను విడుదల చేసింది. పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ పేర ఆదేశాలు వెలువడ్డాయి. అంబుడ్స్‌మెన్ నియామకాలకు ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేయనున్నారు. అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్‌పర్సన్‌గా, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నియమించిన ఉన్నతాధికారి, పౌరసమాజం నుంచి మరో వ్యక్తి సభ్యులుగా, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కన్వీనర్‌గా ఈ కమిటీ ఏర్పాటవుతుంది.

ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లపై కేంద్రం పరిశీలన

- కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉపాధి రంగాల్లో కోటా కల్పించే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రత్యేకించి సమాజంలోని అణగారిన, వెనుకబడిన వర్గాలకు న్యాయం చేసేందుకు కట్టుబడి ఉందని, ఈ కారణంగా ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్ల అంశాన్ని పరిశీలించనున్నామని చెప్పారు. పార్లమెంటు తదుపరి సమావేశాల కాలంలో ట్రాన్స్‌జెండర్ల బిల్లు ఆమోదం పొందగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఆ తరగతి విద్యార్థులు చదువుకోవడానికి ప్రోత్సహిస్తామని, వారి కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటుచేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తుందని వివరించారు.

డీటెయిన్డ్ విద్యార్థులకు ఉపశమనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ చదువుతున్న వారిలో డిటెయిన్డ్ అయిన విద్యార్థులకు ఉపశమనం కలిగింది. తరగతులకు హాజరయ్యేందుకు జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్) షరతులతో కూడిన అనుమతి మం జూరు చేసింది. అనుబంధ గుర్తింపు పొందిన కాలేజీల ప్రిన్సిపాల్స్ ఆ విద్యార్థులను తరగతులకు అనుమతించాలని కోరింది. ఈ మేరకు జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ ఎన్ యాదయ్య సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

డిగ్రీలో ప్రవేశాల గడువు 3 వరకు పెంపు

డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల్లో భాగంగా తుది విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసేందుకు గడువు పొడిగించారు. షెడ్యూల్ ప్రకారం సోమవారంతో డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణ గడువు ముగియనుండగా ఈనెల 3వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) కన్వీనర్ కే వెంకటాచలం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

లౌకికవాద పరిరక్షణకు ఉద్యమాలు : సురవరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మతోన్మాద శక్తుల వల్ల దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదాలకు పెనుప్రమాదం ఏర్పడిందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని పరిరక్షించేందుకు ఉధృత పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శుల వర్క్‌షాప్ నిర్వహించారు.


మరో ఐదు మాతాశిశు కేంద్రాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అదనంగా ఐదు మాతా శిశు కేంద్రాలు (ఎంసీహెచ్) నెల కొల్పుతామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి తెలిపారు. మాతా శిశు కేంద్రాలు, కేసీఆర్ కిట్ల పథకం తదితర అంశాలపై సచివాలయంలో సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.

హైకోర్టు దృష్టికి కాంట్రాక్టు విద్యుత్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ

నవతెలంగాణ-హైదరాబాద్



హైకోర్టులో చెప్పిన దానికి భిన్నంగా తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 21 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై సోమవారం హైకోర్టు దష్టికి వచ్చింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టడం లేదని, ఏదైనా చేయదలిస్తే హైకోర్టు ద ష్టికి తీసుకొచ్చిన తర్వాతే చేస్తామని గతసారి విచారణ సమయంలో విద్యుత్ సంస్థల తరపు న్యాయవాది హైకోర్టుకు హామీ ఇచ్చారని, అయితే 20,903 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని ప్రజాహిత వ్యాజ్యం తరపు న్యాయవాది సోమవారం ధర్మాసనం దష్టికి తీసుకొచ్చారు. ఈపిల్‌పై మంగళవారం (రేపు) విచారణ జరుపుతామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి టి.రజనీలతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. గత విచారణ సమయంలో ఔట్‌సోర్సింగ్ ప్రక్రియ కొనసాగకుండా స్టే ఇచ్చేందుకు నిరాకరించిన హైకోర్టు.. న్యాయవాది హామీకి భిన్నంగా జరిగితే కోర్టుకు రావచ్చునని పిటిషనర్‌కు సౌలభ్యాన్ని కల్పించింది. 24 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేసేందుకు విద్యుత్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన నిరుద్యోగి శ్రావణ్‌కుమార్ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం విదితమే. గత విచారణ సమయంలో విద్యుత్ సంస్థల తరపు న్యాయవాది వాదిస్తూ.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరణ చర్యలు లేవని, కేవలం వారి వివరాలు మాత్రమే అధికారులు సేకరిస్తున్నారని, కార్మిక సంఘాల సమాఖ్యతో రాజీ ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ తర్వాత బోర్డు డైరెక్టర్ల నిర?యం తీసుకున్నాకే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులు క్రమబద్ధీకరణ జరుగుతుందని చెప్పారు. అప్పుడు స్టే ఇవ్వని బెంచ్ దష్టికి తాజా పరిణామాలను పిటిషనర్ న్యాయవాది తీసుకురావడంతో విచారణ మంగళవారం జరుపుతామని వెల్లడించింది

అమెరికాకు పుతిన్ షాక్ !

- 755 మంది అమెరికా దౌత్యాధికారుల్ని పంపేస్తున్నామని ప్రకటన

మాస్కో : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ గట్టి షాకిచ్చారు. రష్యాలోని తమ దౌత్యాధికారులను అమెరికా తగ్గించుకోవాలని పుతిన్ సూచించారు. ఈ మేరకు 755 మంది యూఎస్ దౌత్యాధికారులను దేశం నుంచి పంపించేందుకు తాము నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. సెప్టెంబర్ 1 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కావాలని రష్యా విదేశాంగ శాఖ అమెరికాను ఆదేశించింది. అసలేం జరిగిందంటే.. రష్యాకు వ్యతిరేకంగా ఇటీవల అమెరికా కాంగ్రెస్‌లో బిల్లు పాస్ అయింది. త్వరలోనే ఆ బిల్లు కు ట్రంప్ ఆమోదముద్ర వేసి చట్టం చేయనున్నారు. దీనిపై తీవ్రంగా స్పందించిన రష్యా, అమెరికా తమ ఉద్యోగులను తగ్గించుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. ప్రస్తుతం రష్యాలో దేశ రాజధాని మాస్కోతో కలిపి ఐదు అమెరికన్ ఎంబసీలు ఉన్నాయి. వీటిలో 1100లకు పైగా అమెరికన్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. రష్యా తాజా నిర్ణయంతో అన్ని ఎంబసీల్లో కేవలం 455 మంది అధికారులను అమె రికా కొనసాగించాలి. మిగిలిన వారిని సెప్టెంబర్ 1 నుంచి తొలగించాలని పేర్కొంది. అమెరికాలో కూడా రష్యన్ ఎంబసీల్లో కూడా కేవలం 455 మంది క్రెమ్లిన్ అధికారులు మాత్రమే పని చేస్తున్నారు. దీనిపై అధ్యక్షుడు పుతిన్ రోస్సియా నెట్‌వర్క్-1 అనే రష్యన్ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లా డుతూ...అమెరికాతో సత్సంబంధాల కోసం రష్యా ఎదురుచూపులు చూసి చూసి విసిగిపోయిందని పుతిన్ అన్నారు. "రష్యా, అమెరికా మధ్య సత్సంబం ధాలు పెరుగుతాయని భావించాం. కానీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాలేదు. అమెరికాకు దీటుగా సమా ధానం చెప్పాల్సిన సమయం ఇదే అని మేం అనుకున్నాం" అని అన్నారు. కాగా.. దీనిపై అమెరికా విదేశాంగ శాఖ స్పందించింది. ఇది అవాంఛనీయమై న ఘటన అని పేర్కొంది. రష్యా నిర్ణయంపై ఇప్పుడే ఎలాంటి ప్రకటనలు చేయలేమని తెలిపింది. అయితే రష్యాలోని అమెరికా దౌత్య కార్యాలయాల్లో ఎంత మంది పనిచేస్తున్నారో చెప్పేందుకు విదేశాంగ శాఖ నిరాకరించింది.



నవచిత్రం

టార్గెట్ సూపర్‌స్టార్


కాజల్


రజనీకాంత్

'ఖైదీ నెంబర్ 150' విజయంతో కాజల్ జోరు పెంచింది. ఆ సినిమా తర్వాత వరుసగా అటు తమిళం, ఇటు తెలుగు అవకాశాలు పుంజుకున్నాయి. తెలుగు, తమిళంలో రెండేసి చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్న కాజల్ ప్రస్తుతం పెద్ద టార్గెటే పెట్టుకుందట. ఏకంగా రజనీకాంత్ సరసన నటించాలని భావిస్తుందట. 'కాజల్‌కు ఈ ఏడాది చాలా స్పెషల్. 'ఖైదీ నెంబర్ 150'తో ఈ ఏడాది ఫస్ట్ హిట్‌ను అందుకుంది. తమిళంలో అజిత్‌తో తొలిసారి కలిసి నటించింది. ఈ చిత్రం ఈ నెలలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే ఆమె తొలిసారి నటించిన తేజ దర్శకత్వంలోనే తాజాగా తన 50వ సినిమా చేస్తుంది. తెలుగులో దాదాపు అందరు అగ్ర కథానాయకులు, స్టార్ హీరోలతో కలిసి నటించింది. తమిళంలోనూ విజయ్, అజిత్, కార్తీ, ధనుష్ ఇలా అగ్ర కథానాయకులతో కలిసి నటించింది. ఆమెకు ఇప్పుడు ఒక్కటే కోరిక ఉంది. అది రజనీకాంత్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవాలన్నది. దాని కోసం ఎప్పట్నుంచో వెయిట్ చేస్తుందట. త్వరలోనే ఆ ఛాన్స్ వస్తుందని ఆశగా ఎదురు చూస్తుంది' అని చిత్ర వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం కాజల్.. రానా హీరోగా తేజ దర్శకత్వంలో నటిస్తున్న 'నేనే రాజు నేనే మంత్రి' ఈ నెల 11న విడుదల కానుంది. దీంతోపాటు కళ్యాణ్‌రామ్‌తో 'ఎమ్మెల్యే' చిత్రంలో నటిస్తుంది. తమిళంలో విజయ్ సరసన 'అదిరింది', అజిత్ సరసన 'వివేకం' చిత్రాల్లో నటిస్తోంది.

ఇది ధైర్యం కాదు.. తెగింపు


'యుద్ధం శరణం'లో నాగచైతన్య

'నాకు తెలిసిన ప్రపంచం ఇది కాదు.., మనం బతకాలంటే వాడికి ఎదురెళ్లాలి. ఇది ధైర్యం కాదు తెగింపు..' అంటున్నాడు హీరో నాగచైతన్య. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'యుద్ధం శరణం'. కృష్ణ ఆర్. వి.మారిముత్తు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కథానాయిక. సాయి కొర్రపాటి నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్ సోమవారం విడుదలైంది. టీజర్‌లో నాగచైతన్య చెప్పే శక్తివంతమైన డైలాగులు ఆకట్టుకుంటున్నాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సాగే ఈ చిత్రంలో శ్రీకాంత్ విలన్‌గా నటిస్తున్నాడు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ తర్వాత నాగచౌతన్య.. చందు మొండేటి దర్శకత్వంలో ఓ సినిమాలో నటించ నున్నారు. అయితే ఇందులో నాగచైతన్య యాడ్ ఫిల్మ్ మేకర్‌గా కనిపించనున్నట్టు తెలుస్తుంది. ఆయన పాత్ర తీరుతెన్నులు విభిన్నంగా, చాలా కొత్తగా ఉంటాయట.


స్పైడర్‌లో మహేష్

కన్నుల పండువగా స్పైడర్

మహేష్‌బాబు, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా ఎ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో ఠాగూర్ మధు సమర్పణలో ఎన్.వి.ఆర్.సినిమా ఎల్‌ఎల్‌పి, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఎన్.వి.ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'స్పైడర్'. ఈ చిత్రం గురించి నిర్మాత ఎన్.వి.ప్రసాద్ మాట్లాడుతూ, 'ఈ చిత్ర ఫస్ట్ సాంగ్‌ను, సాహిత్యాన్ని ఆన్ లైన్‌లో యూట్యూబ్ ద్వారా ఈ నెల 2న సాయంత్రం 6గంటలకు తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో విడుదల చేస్తున్నాం. ప్రస్తుతం సినిమా నిర్మాణాంతర కార్యక్రమాల్లో భాగంగా గ్రాఫిక్స్, మిక్సింగ్ వర్క్ జరుపుకుంటోంది' అని అన్నారు. 'ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే స్థాయిలో వారి అంచనాలను అందుకునేలా దర్శకుడు మురుగదాస్ కన్నుల పండువగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. యూరప్‌లో జరిగే పాట చిత్రీకరణతో సినిమా నిర్మాణం మొత్తం పూర్తి అవుతుంది. విజయదశమి కానుకగా సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని సమర్పకుడు ఠాగూర్ మధు తెలిపారు. ఎస్.జె.సూర్య ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హేరిస్ జయరాజ్, సినిమాటోగ్రఫీ: సంతోష్ శివన్, ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్.

ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా జెమిని కిరణ్


జెమిని కిరణ్‌ని అభినందిస్తున్న చిరంజీవి

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా ప్రముఖ నిర్మాత జెమిని కిరణ్ ఎన్నికయ్యారు. ప్రొడ్యూసర్ సెక్టార్, డిస్ట్రిబ్యూటర్ సెక్టార్, ఎగ్జిబిటర్స్, స్టూడియో సెక్టార్ వంటి నాలుగు విభాగాల్లో ఆదివారం హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో ఎన్నికలు జరిగాయి. ఈ నాలుగు విభాగాల సభ్యులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసిన ప్రతాని రామకృష్ణగౌడ్ సైతం విజయం సాధించారు. ఫిల్మ్ ఛాంబర్ నిబంధనల ప్రకారం ఒక్కోసారి ఒక్కో విభాగం నుంచి అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. ఈ సారి నిర్మాతల విభాగం నుంచి ఎన్నుకోవడం జరిగింది. ఇక ఛాంబర్ ఉపాధ్యక్షులుగా వి.వీరినాయుడు, పి.శ్రీనివాసబాబు, కె.బసిరెడ్డి, కార్యదర్శులుగా ఎం.రాందాస్, కె.శివప్రసాద్‌రావు, సహాయ కార్యదర్శులుగా మోహన్ వడ్లపట్ల, వి.రామకృష్ణ, ఎం.సుధాకర్, జె.మోహన్‌రెడ్డి, పి.సాంబమూర్తి, ఎన్. నాగార్జున ఎన్నిక కాగా, టి. రామసత్యనారాయణ కోశాధికారిగా గెలిచారు.

చిరంజీవి అభినందనలు..


ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా గెలుపొందిన జెమిని కిరణ్(పర్వతనేని కిరణ్)ను చిరంజీవి అభినందించారు. సోమవారం ఆయన నివాసంలో జెమిని కిరణ్‌ను సత్కరించారు. 'పరిశ్రమ మంచి చెడులపై పూర్తి అవగాహన ఉన్న పి.కిరణ్ వంటి వ్యక్తి ఛాంబర్ అధ్యక్ష పదవిలో ఉండటం పరిశ్రమ అభివృద్ధికి ఉపయోగపడుతుంది' అని ఈ సందర్భంగా చిరంజీవి ఆకాంక్షించారు.

వీరాభిమానిని..!


సాయి పల్లవి

'చదువుకునే రోజుల నుంచి తమిళ హీరో సూర్యకు నేను వీరాభిమానిని. ఆయన సినిమాలు మిస్ కాకుండా చూస్తాను' అని అంటోంది సాయి పల్లవి. మలయాళ 'ప్రేమమ్' చిత్రంతో ఆకట్టుకున్న సాయి పల్లవి ఇటీవల తెలుగులో 'ఫిదా' చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకులతోపాటు ఇండస్ట్రీ మొత్తాన్ని ఫిదా చేసింది. ఈ సందర్భంగా సాయి పల్లవి చెబుతూ, 'సూర్యతో కలిసి నటించే అవకాశం ఎప్పుడు వచ్చినా నటించేందుకు సిద్ధంగా ఉంటాను. కథా నాయికల్లో అనుష్క అంటే ఇష్టం. ఆమె నటన అద్భుతంగా ఉంటుంది. అయితే 'ఫిదా' చిత్రాన్ని రీమేక్ చేయాలని భావిస్తున్నారు. కానీ నేను ఎట్టి పరిస్థితుల్లోనూ రీమేక్‌లో నటించను. స్ట్రెయిట్ సినిమాలకే నా ప్రాధాన్యం' అని తెలిపింది. తెలుగులో నాని సరసన, నాగశౌర్య సరసన కథానాయికగా నటిస్తున్న సాయి పల్లవి తమిళంలో విజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కరు' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది.

సీక్రెట్ సూపర్‌స్టార్ ఫస్ట్‌లుక్


'సీక్రెట్ సూపర్‌స్టార్' లో జైరా వాసిం

అమీర్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'సీక్రెట్ సూపర్‌స్టార్'. జైరా వాసిం మరో ముఖ్యపాత్రధారి. అద్వైత్ చందన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ సోమవారం విడుదలైంది. జైరా వాసిం స్కూల్ విద్యార్థినిగా నడుచుకుంటూ పోతుండగా, పలు పేపర్స్‌పై మ్యూజిక్ ట్యూన్స్‌తో కూడిన ఈ ఫస్ట్‌లుక్ సినిమాపై ఆసక్తిని పెంచుతుంది. జైరా వాసిం గాయని కావాలని ఆశపడుతుంది. కానీ తన తండ్రి రోజూ తాగి వచ్చి తనని, అమ్మని చిత్రహింసలు పెడుతుంటాడు. తన తల్లిని తాగుబోతు తండ్రి నుంచి కాపాడుకుని తన ఆశయం ఎలా నెరవేర్చుకుంటుందన్న కథాంశంతో ఈ చిత్రం రూపొందుతుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను ఈ నెల 2న విడుదల చేయనున్నారు. దీపావళికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతోపాటు అమీర్ ఖాన్ 'థగ్స్ ఆఫ్ హిందూస్తాన్' చిత్రంలో నటిస్తున్నాడు.

ఎప్పటికైనా దర్శకత్వం వహిస్తా


అశోక్

'సుకుమార్, హరిప్రసాద్ మంచి స్నేహితులు. హరిప్రసాద్ రాసుకున్న కథ సుకుమార్‌కు నచ్చడంతో ఆయన్నే దర్శకత్వం వహించమని సలహా ఇచ్చారు. హరిప్రసాద్ నన్ను దృష్టిలో పెట్టుకుని ఆ కథను రాసుకున్నారు. దీంతో నేను హీరోగా మారాను' అని అంటున్నారు హీరో అశోక్. ఆయన హీరోగా, ఈషా హీరోయిన్‌గా హరిప్రసాద్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'దర్శకుడు'. ఈ నెల 4న ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో హీరో అశోక్‌తో మీడియా జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు చూద్దాం..

ఈ సినిమాలో మిమ్మల్ని హీరోగా ఎంపిక చేసుకోవడానికి ప్రత్యేక కారణం ?

దర్శకుడు సుకుమార్ మా బాబాయ్. ఆయన రూపొందించిన 'వన్ నేనొక్కడినే' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాను. హరిప్రసాద్, సుకుమార్ మంచి స్నేహితులు. ఈ కథను రాసుకుని హరిప్రసాద్ సుకుమార్‌కి వినిపించారు. ఈ సినిమాను నాతో చేస్తానని చెప్పగానే సుకుమార్ షాక్ అయ్యారు. 'వాడు కొత్త వాళ్ళ ముందు నిలబడాలంటేనే సిగ్గుపడతాడు. వాడితో ఎందుకులే కొత్త వాళ్ళతో చేద్దాం' అని అన్నారు. కానీ హరిప్రసాద్ పట్టుబట్టి నాతో చేశాడు. అలా హీరోగా మారాను.

ఈ చిత్ర నేపథ్యం గురించి?

సినిమా బ్యాక్‌డ్రాప్‌లో సాగే అందమైన ప్రేమ కథ ఇది. ఓ దర్శకుడికి, ఫ్యాషన్ డిజైనర్ మధ్య మొదలైన ప్రేమ చివరకు ఏ మజిలీకి చేరిందనేది సినిమా. సుకుమార్ జీవితంలో చోటు చేసుకున్న కొన్ని సంఘటనలు, దర్శకుడు హరిప్రసాద్ లైఫ్‌లోని సంఘటనలు ఈ చిత్రంలో ఉంటాయి. హీరోయిన్‌గా ఈషా బాగా నటించింది. సాయి కార్తీక్ మ్యూజిక్‌కి మంచి స్పందన లభిస్తోంది.

హీరోగా ఫస్ట్ సినిమా. ఆ అనుభవం ఎలా ఉంది?

బేసిక్‌గా నాకు హీరో అవ్వాలనే ఆలోచన లేదు. నటనలో ఓనమాలు కూడా తెలియవు. నాతో ఈ సినిమా చేయించుకోగలననే నమ్మకం ఉంటేనే ఇందులో నటిస్తానని హరిప్రసాద్‌కి చెప్పాను. తొలి రోజు నుంచి సినిమా పూర్తి భారమంతా ఆయనపై పెట్టాను. ఆయన చెప్పింది ఫాలో అయ్యాను. ఆయన నిరంతరం నాలో ధైర్యాన్ని నింపారు.

ఈ సినిమాలో రొమాన్స్ ఎక్కువగా ఉంటుందా?

అలా ఏం ఉండదు. కాకపోతే ఒక లిప్‌లాక్ ఉంటుంది. అది కూడా ప్రత్యేకంగా పెట్టలేదు. ఓ సన్నివేశంలో కథానాయకుడు తాను తీస్తున్న ముద్దు సన్నివేశం సరిగా రాకపోవడంతో దానిని ఎలా చేయాలో చూపించడం కోసం దర్శకుడు తన ప్రియురాలికి ముందుపెడతాడు. అంతకు మించి ఉండదు.

సుకుమార్ ప్రభావం మీపై ఎంత వరకు ఉంటుంది?

చాలా వరకు ఆయన ప్రభావం ఉంది. 'వన్ నేనొక్కడినే' కి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నప్పుడు ఓ సన్నివేశానికి నేను రాసిన వెర్షన్ సుకుమార్‌కు బాగా నచ్చింది. అంతేకాదు ఆ చిత్ర షూటింగ్‌లో సుకుమార్ ఎలా ఉంటారు, సన్నివేశాలు బాగా రావడం కోసం ఆయన పడే తపన, ఏదైనా సరిగా లేకపోతే ఎలా స్పందిస్తారో ప్రత్యక్షంగా చూశాను. ఈ చిత్రంలో దర్శకుడిగా పాత్రలో నటించేటప్పుడు సుకుమార్ ఎలా బిహేవ్ చేస్తారో అలా చేసేవాడిని.

సినిమా చూసి సుకుమార్ ఎలా స్పందించారు?

బాబాయ్ సినిమా విషయంలో చాలా హ్యాపీగా ఉన్నారు. బాగా నటించానని నన్ను మెచ్చుకున్నారు. ప్రత్యేకంగా నా వాయిస్ గురించి మాట్లాడారు. ఈ సినిమా సైతం సుకుమార్ స్టైల్‌లో ఉంటుంది. దర్శకుల్లో బాబాయ్ అంటే ఇష్టం. ఆ తర్వాత రాజమౌళి నచ్చుతారు. హీరోల్లో చిరంజీవి నా ఫేవరేట్.

సినిమా ప్రమోషన్స్‌కి స్టార్ హీరోలు వచ్చారు. అది మీ సినిమాకు ఎంత వరకు ఉపయోగపడుతుంది?

ఎన్టీఆర్, రామ్‌చరణ్, అల్లు అర్జున్ వంటి అగ్రనటులు వచ్చి మా చిత్ర ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. మా సినిమాను జనంలోకి తీసుకెళ్లడానికి వారి రాక ఎంతగానో ఉపయోగపడింది. అంతేకాదు నటుడిగా నాకు ఈ సినిమా మంచి గుర్తింపును తెచ్చిపెడుతుందని భావిస్తున్నాను.

భవిష్యత్‌లో ఎలాంటి సినిమాలు చేయాలనుకుంటున్నారు?

నా భవిష్యత్ బాబాయ్ సుకుమార్, హరిప్రసాద్ నిర్ణయం పైనే ఆధారపడి ఉంది. అవకాశాలు వస్తే నటించడానికి నేను ఎప్పుడూ సిద్ధమే. నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలనుకుంటున్నాను. విభిన్న కథా నేపథ్యంతో కూడిన చిత్రాలకే ప్రాధాన్యతనిస్తాను. అయితే ఎప్పటికైనా ఓ సినిమాకు దర్శకత్వం వహిస్తాను.

హీరోగా మరో చిత్రం


సప్తగిరి

'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' చిత్రంతో హీరోగా నిరూపించుకున్న సప్తగిరి ఓ వైపు హాస్యనటుడిగా చేస్తూనే మరోవైపు హీరోగా వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటున్నాడు. తాజాగా నట్టీస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై రూపొందే చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. స్వర్ణ సుబ్బారావు దర్శకుడు. చంద్రనాథ్ సమర్పణలో నట్టికుమార్ కుమార్తె నట్టి కరుణ, కుమారుడు నట్టి క్రాంతి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ, 'హాస్యనటుడిగా ప్రేక్షకులకు దగ్గరైన సప్తగిరి ఆ తర్వాత హీరోగా మారి 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' చిత్రంతో విజయదుంధుబి మోగించారు. ఈ నేపథ్యంలో మంచి కథలను ఎంపిక చేసుకుని ముందుకు సాగుతున్నారు. ఆయన హీరోగా మా బ్యానర్‌లో సినిమాను నిర్మించడం ఆనందంగా ఉంది. నవ్యమైన కథతో ఈ చిత్రం ఉంటుంది. ఈ నెల 5న హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో మా నూతన చిత్రాన్ని ప్రారంభించనున్నాం. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు ప్రారంభోత్సవం రోజున వెల్లడిస్తాం' అని చెప్పారు.


'తారామణి'లో అంజలి

రాజమౌళినే కారణం


ప్రభాకర్

'బాహుబలి' చిత్రంలో కాళకేయగా మంచి పేరు తెచ్చుకున్న ప్రభాకర్‌కు ఇప్పుడు తెలుగుతోపాటు తమిళ, కన్నడ,మలయాళ భాషల్లో వరుస అవకాశాలు వస్తుండటంతో తన ఆనందాన్ని మీడియాతో పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ, 'నన్ను ప్రేక్షకులకు పరిచయం చేసిన రాజమౌళి గారికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఈ రోజు నేడు ఎక్కడికి వెళ్ళినా గుర్తు పడుతున్నారంటే దానికి కారణం రాజమౌళి గారే. మొదట్లో 'మర్యాద రామన్న'లో నాకు మంచి పాత్ర ఇచ్చి ప్రోత్సహించారు. ఆ తర్వాత 'బాహుబలి'లో విలన్‌గా కిలికిలి భాషతో నన్ను నిరూపించుకునేలా చేశారు. 'బాహుబలి' తర్వాత నాకు మంచి అవకాశాలు వస్తున్నాయి. కేవలం తెలుగులోనే కాకుండా తమిళ, మలయాళం, కన్నడ నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుదేవా సినిమాలో మెయిన్ విలన్‌గా నటిస్తున్నాను, డైరెక్టర్ ప్రభు సాల్మన్ సినిమాలో, మలయాళంలో మమ్ముటి సినిమాలో, కన్నడలో సునీల్ దేశాయ్ దర్శకత్వంలో, తెలుగులో బాలకృష్ణ సినిమాలో నటిస్తూ ఫుల్ బిజీగా ఉన్నాను. నన్ను ఆదరించిన, ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ, ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని తెలిపారు.

స్త్రీల సమస్యల నేపథ్యంలో తారామణి

అంజలి, ఆండ్రియా, వసంత్ రవి ప్రధాన పాత్రధారులుగా రామ్ దర్శకత్వంలో తమిళంలో రూపొందుతున్న 'తారామణి' చిత్రాన్ని డి.వి. సినీ క్రియేషన్స్ పతాకంపై డి.వి.వెంకటేష్ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం గురించి నిర్మాత మాట్లాడుతూ, 'ట్రయాంగిల్ లవ్‌స్టోరీ ఇది. సినిమాలో ఎమోషనల్ కంటెంట్‌తోపాటు అన్ని ఎలిమెంట్స్ సమపాళ్లలో ఉంటాయి. ప్రతి సన్నివేశం మనసును హత్తుకునేలా ఉంటుంది. ప్రస్తుత సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో సినిమా సాగుతుంది. యువత టెక్నాలజీ మాయలో పడి ఎలా ప్రవరిస్తున్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనవుతున్నారు. ఫలితంగా వారెలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారనే అంశాలు సినిమాలో ప్రధానంగా ఉంటాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఈ నెలలోనే విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

బడిపిల్లల బువ్వకు బంగారం తాకట్టు



కష్టాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు

- 7నెలలుగా వేతనాలు, 4నెలలుగా బిల్లులు కరువు
- కట్టెల పొయ్యి... రేకుల షెడ్లలో ఇబ్బందులు
- ఒక్క జిల్లాలోనే రూ.3కోట్ల బకాయి

నవతెలంగాణ-జ8ామ ప్రతినిధి

రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 41,061 ఉన్నాయి. వీటిలో 60లక్షల60వేల8 మంది విద్యార్థులు చదువుతున్నారు. లక్ష మందికి పైగా మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారు. జనగామ జిల్లాలో 692 పాఠశాలలున్నాయి. వాటిలో 86వేల 649 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ జిల్లాలో 1500 మందికి పైగా మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలో భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్ అర్బన్, రూరల్, జనగామ జిల్లాల్లో 4,734 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 5లక్షల 10వేల 22 మంది విద్యార్థులు ఉన్నారు. 5,800 మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా రెక్కాడితే గానీ డొక్కాడనివారే. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా రూ.వెయ్యి చొప్పున పారితోషికం ఇస్తోంది. బియ్యం సరఫరా చేస్తుండగా కూరగాయలు, చింతపండు, నూనె, పప్పు, అల్లం, వెల్లిపాయ, ఉల్లిగడ్డ, కోడిగుడ్డు అన్ని వీరే కొనుగోలు చేసి ప్రతినెలా బిల్లులు పెట్టుకోవాలి. అధికారుల దయ ఉంటే నెలా, రెండు నెలలకు ఒకసారి వస్తాయి. లేదంటే ఇక అంతే. ఐదారు నెలలు పట్టొచ్చు. గత విద్యా సంవత్సరం నుండి వీరికి సక్రమంగా వేతనాలు, వంట బిల్లులు చెల్లించడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బువ్వ కోసం బంగారం తాకట్టు

మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతినెలా ఇవ్వాల్సిన వేతనాలు జనవరి నుంచి ఇవ్వడం లేదు. మార్చి 15 వరకు సరుకుల బిల్లులు చెల్లించగా అప్పటి నుండి మే మినహా జులై వరకు బిల్లులు రావాల్సి ఉంది. మే మాసం సెలవు కావడంతో నాలుగు మాసాల బిల్లులు రావాలి. నెల సామాన్లు తేవడం కోసం ఇబ్బందులు పడుతున్నారు. జనగామ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మేడ మంగతోపాటు మరో ఇద్దరు మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారు. 480 మంది విద్యార్థులు ఉండగా వారంలో మూడు రోజులు కోడిగుడ్డుతోపాటు కూరగాయలు, పప్పులతో భోజనం పెట్టాలి. నెల రోజులపాటు దుకాణంలో ఖాతా పెట్టి సామాన్లు తీసుకురాగా మరో నెల ఇవ్వలేదు. దీంతో ఆమె తన వంటిపై ఉన్న పుస్తెల తాడు, కమ్మలు, పట్టీలు కుదవపెట్టి కిరాణం సామాన్లతోపాటు కూరగాయలు తెచ్చింది. ఇప్పటికే రూ.లక్ష పైగా అప్పు చేసి పెట్టింది. ఇది కూడా మూడు నుంచి ఐదు రూపాయల వడ్డీకి. అప్పుడప్పుడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ వద్ద డబ్బులు బదులు తీసుకొని సామాన్లు తెస్తుంది. అన్ని పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికులు కూడా అధిక వడ్డీలకు అప్పులు చేసి సామాన్లు తెస్తున్నారు. బిల్లులు వచ్చిన తరువాత వడ్డీతో కలిపి చెల్లిస్తున్నారు.

రేకుల షెడ్లు... కట్టెల పొయ్యి

వంట గదులు లేకపోవడంతో ఆరు బయటనే వంట చేయాల్సి వస్తోంది. కొన్నిచోట్ల రేకులషెడ్లున్నాయి. కానీ సగం కూలిపోయి... నూటికి 60శాతం పాఠశాలల్లో షెడ్లులేవు. గతంలో నిర్మించిన షెడ్లు 10 ఫీట్ల వెడల్పుతో ఉండడంతో వంట చేయలేని పరిస్థితి. వంట గదులు లేకపోవడం ఒకటైతే కట్టెల పొయ్యితో మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిన సందర్భంలో కట్టెలు తడిసి మంట మండటం లేదు. రేకుల షెడ్ల కింద వంట చేయడంతో పైన ఎండవేడి, కింద మంట వేడిని భరించలేకపోతున్నారు. పొగ కారణంగా శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయి. విద్యాశాఖకు కోట్లాది రూపాయలు కేటాయించామని చెబుతున్న ప్రభుత్వం వంటగదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించలేకపోతున్నది.

ఇటీవల విడుదల చేశాం : డీఈవో యాదయ్య

జిల్లాలో మూడు కోట్ల రూపాయలు ఇటీవల విడుదల చేశామని జనగామ డీఈవో యాదయ్య తెలిపారు. జూన్ తొమ్మిదో తేదీనే విడుదల చేయగా ఫ్రీజింగ్‌తో ఆగిపోయాయన్నారు. త్వరలోనే వారి ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. వెంటనే అందించాలని సంబంధిత సెక్షన్ ఆఫీసర్‌ను ఆదేశించినట్టు డీఈవో వివరించారు.

బంగారం కుదవపెట్టి సామా8 తెచ్చా : మేడ మంగ



మార్చి నుంచి వంట సామాన్లు, కూరగాయల బిల్లులు రావడం లేదు. దీంతో అప్పులు చేసి వండిపెడుతున్నాం. కిరాణం దుకాణంలో సామాన్లు ఇవ్వకపోవడంతో బంగారం కుదవపెట్టి అప్పు తెచ్చానని జనగామ పట్టణంలోని జెడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తున్న మేడ మంగ తన ఆవేదన వెలిబుచ్చింది. పుస్తెలతాడు, కమ్మలు, పట్టీలు కుదవపెట్టి రూ.లక్షకుపైగా మూడు రూపాల వడ్డీకి అప్పు తెచ్చానని వివరించింది. మధ్యాహ్న భోజన కార్మికుల అందరి పరిస్థితి ఇలాగే ఉందని తెలిపింది.

దళితులు సత్తా చూపాలి

8తెలంగాణ-కొత్తగూడెం

కేసీఆర్ సర్కార్‌కు దళితుల సత్తా చూపించాలని, మేకల్లా కాకుండా పులులై తిరగబడాలని కేవీపీఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జాన్‌వెస్లీ, భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంత దళితులకు మూడెకరాల భూమి ఇవ్వకుంటే రూ.21 లక్షల పరిహారం చెల్లించాలని, ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. జూలై 22 నుంచి 30వ తేదీ వరకు భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా జీపుజాతా నిర్వహించారు. సోమవారం దళిత పోరుగర్జన ముగింపు సభ నిర్వహించారు. తొలుత తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందచేశారు. ఈసందర్భంగా జాన్‌వెస్లీ, సున్నం రాజయ్యలు మాట్లాడుతూ దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పిన కేసీఆర్ సర్కార్ ఆ హామీని విస్మరించిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో దళితులకు మూడెకరాలు ఇచ్చేందుకు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. అడవిలో ఉన్న భూములు దున్నుకునేందుకు దళితులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. దళితులకు బ్యాంకుతో సంబంధం లేకుండా కార్పొరేషన్ ద్వారా రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వెంటనే భర్తీ చేయాలని డిమా ండ్ చేశారు. ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. నిరుద్యోగ యువ తకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లేకుంటే నిరుద్యోగ భృతి రూ.5వేలు చెల్లిం చాలని డిమాండ్ చేశారు. జీవో 1235 అమలుచేసి దళితవాడలకు శ్మశాన వాటి కలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భద్రాచలం, కొత్తగూడెం, మణు గూరు, ఇల్లందు, పాల్వంచ పట్టణాల్లో నివాసముంటున్న దళితులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో స్థానిక ఎమ్మెల్యే వెంకట్రావు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

మూడెకరాల భూపంపిణీపైనే తీర్మా8 : సు8ం రాజయ్య

టీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరిస్తోందని, ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో తొలి వాయిదా తీర్మానం భూపంపిణీపైనే ప్రవేశపెట్టి ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఎమ్మెల్యే సున్నం రాజయ్య అన్నారు. సీపీఐ(ఎం) పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేస్తామని ప్రకటించిందని, కానీ ఆచరణలో మాత్రం మొండి చేయి చూపుతున్నదని విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచి హక్కులు సాధించుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పై ఇప్పటికే మూడు సార్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారే తప్ప అమలుకు ఎటువంటి ప్రయత్నాలూ చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా మాయమాటలతో దళితులను మోసం చేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నదని విమర్శించారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పాటు చేయడానికి కేవీపీఎస్ నిర్వహించిన పోరాటాలే ప్రధాన కారణమని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పిట్టల రవి, కార్యదర్శి మేరుగు ముత్తయ్య జిల్లా నాయకులు సాదనపల్లి సతీష్, మన్యం మోహన్‌రావు, కొడిశాల రాములు, రాయపూడి ఏసురత్నం, రాయల వెంకటేశ్వర్లు, ఇ.నర్సింహారావు, పిల్లి ఆనంద్, రింగు వెంకటయ్య, నందిపాటి రమేష్, కనకరత్నం తదితరులున్నారు.

తెలంగాణ ఇచ్చింది.. ఇసుక మాఫియా కోసమా?

నేరెళ్ల ఘటనపై న్యాయ విచారణ

- అట్రాసిటీ కేసు 8మోదు చేయాలి
- పార్లమెంటులో చర్చకు తెస్తాం: లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్
- జైలులోని బాధితులకు పరామర్శ

8తెలంగాణ-కరీం8గర్ ప్రతినిధి

పార్లమెంటులో తన అధ్యక్షతన నిర్వహించిన సమావేశాల్లో తెలంగాణ బిల్లు ఆమోదించినందుకు సంతోషంగా ఉన్నా అదే సమయంలో నేరెళ్ల ఘటన చూస్తే తెలంగాణ ఇచ్చింది ఇసుక మాఫియా కోసమేనా? అని బాధకలుగుతోందని లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. నేరెళ్లలోని దళితులను అమానుషంగా పోలీసులు చిత్రహింసలకు గురి చేసిన ఘటనపై న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జైలులో ఉన్న బాధితులను సోమవారం పరామర్శించారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్లలోని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భాల్లో ఆమె మాట్లాడుతూ అకారణంగా చిత్రహింసలకు గురి చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. ఈ ఘటనపై పార్లమెంటులో చర్చకు తీసుకువస్తామని చెప్పారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన సర్కారే భక్షిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. జైలులో బాధితుల పరిస్థితి హృదయవిదారకంగా ఉందని అన్నారు. వారిని చూసిన అనంతరం మనసు ద్రవించి పోయిందన్నారు. తాను నలుగురితో మాట్లాడినట్టు చెప్పారు. ఒకరికి కిడ్నీ దెబ్బతిని మూత్రం నుంచి రక్తం వస్తోందని తెలిపారు. మరొకరికి ఛాతి ఎముకలు విరిగాయని చెప్పారు.



తమ గ్రామానికి చెందిన వ్యక్తిని ఇసుక లారీలు పొట్టనపెట్టుకున్న క్రమంలో గ్రామస్తులకు ఆగ్రహం రావడం సహజమేనన్నారు. దీంతో ఇసుక లారీలు తగలబెట్టినంత మాత్రాన దళితులను చిత్రహింసలకు గురిచేయడం సరికాదన్నారు. ఈ ఘటన పట్ల రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. తెలంగాణ వస్తే దళిత, గిరిజన, అల్పసంఖ్యాక వర్గాలకు న్యాయం జరుగుతుందని భావించామనీ, కానీ ఈ ఘటనతో తమ కలలు కల్లలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటు చేసిన సభను అడ్డుకోవడం అమానుషమన్నారు. దళితులు, గిరిజనులు, అల్పసంఖ్యాక వర్గాలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, మూడెకరాల భూమిలో వ్యవసాయాన్ని చూడటానికి రావాల్సింది పోయి ఇలాంటి ఘటన పట్ల వచ్చినందుకు బాధగా ఉందని చెప్పారు. జైలులో ఉన్న బాధితుల్లో డిగ్రీ చదువుతున్న ఒక విద్యార్థికి కనీసం స్కాలర్‌షిప్ లేకపోగా, డిగ్రీ పూర్తయిన యువకునికి ఉద్యోగం కూడా లేదన్నారు. అలాంటి వారిని విద్యుత్‌షాక్‌కు గురిచేసి భవిష్యత్ లేకుండా చేయడం అమానవీయ చర్యగా పేర్కొన్నారు. ఇంత జరిగినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోరు మెదపడం లేదన్నారు. ఇసుక లారీల చక్రాల కింద ఇంతవరకు ఐదుగురు మృతిచెందగా కేసు పెట్టలేదని, బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదని, ఇసుక క్వారీ కాంట్రాక్టు రద్దు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీ ప్రమాదంలో మృతిచెందిన గిరిజనుడి కుటుంబానికి కనీసం పరిహారం ఇవ్వలేదన్నారు. పైగా అమాయకులను పట్టుకొని చిత్రహింసలకు గురిచేశారని ఆవేదన వ్యక్తంచేశారు. అందులోనూ ఈ ఘటన బయటకు పొక్కితే దళిత మహిళలపై వ్యభిచార కేసు నమోదు చేస్తామని హెచ్చరించడం సిగ్గుచేటుగా పేర్కొన్నారు. సమావేశంలో పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు కటకం మృత్యుంజయం మాట్లాడారు. సీఎల్పీ నాయకులు జానారెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క, మాజీ మంత్రులు గీతారెడ్డి, శ్రీధర్‌బాబు, సబితా ఇంద్రారెడ్డి, గల్లా అరుణకుమారి, మాజీ ఎంపీలు బలరాంనాయక్, పొన్నం ప్రభాకర్, జగిత్యాల ఎమ్మెల్యే టి. జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజనుడిపై ఎలుగుబంటి దాడి

8తెలంగాణ-అశ్వాపురం

పొలంపనికి వెళ్తున్న గిరిజనుడిపై ఓ ఎలుగుబంటి దాడిచేసిన ఘటన భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం వేములూరు అటవీ ప్రాంతంలో సోమవారం చోటుచేసుకుంది. వేములూరుకి చెందిన రైతు కుంజం బొజ్జయ్య అతని కుమారుడు రామయ్యతో కలసి అటవీ ప్రాంతంలో ఉన్న వారి చేను వద్దకు వెళ న్నారు. మార్గమధ్యలో ఎలుగుబంటి వారిని చూసి ఒక్కసారిగా మీదకు వచ్చి బొజ్జయ్యపై దాడిచేసింది. దీంతో అతని కుమారుడు కేకలు వేయడంతో ఎలుగుబంటి అక్కడి నుంచి పారిపోయింది. ఈ ఘటనలో ఆయనకు తీవ్రమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు 108కు సమాచారం అందజేశారు.

108 వెళ్లేందుకు దారిలేక నాలుగు కిలోమీటర్లు మంచంపైనే

వేములూరు గ్రామం మండల కేంద్రానికి సుమారు 15 కిలోమీటర్ల అటవీ ప్రాంతంలో ఉంది. దీంతో మండల కేంద్రం నుంచి ఎలకలగూడెం గ్రామంలోని ఇసుకవాగు వరకే రోడ్డు సౌకర్యం ఉండటంతో 108 అక్కడ వరకు వెళ్లగలిగింది. దీంతో స్థానికులు గాయపడ్డ అతన్ని మంచంపై జోలి కట్టుకుని వేములూరు నుండి ఇసుకవాగు వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు మోసుకుని వచ్చారు.

'గో' గూండాలకు సర్కార్ అండ

8తెలంగాణ-8్యఢిల్లీబ్యూరో

ఆవు రక్షణ పేరుతో దళితులను, ముస్లింలను కొట్టి చంపుతున్న గోరక్షక ముఠాలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రోత్సాహమిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. బీజేపీ సిద్ధాంతాలను, ఆలోచనలను దేశ ప్రజలపై అమలు చేయాలని ప్రయత్నించడం వల్లే ఈ నేరాలు(కొట్టి చంపుతున్న ఘటనలు) జరుగుతున్నాయని ఆరోపించింది. ఈ ఘటనల్లో బీజేపీ అనుబంధ సంస్థలైన వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, గోరక్షక ముఠాల ప్రమేయం ఉన్నదని ఆరోపించింది. హిందుస్తాన్‌ను లించిస్తాన్(అల్లరి మూకలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని కొట్టిచంపడం)గా మార్చొద్దని హితవు పలికింది. కాగా రాజకీయాలకతీతంగా ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని విపక్షాలు కోరాయి. గోరక్షక ముఠాలపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశాయి. ఇందుకు సంబంధించి భారతశిక్షాస్మృతిలోని నిబంధనలను కఠినతరం చేయాలని కోరాయి. కాగా దేశంలో అల్లరిమూకల కొట్టిచంపిన ఘటనలు జరగడం ఇదే మొదటిసారి కాదని, కాంగ్రెస్ హయాంలోనూ చోటుచేసుకున్నాయని బీజేపీ తెలిపింది. పైగా ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వాలే చర్యలు తీసుకోవాల్సి ఉన్నదని తెలిపింది. దేశవ్యాప్తంగా అల్లరిమూకలు పాల్పడుతున్న హత్యలపై సోమవారం లోక్‌సభలో చర్చ జరిగింది. రూల్ 190 ఆధారంగా స్పీకర్ సుమిత్రా మహజన్ చర్చ చేపట్టారు. ఈ అంశంపై మొదట లోక్‌సభ ప్రతిపక్ష నేత మల్లిఖార్జునఖర్గే మాట్లాడారు. అల్లరిమూకలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ముస్లింలపై, క్రిస్టియన్లపై, దళితులపై, మహిళలపై జరుపుతున్న దాడులు ఖండనీయమని చెప్పారు. 'ఈ దాడుల్లో బీజేపీ అనుబంధ సంస్థలు భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ, గోరక్షక ముఠాల హస్తముంది. ఎన్డీయే సర్కారు కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ సంస్థలకు ప్రోత్సాహం అందిస్తోంది' అని విమర్శించారు. 70 యేండ్లలో దేశంలో ఏనాడూ మతం, ఆవు పేరిట కొట్టి చంపిన ఘటనలు జరగలేదని వివరించారు. పైగా ఈ ఘటనలపై ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేదొకటని ఆయన విమర్శించారు.

'గోరక్షకులను స్వయంగా ప్రధానమంత్రి గూండాలని అన్నారు. మరీ వీళ్లకు వ్యతిరేకంగా ఇప్పటి వరకు ఏం చర్యలు తీసుకున్నారు? ఎంతమందిని జైల్లో వేశారు?' అని ప్రశ్నించారు. జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లు అల్లరిమూకల హత్యలకు కేంద్రాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం సిగ్గుచేటని, పైగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కువగా చోటుచేసు కుంటున్నాయని వివరించారు. కేరళలో ఒక పార్టీ కార్యకర్త హత్య జరిగితే.. కేంద్ర హోంమంత్రి, గవర్నర్ అందరూ రంగంలోకి దిగుతారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని పిలిపించి మాట్లాడతారు. మరీ దేశవ్యాప్తంగా ఇంతమందిని హత్య చేస్తుంటే ఎందుకు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులను పిలవడం లేదు? మీ మనిషి ఉంటే ఒకలా.. మరొకరైతే ఇంకోలా వ్యవహరిస్తారా?' అని ప్రశ్నించారు. గోరక్షక దాడులతో దేశంలో భయానక పరిస్థితులను సృష్టిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని అంతమొందిస్తున్నారని ఆరోపించారు. గోరక్షక ముఠాలపై కఠిన చర్యలు చేపట్టాలని మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేసిన వ్యాఖ్యలను ఖర్గే సభలో ప్రస్తావించారు. దీనిపై బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత : బీజేపీ

అల్లరిమూకల హత్యలను ప్రధానమంత్రి ఖండించారని బీజేపీ ఎంపీ హుకుమ్‌దేవ్ నారాయణ్ చెప్పారు. ఈ ఘటనలపై చర్యలు చేపట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు. 'అల్లరిమూకల హత్యల ఘటన నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం పారామిలటరీ బలగాలను రాష్ట్రాలకు పంపబోదు' అని అన్నారు. పైగా ఈ ఘటనలతో కేంద్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని ఆరోపించారు. ఇక దేశంలోని ముస్లింలందరూ ఒకప్పటి హిందూవులేనని వ్యాఖ్యానించారు. జునైద్ హత్యను హిందూ-ముస్లిం గొడవగా చిత్రీకరించొద్దని హితవు పలికారు. 'రైలులో సీటు కోసం జరిగిన గొడవ వల్ల ఆ ఘటన చోటుచేసుకుంది' అని అన్నారు. పైగా బీహార్‌లో ఓ మంత్రి జైశ్రీరాం అన్నందుకు క్షమాపణ చెప్పించారని, ఇదే అసలైన కొట్టిచంపిన ఘటన అని చెప్పుకొచ్చారు. ఆ పార్టీకి చెందిన మరో ఎంపీ ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ.. 1950-1995 వరకు మొత్తం 1194 ఘటనలు జరిగాయని చెప్పారు. నెహ్రూ హయాంలో 72 శాతం ఘటనలు చోటుచేసుకున్నాయని వివరించారు. పైగా పశ్చిమబెంగాల్‌లో 28,000 రాజకీయ హత్యలు జరిగాయని చెప్పారు. ఈ సందర్భంగా టీఎంసీ ఎం పీలు ఆయన ప్రసంగాన్ని అడ్డుకున్నారు. కేరళలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని చెప్పారు.

మోడీ హయాంలో 92 శాతం పెరిగి8దాడులు : టీఎంసీ

అల్లరిమూకలు కొట్టిచంపిన ఘటనల్లో 24 మంది ముస్లింలు చనిపోయారని టీఎంసీ ఎంపీ సౌగత్‌రాయ్ తెలిపారు. 'మీరు కాంగ్రెస్ రహిత భారత్ కావాలనుకుంటున్నాం అన్నారు. అదనంగా ముస్లింరహిత భారతం కావాలని కూడా భావిస్తున్నారా' అని ప్రశ్నించారు. పైగా 23 ఘటనల్లో దాడులకు పాల్పడింది భజరంగ్‌దళ్, హిందూ సంస్థల సభ్యులని చెప్పారు. 'బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 52 శాతం దాడులు జరిగాయి. కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలోకి వచ్చాక 92 శాతం ఘటనలు చోటుచేసుకున్నాయి' అని వివరించారు. అల్వార్ ఘటనను ఖండించేందుకు రాజస్థాన్ ముఖ్యమంత్రికి నెల రోజుల సమయం పట్టిందని, జార్ఖండ్ ముఖ్యమంత్రికి ఆ రాష్ట్రంలో జరిగిన ఘటనపై స్పందించేందుకు ఆరు రోజులు పట్టిందని ఎద్దేవా చేశారు. ఇక ప్రధానమంత్రి కేవలం రెండు ప్రకటనలు మాత్రమే చేశారని అన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నాశ8 : బీజేడీ

అల్లరిమూకల హత్య ఘటనలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాయని బీజేడీ ఎంపీ తథాగత సత్పతి అన్నారు. 'దేశంలోని పేద హిందూ రైతులు కాలం చెల్లిన ఆవులను విక్రయించి మేలిరకమైన పశువులను కొనుగోలు చేయడం సర్వసాధారణం. కానీ అల్లరిమూకల ఘటనలతో రైతులు తమ పశువులను విక్రయించలేని పరిస్థితి దాపురించింది. ఫలితంగా ముసలి పశువుల దాణాకు ఒక్కో ఆవుకు నెలకు రూ.3000 చొప్పన ఖర్చు చేస్తున్నారు. పైగా ఏదైనా రోగం వస్తే మందులు మరో రూ.1500 అవుతున్నాయి. వ్యవసాయ సంక్షోభంతో పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన రైతులకు ఇదో అదనపు ఆర్థిక భారం. భవిష్యత్తుల్లో వీటి నిర్వహణ కోసం రుణాలు తీసుకునే పరిస్థితి వస్తుంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. కాలం చెల్లిన పశువులను బీజేపీ నేతల ఇండ్ల ముందు కట్టేయాలని, అప్పుడు కానీ వాటి నిర్వహణ ఆ నేతలకు అర్థం కాదని అన్నారు. ఇక గోమాత అంటూ గోరక్షక గూండాలు దాడులకు పాల్పడుతున్న ఘటనలపై ఎంపీ తనదైన శైలిలో స్పందించారు. 'దేశంలో నేడు చాలా ఆవులు జెర్సీ రకానికి చెందినవి. గోరక్షకులు తమ అమ్మను గుర్తించలేరు. ఓ వైపు దేశీజాతి ఆవులు కనమరుగవుతున్నా పట్టించుకోవడం లేదు' అని అన్నారు.

మంచిరోజులు ఇవేనా? : ఎన్సీపీ

దేశ ప్రజలకు మంచిరోజులు తీసుకొస్తామని వాగ్దానం చేశారని, ఇవేనా మంచిరోజులని ఎన్సీపీ ఎంపీ సుప్రియాసూలే బీజేపీ నేతలను ప్రశ్నించారు. ఇక జునైద్‌ను చంపిన నిందితుడు బెయిల్‌పై బయటకు వచ్చి స్వేచ్ఛగా తిరుగుతున్నాడని చెప్పారు. ఇలాంటి ఘటనల్లో బెయిల్ రాకుండా చేయాలని కోరారు.

దేశంలో ప్రతి ఒక్క చోట హింస : ఎస్పీ

దేశంలో ప్రతి ఒక్క చోటు హింస చోటుచేసుకుంటోందని ఎస్పీ నేత ములాయంసింగ్ అన్నారు. చాలా ఘటనల్లో కులం ఆధారంగా జరుగుతోందని, మహిళలను సైతం ఇంట్లో అణగదొక్కుతున్నారని చెప్పారు. సమాజంలో సామరస్యకమైన వాతావరణం ఉండాలంటే మొదట ఇంట్లో ఉండాలని, భార్యలపై పెత్తనం, హింస చేయొద్దని సూచించారు.

దాడులు దురదృష్టకరం : టీఆర్ఎస్

దేశవ్యాప్తంగా ఆవు రక్షణ పేరుతో దాడులు జరగడం దురదృష్టకరమని టీఆర్ఎస్ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. నూతనంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం.. విభిన్న సంస్కృతులకు, సంప్రదాయాలకు నెలవని చెప్పుకొచ్చారు.

రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు, సిక్కులు, మరాఠీలు గంగా యమునా తహజీబ్‌లా కలిసి ఉంటామని తెలిపారు. దేశంలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న ఘటనలతో ఆందో ళన చెందుతున్నట్టు చెప్పారు. 17 మంది పార్టీ ఎం పీల్లో వివిధ రకాల కులాలకు, మతాలకు, తెగలకు చెందినవాళ్లం ఉన్నామని వివరించారు. తామే అసలైన భారతీయులమని విశ్వేశ్వరరెడ్డి తెలిపారు.

రాష్ట్రాలకు సూచ8ు చేశాం : హోంశాఖ సహాయమంత్రి

ఆవురక్షణ పేరుతో దేశంలో చోటుచేసు కుంటున్న ఘటనలపై కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు చేశామని హోంశాఖ సహాయ మంత్రి కిరన్‌రిజిజు చెప్పారు. లోక్‌సభలో చర్చ అనంతరం ఆయన సమాధానం ఇచ్చారు.


'అల్లరిమూకల హత్యలు అత్యంతదారుణమైన నేరరూపం.

దీన్ని పూర్తిగా ఖండించాల్సిందే. కానీ విపక్షాలు కొన్ని ఎంచుకున్న ఘటనలను ఎందుకు ప్రస్తావిస్తున్నాయి' అని ప్రశ్నించారు. గతంలోనూ అసహనం, ఆ తరువాత ఘర్‌వాపసీ, అనంతరం భావ ప్రకటన స్వేచ్ఛ అంటూ ఆందోళన చేశాయని విపక్షాలపై ఆరోపణలు గుప్పించారు. ఈ ఘటనలను ప్రధాని ఖండించారని, అభివృద్ధి అన్ని సమస్యలకు పరిష్కారమని చెప్పారు. ప్రధాని ఇమేజ్‌ను దెబ్బతీయొద్దని సూచించారు.

ప్రయివేటు సైన్యాన్ని నిషేధించాలి...

- సీపీఐ(ఎం) ఎంపీ ఎండీ సలీం

8తెలంగాణ-8్యఢిల్లీబ్యూరో



గోరక్షణ పేరుతో ముస్లింలను, దళితులను కొట్టిచంపుతున్న ప్రయివేటు సైన్యాన్ని నిషేధించాలని సీపీఐ(ఎం) ఎంపీ ఎండీ సలీం కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అల్లరిమూకలు పాల్పడుతున్న హత్యలు సమర్థనీయం కాదని అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో డీఎస్పీ అయూబ్ పండిత్ హత్యతో పాటు జునైద్, పెహ్లుఖాన్ ఘటనలను ప్రస్తావిస్తూ ఆయన పైవ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో సోమవారం జరిగిన చర్చలో ఎండీ సలీం మాట్లాడారు. ఈ ఘటనలను రాజకీయ కోణంలో చూడొద్దని హితవు పలికారు. 2010 నుంచి 2017 వరకు దేశంలో చోటుచేసుకున్న ఘటనలను ప్రస్తావించారు. ఇవన్నీ ఒక్క రోజులో జరగలేదని, వీటి నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉందని వ్యాఖ్యానించారు. కాగా సలీం మాట్లాడుతున్నంత సేపూ బీజేపీ సభ్యులు ఆయన ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. కేరళలో ఏం ప్రయత్నాలు చేస్తున్నారంటూ బీజేపీ సభ్యులు అడ్డుతగిలారు. దీనిపై సలీం తనదైన శైలిలో స్పందించారు. కేరళలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్ని పక్షాలతో సమావేశం ఏర్పాటు చేశారని సభలో తెలిపారు. దీని నుంచి బీజేపీ నేర్చుకోవాలని హితవు పలికారు. పైగా డార్జిలింగ్‌లోనూ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినప్పుడు శాంతి స్థాపనకు ఒక్కడినే ఆ ప్రాంతాన్ని సందర్శించి అన్ని పక్షాలతో సమావేశం ఏర్పాటు చేశానని తెలిపారు. బెంగాల్‌లోనూ టీఎంసీ చేతిలో జాఫర్ ఖాన్, రవీంద్ర కుమార్ అనే పార్టీ కార్యకర్తలు హత్యలకు గురయ్యారని వివరించారు. జునైద్ హత్యకు సీటు గొడవ కారణమని బీజేపీ ఎంపీ అబద్ధం చెప్పారని సలీం విమర్శించారు. 'జునైద్ తల్లితో నేను మాట్లాడాను. అది సీటు కోసం జరిగిన గొడవ కాదు' అని స్పష్టం చేశారు. పైగా ప్రపంచంలో ఏ మూలన ఏ చిన్న ఘటన చోటుచేసుకున్నా స్పందిస్తున్న ప్రధానమంత్రి.. దేశంలో జరుగుతున్న ఘటనలపై మౌనం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. నాట్ ఇన్ మై నేమ్ ఆందోళన తరువాత మాత్రమే ప్రధాని ఈ ఘటనలపై స్పందించారని చెప్పారు.

టీడీపీ ఐటీ హబ్బులు తెస్తే, టీఆర్ఎస్ డ్రగ్స్ పబ్బులు తెరిచింది: రేవంత్

8తెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రానికి ఐటీ హబ్బులు తెస్తే, టీఆర్ఎస్ సర్కారు మాత్రం డ్రగ్స్ పబ్బులను తెరిచిందని టీడీపీ తెలంగాణ శాఖ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎ రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లోని లిబర్టీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి నాంపల్లి అబ్కారీ భవన్ దాకా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రేవంత్ పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను అంబేద్కర్ విగ్రహం వద్దే పోలీసులు అడ్డుకున్నారు. నేతలను అరెస్ట్ చేసి గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు ముఖ్యమంత్రి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులు, ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. టీడీపీ నాయకులను రోడ్డుమీద ఈడ్చి వేశారు. నగర నేత మేకల సారంగపాణి గొంతు పట్టుకుని పిసికారు. రేవంత్‌ను పోలీసులు చుట్టుముట్టి ఆనక అరెస్ట్ చేశారు. దీంతో కొద్దిసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్తత ఏర్పడింది. పోలీస్‌జులుం నశించాలి అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా రేవంత్ మాట్లాడుతూ టీఆర్ఎస్ పరిపాలనలో హైదరాబాద్ నగరం మాదకద్రవ్యాల వ్యాపారకేంద్రంగా మారిందని విమర్శించారు. తన మూడేండ్ల పాలనలో టీఆర్ఎస్ ప్రభుత్వం 57 పబ్బులకు అనుమతులు ఇచ్చిందని అన్నారు. ఫ్రెంచ్ డీజే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను చెల్లించిందన్నారు. వెంటనే ఆ నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. సంబంధీకులపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. డ్రగ్స్ వ్యాపారంలో సీఎం బంధువులే ఉన్నారని, వారిని అరెస్ట్ చేసి విచారించాలని కోరారు. తద్వారా సీఎం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. విచారణ అధికారి అకున్ సబర్వాల్‌పై ఒత్తిళ్లు తెస్తున్నది ఎవరో స్పష్టం చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్ర శేఖర్‌రెడ్డి, టీడీపీ అధికార ప్రతినిధులు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ బాబు, నేతలు సతీశ్‌మాదిగ, రవీందర్, ప్రసాద్, రంగరాజు, వినయ్, రాములు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చిలుక మ ధుసూదన్‌రెడ్డి, టీడీపీ నగర కోకన్వీనర్ మేకల సారంగపాణి పాల్గొన్నారు.

కార్పొరేట్ల గాలం

(మొదటిపేజీ తరువాయి)

జరిగితే వాటి కేటాయింపుల ప్రక్రియ ఉద్దేశ్యమే నీరుగారుతుందంటున్నారు. వాటికి ఉత్తేజం కల్పించేలా బ్యాంకింగ్ వ్యవస్థ రుణాలు కేటాయిస్తే పేరుకుపోయిన మొండిబకాయిలతో బ్యాంకింగ్ రంగమే కుదేలయ్యే ప్రమాదం పొంచిఉంది. ఈ క్రమంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ బ్యాంకింగ్ వ్యవస్థను కాపాడటం కన్నా బ్యాంకులను నిండా ముంచిన కార్పొరేట్ కంపెనీలకే వృద్ధి పేరిట ఊతం ఇచ్చేందుకు ఉరకలెత్తేలా వ్యవహరిస్తున్నదన్న చర్చ నడుస్తున్నది. బొగ్గు, స్పెక్ట్రం వేలం ద్వారా ప్రభుత్వా నికి ఈ మూడేండ్లలో రూ 3.82 లక్షల కోట్లు సమకూరినా వీటి ద్వారా దేశానికి, ఆర్థిక వ్యవస్థకు ఎంత మేర ప్రయోజనం చేకూరుతుం దన్నది ప్రశ్నార్థకమే అంటున్నారు. వేలంలో ఈ వనరులను సొంతం చేసుకున్న కంపెనీలు బొగ్గు గనులు, స్పెక్ట్రం వనరుల వృద్ధికి సరైన నిధులు వెచ్చించగలవా అనే సందేహాలు ముందుకొస్తున్నాయి. స్పెక్ట్రంను కోట్లాది రూపాయలు వెచ్చించి దక్కించుకున్న టెలికాం కంపెనీల విషయం లోనూ ఇవే అనుమానాలు బలపడుతున్నాయి.

11 కంపెనీలపై రుణభారం

వేలంలో 14 కోల్ బ్లాక్‌లను దక్కించుకున్న 11 కంపెనీలు తీవ్ర రుణ భారాన్ని ఎదుర్కొంటున్నాయి. మరి ఈ కంపెనీలు తాజాగా దక్కించుకున్న బొగ్గు గనుల అభివృద్ధికి నిధులు ఎలా సమీకరిస్తాయనేది చిక్కుముడిగా మారింది. వీటిలో మూడు కంపెనీలు ఇటీవల రుణ బకాయిలు రాబట్టేందుకు దివాళా చట్టాన్ని ప్రయోగించాలంటూ ఆర్‌బీఐ ప్రకటించిన 12 కంపెనీల జాబితాలో ఉండటం గమనార్హం. వేలం దక్కించుకున్న ఇతర కంపెనీలు సైతం ఇదే తరహా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయి. మరి ఈ సంస్థలను ఆర్థిక పరిస్థితిని బ్యాంకులు రుణాల మంజూరులో నిశితంగా పరిశీలించాల్సి ఉంది. ఇదే జరిగితే వేలంలో బొగ్గు బ్లాకులు, స్పెక్ట్రం దక్కించుకున్న కంపెనీల్లో 40 శాతం బిడ్డర్లకు ఆయా బ్లాక్‌ల అభివృద్ధికి రుణాలు దొరికే పరిస్థితి లేదు. ఈ రకంగా మొత్తం ప్రక్రియ సమయం, ఖర్చు వెచ్చించే వృథా ప్రయాసగానే మిగిలిపోతుంది.

టెలికాం రంగంలో8 అదే తీరు..

అధిక ధరలకు స్పెక్ట్రంను దక్కించుకున్న టెలికాం కంపెనీలు ఇప్పుడు వీటిని అభివృద్ధి చేసే పరిస్థితిలో లేవు. బ్యాంకింగ్ రంగం రూ 7లక్షల కోట్ల ఎన్‌పీఏలతో నీరుగారుతుంటే, టెలికాం రంగాన్నీ రూ 5 లక్షల కోట్ల రుణ భారం వేధిస్తున్నది. మూడేండ్లుగా అత్యధిక బిడ్‌లతో అదనపు స్పెక్ట్రంను దక్కించుకున్న కంపెనీలు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయి. దీంతో ఇప్పుడు టెలికాం కంపెనీలు రుణాలపై వడ్డీ భారం తగ్గించాలని, స్పెక్ట్రంపై రుణాలు మంజూరు చేయాలని, స్పెక్ట్రం చెల్లింపుల వ్యవధిని వాయిదా వేయాలని పలు డిమాండ్లు ముందుకు తెచ్చాయి. ఈ రాయితీలను ప్రభుత్వం ప్రకటించకుంటే స్పెక్ట్రంను దక్కించుకున్న కంపెనీలు అడుగు ముందుకు వేసే పరిస్థితి లేదు. రుణాల చెల్లింపులో విఫలమైన ఓ బడా టెలికాం కంపెనీ రాజకీయ ప్రాబల్యంతో రుణ దాతల నుంచి ఊరట పొందింది. దీంతో ఇతర డిఫాల్టర్లు సైతం ఇదే బాటన పయనిస్తున్నట్టు తెలిసింది. ఇదే జరిగితే ఇప్పటికే అప్పుల రికవరీ లేక అల్లాడుతున్న బ్యాంకులు మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

ఆర్‌బీఐకి స్వేచ్ఛ ఇవ్వాలి

బ్యాంకులను నిరర్థక ఆస్తుల ప్రమాదం నుంచి గట్టెక్కించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంటే ఆర్‌బీఐకి పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కార్పొరేట్ల నుంచి రుణాల రికవరీలో ఏ స్థాయిలోనూ జోక్యం చేసుకోకుండా అన్ని కంపెనీలనూ ఒకే తీరున చూడాల్సిన అవసరం ఉంది. ఎన్‌డీఏ హయాంలో, యూపీఏ హయాంలో రుణాలు పొందిన కంపెనీల పట్ల వివక్ష ప్రదర్శించడం సరైన పద్ధతి కాదు. ఈ తరహా వివక్ష పాటిస్తే ఎన్‌పీఏ సంక్షోభం పరిష్కరించడంలో ఎన్‌డీఏ సర్కార్ విశ్వసనీయతను దెబ్బతీయడంతో పాటు పారదర్శక పాలన ప్రశ్నార్థకమ వుతుం ది. ప్రస్తుత పరిస్థితుల్లో బ్యాంకింగ్ నియంత్రణ చట్టా న్ని పటిష్ట ంగా అమలుచేయడంతో పాటు ఆర్‌బీఐని తన బాధ్య తలు నిర్వర్తించేలా స్వేచ్ఛ ఇవ్వడం వరకే ప్రభుత్వం పరిమితమవా లి. పారిశ్రామికవేత్తల తరపున జోక్యం చేసుకోవడం హానికరం

-రచయిత ఈఏఎస్‌శర్మ, మాజీ భారత ప్రభుత్వ కార్యదర్శి

సెన్సెక్స్ ▲205	నిఫ్టీ ▲63	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
32,514	10,077	64.18	రూ. 29,197	రూ. 41,000





కోడిగుడ్లు			
హైదరాబాద్	320	విజయవాడ	320
ఒక్కగుడ్డుకు	3.80	చెన్నై	355
వరంగల్	322	ముంబయి	365



పొదుపు ఖాతాల వడ్డీలో కోత: ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) తాజాగా పొదుపు ఖాతాల డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేట్లకు కోత పెట్టింది. ప్రస్తుతం సేవింగ్ ఖాతాల్లోని మొత్తాలపై ఏడాదికి 4 శాతం వడ్డీ చెల్లిస్తోంది. తాజాగా దీనిని 0.5 శాతం (50 బేసిస్ పాయింట్లు) మేర కోత పెట్టింది. తగ్గించిన వడ్డీ రేటు సోమవారం నుంచే అమల్లోకి వచ్చిందని బ్యాంకు వెల్లడించింది. ఇటీవల వివిధ మెచ్యూరిటీ టర్మ్ డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేటును కూడా బ్యాంకు 50 బేసిస్ పాయింట్ల మేరకు తగ్గించిన సంగతి తెలిసిందే. తాజాగా సేవింగ్ ఖాతాలపై కూడా ఇదే నిర్ణయం తీసుకోవడంతో ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ. కోటి వరకు ఉన్న సేవింగ్స్ డిపాజిట్లపై గతంలో 4 శాతం వడ్డీ చెల్లిస్తుండగా తాజాగా దీన్ని 3.5 శాతానికి కోత పెట్టగా.. కోటి రూపాయలకు పైగా ఉంటే మాత్రం 4 శాతమే వడ్డీని అందించనుంది. ద్రవ్యోల్బణ రేటు తగ్గడం, ఇతర కారణాల వల్ల వడ్డీ రేట్లు తగ్గించాల్సి వచ్చిందని ఎస్‌బీఐ పేర్కొంది. ఆర్‌బీఐ సమీక్షకు ముందే ఎస్‌బీఐ తన ఖాతాదారుల వడ్డీరేట్లకు కోత పెట్టడం విశేషం.

జూన్‌లో పడిపోయిన కీలక రంగాల వృద్ధి



న్యూఢిల్లీ: జూన్ నెలలో బొగ్గు, చమురు శుద్ధి ఉత్పత్తులు, సిమెంట్ ఉత్పత్తి పడిపోవడంతో కీలక రంగాల వృద్ధిని 0.4 శాతానికి పడిపోయింది. మే నెలలో ఈ వృద్ధి 4.1 శాతంగా నమోదైంది. గతేడాది ఇదే సమయానికి కీలక రంగాల వృద్ధి 7 శాతంగా ఉంది. జూన్ నెలకు బొగ్గు మైనింగ్ 6.7శాతం, సిమెంట్ ఉత్పత్తి 5.8 శాతంతో పేలవమైన పదర్శనను కనబర్చినట్టు వాణిజ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం గడిచిన మూడు నెలల కాలంలో కీలక రంగాల్లోని బొగ్గు, ముడి చమురు, సహజవాయువు, రిఫైననీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ రంగాలు వరుసగా 2.4 శాతం వృద్ధి నమోదు చేశాయని సర్కారు గణాంకాలు వెల్లడిలంచాయి. జూన్ నెలలో విద్యుత్ రంగం 0.7శాతం పెరిగింది. ముడిచమురు ఉత్పత్తి 0.6 శాతం వృద్ధితో నిరసించింది.

ఇండిగోకు ఆకర్షణీయమైన లాభాలు



న్యూఢిల్లీ: విమానయాన కంపెనీ ఇండిగో మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబల్ ఏవియేషన్ జూన్ త్రైమాసికానికి ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. వేసవి సెలవుల కారణంగా ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో సంస్థ విమాన సర్వీసులకు ప్రయాణికుల నుంచి మెరుగైన బుకింగ్‌లు రావడంతో సంస్థ మేటి ఫలితాలను నమోదు చేయగలిగింది. జూన్ త్రైమాసికంలో సంస్థ లాభంలో 37% వృద్ధి కనిపించింది. అంతకు ముందు ఏడాది జూన్ త్రైమాసికంలో రూ.592 కోట్లుగా ఉన్న సంస్థ లాభం.. ఈ ఏడాది (మొదటి త్రైమాసికంలో) జూన్ నాటికి రూ.811 కోట్లుకు చేరుకుంది. ఇదే కాలంలో సంస్థ ప్రయాణికుల నుంచి వచ్చే ఆదాయపు రాబడి 27.9 శాతం మేర పెరిగి రూ.5,078 కోట్లకు చేరువవడం విశేషం.

మురిపించిన టెక్ మహీంద్రా ఫలితాలు

న్యూఢిల్లీ: ఐటీ సంస్థ టెక్ మహీంద్రా జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి ఆసక్తికరమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల కాలంలో సంస్థ లాభం 6.5 శాతం మేర పెరిగి రూ.749.3 కోట్ల నుంచి రూ.798.6 కోట్లకు చేరింది. ఇదే కాలంలో సంస్థ ఆదాయం దాదాపు 6 శాతం మేర పెరిగి రూ.6,921 కోట్ల నుంచి రూ.7,336.1 కోట్లను చేరుకుంది. అంతకు ముందు మార్చి త్రైమాసికంలో సంస్థ లాభం రూ.589.7 కోట్లుగాను.. ఆదాయం రూ.7,495 కోట్లుగాను ఉంది. సంస్థలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,15,980కి చేరిందని వివరించింది.

కుదరని ఫ్లిప్‌కార్ట్ - స్నాప్‘డీల్’



దేశంలోనే అతిపెద్ద ఈ-కామర్స్ విలీనంగా భావించిన ఫ్లిప్‌కార్ట్, స్నాప్‌డీల్ ఒప్పంద ప్రక్రియ అర్ధంతరంగా ముగిసింది. దాదాపు ఐదున్నర మాసాలుగా లెక్కలేనన్ని గంటల పాటు చర్చలు, అనేక బోర్డు సమావేశాల్లో జరిగినా ఫలితం లేకుండా పోయింది. చివరకు విలీన చర్చలకు తెర దించుతూ స్నాప్‌డీల్ సోమవారం ప్రకటన చేసింది. విక్రయంపై జరుగుతున్న చర్చలను ఇకమీదట పూర్తిగా నిలిపి వేస్తున్నట్లు ఆ కంపెనీ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. కాగా ఇక స్నాప్‌డీల్ స్వతంత్రంగానే వ్యాపార కార్యకలాపాలు చేపట్టనున్నట్లు స్పష్టం చేసింది. విలీనంపై జరుగుతున్న అన్ని వ్యూహాత్మక చర్చలను నిలిపివేశామని స్నాప్‌డీల్ అధికార ప్రతినిధి ఈ-మెయిల్ ద్వారా పేర్కొన్నారు. సంస్థకు చెందిన నిరర్థక ఆస్తుల అమ్మకం ద్వారా ఆర్థికంగా స్వీయ, స్థిరమైన లక్ష్యంతో కొనసాగనున్నట్లు తెలిపారు. స్నాప్‌డీల్‌కు చెందిన డిజిటల్ పేమెంట్ ప్లాట్‌ఫాం ఫ్రీఛార్జ్‌ను యాక్సిక్ బ్యాంక్ కొనుగోలు చేసిన రెండు, మూడు రోజుల్లోనే ఈ ఒప్పందానికి తెరపడటం గమనార్హం. ఫ్లిప్‌కార్ట్ సవరించి ప్రతిపాదించిన రూ.5,792 - రూ.6,114 కోట్లు ఆఫర్‌కు స్నాప్‌డీల్‌ను విక్రయించడానికి ఆ కంపెనీ మాతృసంస్థ జాస్పర్ ఇన్ఫోటెక్ బోర్డు అంగీకరించినట్లు కిందటి వారం వార్తలు వచ్చాయి. నిధుల కొరతతో కటకటలాడుతున్న స్నాప్‌డీల్‌ను కొనేందుకు ఫ్లిప్‌కార్ట్ ముందు 1 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.6450 కోట్లు) వరకూ ఇవ్వడానికి తొలుత సిద్ధపడింది. కాగా స్నాప్‌డీల్ విలువ మదింపు ప్రక్రియ అనంతరం 800-850 మిలియన్ డాలర్ల దాకా (సుమారు రూ. 5,500 కోట్లు) ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే స్నాప్‌డీల్ దీన్ని తిరస్కరించడంతో అనంతరం ఫ్లిప్‌కార్ట్ తన ఆఫర్ విలువను పెంచింది. దీంతో ఇరు సంస్థలు ఒక అంగీకారానికి వచ్చాయని సమాచారం. కాగా దీని అమోదానికి ఇరు కంపెనీల బోర్డులు సమావేశం కూడా కావాల్సి ఉంది. ఇంతలోనే ఈ ఒప్పంద ప్రక్రియను రద్దు చేసుకుంటున్నట్లు స్నాప్‌డీల్ ప్రకటించడం ఈ-కామర్స్ వర్గాల్లో చర్చకు దారి తీసింది.

83% ఉద్యోగాలకు కత్తెర..!

ఈ-కామర్స్ దిగ్గజం స్నాప్‌డీల్ తమ సిబ్బందిలో 83 శాతం మందిని తొలగించడానికి కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం తమ వ్యాపార, సాంకేతిక ఉన్నతాధి కార్లకు దీనిపై సూచనలు చేశారని తెలుస్తోంది. కొత్త బృందాల పునర్నిర్మాణానికి, ఉద్యోగుల తొలగింపు కోసం ప్రక్రియ మొదలు పెట్టాలని సూచించినట్లు సమాచారం. ఇదే జరిగితే ఆ సంస్థలో కేవలం 200 మంది ఉద్యోగులు మాత్రమే మిగులనున్నారు. స్నాప్‌డీల్ 2016 జూలైలో 9వేల మంది ఉద్యోగులతో వ్యాపారం నిర్వహించింది. ఈ మధ్య కాలంలో ఈ సంఖ్యను ఏకంగా 1200కు తగ్గించేసింది.

టూచ్..! విలీనం లేదు..

దేశీయ కార్పొరేట్ రంగంలో సోమవారం రెండు అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. భారత ఈ-కామర్స్ రంగంలో అతి పెద్ద విలీనంగా పూరిస్తూ వచ్చిన ఫ్లిప్‌కార్ట్-స్నాప్‌డీల్ విలీనానికి అర్థాంతరంగా చెక్ పడింది. దాదాపు అయిదు నెలల పాటు సుదీర్ఘ చర్చల అనంతరం కూడా ఇరు సంస్థలు విలీనం దిశగా ఏకాభిప్రాయానికి రాలేకపోయాయి. దీంతో స్నాప్‌డీల్ విలీనపు ఒప్పందం నుంచి వైదొలగాలని నిర్ణయించుకొంది. ఫలితంగా ఈ-కామర్స్ ప్రియులు కాస్త షాక్‌నకు గురయ్యారు. మరోవైపు మ్యాక్స్‌లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ సంస్థల విలీనం కూడా అనుకోకుండా మధ్యలోనే చెట్టెక్కింది. విలీనం దిశగా ఇప్పటి వరకు తాము జరిపిన చర్చలకు టూచ్ చెబుతూ ఒప్పందం నుంచి తాము వైదొలుగుతున్నట్టుగా మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సోమవారం ప్రకటించింది. దీంతో మదుపరులు ఉసూరు మన్నారు.

-నవతెలంగాణ, వాణిజ్య విభాగం

చెట్టెక్కిన మ్యాక్స్- హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ చర్చలు



దేశీయ బీమా రంగంలో అతిపెద్ద విలీనం దిశగా సాగిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. మ్యాక్స్‌లైఫ్-హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ సంస్థల మధ్య కొనసాగిన విలీనపు చర్చలకు సోమవారం తెరపడింది. విలీనానికి సంబంధించి హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ సంస్థతో తాము చేసుకున్న నిర్దిష్ట ఒప్పందాన్ని ఇకపై కొనసాగించడం లేదంటూ మ్యాక్స్‌లైఫ్ సంస్థ స్టాక్ మార్కెట్లకు వెల్లడించింది. వాస్తవానికి ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం సోమవారంతో అధికారికంగా ముగిసిపోనుంది. ఈ నేపథ్యంలో ఒప్పందాన్ని తాము ఇకపై ముందుకు తీసుకుపోకూడదని నిర్ణయించుకున్నట్టుగా మ్యాక్స్ స్టాక్ మార్కెట్లకు వెల్లడించడం విశేషం. మార్కెట్‌లో స్థిరీకరణ అవకాశాలు మెరుగైతే తాము ఇతర సంస్థలను కొనుగోలు చేసే అంశాన్ని తిరిగి పరిశీలిస్తామంటూ సంస్థ వెల్లడించింది. కాగా హెచ్‌డీఎఫ్‌సీ సంస్థ కూడా గత పక్షం రోజులుగా విలీనాన్ని పక్కదారి పట్టిస్తూ నిధుల సమీకరణకు గాను త్వరలోనే పబ్లిక్ ఇష్యూకు వెళ్లాలని నిర్ణయించినట్టుగా సంకేతాలిస్తూ వస్తోంది. గత నెల రోజులుగా ఇరు సంస్థలు విలీనం అనంతరం పలు ప్రత్యామ్నాయ నిర్మాణ అంశాలపై నిశితంగా చర్చలు జరిపారు. అయితే ఈ చర్చలో ఎలాంటి ఏకాభిప్రాయంతో కూడిన నిర్ణయాలు వెలువడకపోడంతో మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ ఒప్పందం నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్టుగా సమాచారం. మ్యాక్స్ ఇండియా సంస్థ విభజన వేళ 2016లో మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో మ్యాక్స్ గ్రూపు బీమా వ్యాపారంలోకి పెట్టుబడిదారులకు తగిన ప్రాతినిధ్యంతో పాటు వాటాదారుల విలువను అన్‌లాక్ చేసే ఉద్దేశంతో మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఎంఎఫ్ఎస్) ఏర్పాటు చేయడం జరిగిన సంగతి విదితమే. జీవిత బీమా విభాగంలో ఎంఎఫ్ఎస్ సంస్థకు తిరుగులేని అధిపత్యం ఉంది. ఈ అంశమే హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ విలీనానికి దారులు తెరిచింది. ఇప్పుడు విలీనం చర్చలు అర్థాంతరంగా ముగిసిపోవడంతో మ్యాక్స్‌వెల్ సంస్థ సొంతగానే మార్కెట్లో సత్తా చాటుకోవాలని చూస్తోంది. విస్తరణ భాగంగా ఏజేన్సీ, డిజిటల్ వ్యవస్థలను మరింతగా పటిష్టం చేసుకోవడంతో పాటు కొత్త డిస్ట్రిబ్యూషన్ నిమిత్తం ఇతర సంస్థలతో జట్టుకట్టే అంశాలను కూడా పరిశీలించాలని యోచిస్తోంది. కాగా.. మరోవైపు ఈ ఒప్పందాన్ని తిరిగి పట్టాలెక్కించే ప్రయత్నాలూ కొనసాగుతున్నట్టుగా సమాచారం.

సరికొత్త శిఖరాలకు స్టాక్ మార్కెట్లు

- ఎస్‌బీఐ, ఎల్‌అండ్‌టీ, ఆర్‌బీఐ అంచనాల దన్నుతో లాభాల్లోకి..
- 32,514 పాయింట్లకు చేరిన సెన్సెక్స్
- 10,100కు చేరువలో ఎన్ఎస్ఈ నిఫ్టీ



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం సరికొత్త శిఖరాలకు చేరుకున్నాయి. దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ), ఎల్ అండ్ టీ స్టాక్స్ దన్నుతో సూచీలు సరికొత్త రికార్డులను తాకాయి. దీనికి తోడు భారతీయ రిజర్వు బ్యాంకు త్వరలో నిర్వహించనున్న పరపతి విధాన సమీక్షలో కేంద్ర బ్యాంకు వడ్డీరేట్లను తగ్గించనుందన్న వార్తలు కూడా మార్కెట్లకు కొత్త జోష్‌నిచ్చాయి. సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను తగ్గిస్తూ ఎస్‌బీఐ నిర్ణయం తీసుకోవడంతో ఉదయం నుంచే మార్కెట్లు లాభాల బాట పట్టాయి. ఆ తరువాత ఏ దశలోనూ సూచీలు నష్టాల్లోకి జార కుండా చివరి వరకు తమ జోష్‌ను కొనసాగించాయి. మార్కెట్లు ముగిసే సమయానికి ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 62.5 పాయింట్ల మేర పెరిగి 10,077 పాయింట్ల వద్ద ముగిసింది. మరోవైపు బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ 205 పాయింట్ల మేర పెరిగి 32,514 పాయింట్ల వద్ద స్థిరపడింది. రంగాల వారీగా బీఎస్ఈలో మన్నికైన వినియోగదారుల వస్తువుల సూచీ మెరుగైన పనితీరును కనబరిచి 1.86% మేర పెరిగింది. మరోవైపు లోహ సూచీ 1.69%, పీఎస్‌యూ సూచీ 1.66 శాతం, యంత్రపరికరాల సూచీ 1.4 శాతం మేర పెరిగాయి. మరోవైపు ఆరోగ్యపరిరక్షణ సూచీ 1.52 శాతం, ఎఫ్ఎంసీజీ సూచీ 0.99 శాతం మేర కుంగాయి. సెన్సెక్స్‌లో అత్యధికంగా లాభపడిన సూచీల్లో ఎస్‌బీఐ (+4.46%), పవర్‌గ్రిడ్ (+4.23%), టాటా స్టీల్ (+2.89%), ఎల్ అండ్ టీ (+2.85%), ఓఎన్‌జీసీ (+2.82%) ఉన్నాయి. బాగా నష్టపోయిన స్టాక్స్ జాబితాల్లో సన్‌ఫార్మా (-3.47%), డాక్టర్ రెడ్డీస్ (-3.11%), లూపిన్ (-2.90%), ఐటీసీ (-2.09%), సిప్లా (-1.18%) ఉన్నాయి. అంతర్జాతీయంగా చూస్తే చైనా మెరుగైన ఆర్థిక స్థితిని కనబరుస్తూ వెల్లడించిన గణాంకాలతో ఆసియా మార్కెట్లు లాభాల్లోకి మరలాయి. ఈ పరిణామాలు కూడా దేశీయ స్టాక్ మార్కెట్లపై అనుకూల ప్రభావాన్నికనబరిచాయి.

సేంద్రీయ ఉత్పాదనల్లోకి ఐఐఎల్



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: ప్రముఖ వ్యవసాయ క్రిమిసంహారక మందులను విక్రయించే ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వ్యాపారంలో 20 శాతం వృద్ధి అంచనా వేస్తున్నట్లు తెలిపింది. ఇదే సమయంలో దహేజాలోని తమ గ్రీన్‌ఫీల్డ్ ప్లాంట్ విస్తరణకు రూ.30 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించింది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ అగర్వాల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లోకి భూమి సారాన్ని పెంచే 'కాయకల్ప్' సేంద్రియ ఉత్పాదనను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాయకల్ప్ ఆవిష్కరణతో సేంద్రీయ ఉత్పాదనల్లోకి ఐఐఎల్ అడుగుపెట్టినట్టయ్యిందని తెలిపారు. మొక్కల ఆరోగ్యం, ఉత్పాదకత మెరుగుపరిచేందుకు వీలుగా ఇది నేల ఆరోగ్యాన్ని సేంద్రీయంగా పునరుత్తేజం కల్పిస్తుందన్నారు. ప్రస్తుతం దహేజా ప్లాంట్ 10వేల టన్నుల సామర్థ్యం కలిగి ఉందని, ఇందులో 65 శాతాన్ని ఉపయోగించుకుంటున్నామన్నారు. 2020 నాటికి రుణ రహిత కంపెనీగా మారాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర వ్యాపారంలో 15-20 శాతం వృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గతేడాది 10 శాతం వృద్ధి సాధించామన్నారు. కాగా పరిశ్రమ 3-4 శాతం పెరిగిందన్నారు. తమ కంపెనీ రూ.1100 కోట్ల టర్నోవర్ సాధించిందన్నారు. టీఎస్, ఏపీ మార్కెట్లో కంపెనీ అమ్మకాలు రూ.190 కోట్లకు చేరాయన్నారు. ప్రస్తుత ఏడాదిలో 215 కోట్లు అంచనా వేస్తున్నామన్నారు. ప్రస్తుతం రూ.200 కోట్ల అప్పులున్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బయోలాజికల్, ఆర్గానిక్ విభాగాల్లో కొత్తగా ఐదు ఉత్పత్తులను ఆవిష్కరించనున్నామన్నారు.

‘కస్తూర్బా’లో విద్యార్థిని ఆత్మహత్య

- ఎస్ఓ సస్పెన్షన్..
- 3లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

నవతెలంగాణ-మర్పల్లి

కస్తూర్బా పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ బాలిక ఆదివారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా ఉరేసుకొని మృతి చెందింది. ఈఘటన వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో సోమవారం వెలుగు చూసింది. కోట్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన హారిక (14) బాలిక మర్పల్లిలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో మూడేండ్లుగా చదువుకుంటోంది. ఆదివారం రాత్రి పాఠశాల ఆవరణలోని బాదం చెట్టుకు చున్నితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఉదయం తోటి విద్యార్థులు చూసి సిబ్బందికి తెలిపారు. హారిక తల్లి చిన్నతనంలోనే చనిపోవడంతో అమ్మమ్మ, చిన్నమ్మల సంరక్షణలో పెరుగింది. హారిక మృతి వార్త తెలుసుకున్న బంధువులు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు ఆశ్రమ పాఠశాలకు వెళ్లి ఆందోళనకు దిగారు. ఎస్ఓ, వాచ్‌మెన్ల నిర్లక్ష్యం కారణంగానే హారిక మృతి చెందిందని, ఇద్దరినీ వెంటనే సస్పెండ్ చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే సంజీవరావు, వికారాబాద్ జేసీ సురేష్‌పోద్దార్, ఎంపీపీ సుమిత్రమ్మ, టీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొండల్‌రెడ్డి, జడ్పీటీసీ శోభారాణి, పీఏసీఎస్ చైర్మెన్లు ప్రభాకర్ గుప్త, లక్ష్మారెడ్డి, ఎస్ఐ విఠల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీహరి ఎస్ఓను సస్పెండ్ చేశారు. కేజీబీవీ సంస్థ తరపున రూ.2లక్షలు, కలెక్టర్ తరపున రూ.లక్ష మొత్తం రూ.3లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అనాథగా మిగిలిన మృతురాలు తమ్ముడిని చదివించేందుకు ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని వారు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ విఠల్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈఎస్‌వోపీ ప్రోత్సాహకం కట్..?

(మొదటి పేజీ తరువాయి)

లేఖలు రాసింది. లేఖలు అందుకున్నవారిలో ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా,బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులున్నారు. ఈ నిబంధనలను 2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేయాలని కేంద్రం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. మొత్తం 21 ప్రభుత్వరంగ బ్యాంకులుండగా, రెండు మినహా నిర్దేశించిన మేరకు ప్రగతి సాధించలేదని తెలుస్తోంది. ఎస్‌బీఐ నికర ఆస్తులు 65.95 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా నికర ఆస్తులు 66.83 శాతం ఉన్నాయి. మిగతా బ్యాంకుల నిరర్థక ఆస్తులు 35 శాతానికన్నా అధికంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రతిపాదిత నిబంధనలను అమలులోకి తెస్తే.. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పని చేసే 8 లక్షలమంది ఉద్యోగులపై ప్రభావం చూపనున్నట్టు బ్యాంకింగ్‌రంగ నిపుణులు చెబుతున్నారు. స్కేల్-4తోపాటు ఆపైస్థాయి బ్యాంక్ ఉద్యోగులకు ఏటా ఈఎస్‌వోపీ ప్రోత్సాహకాన్ని ఇస్తున్నారు. ఈఎస్‌వోపీ పరిధిలోకి స్కేల్-3 ఉద్యోగులనూ తేవాలన్న ప్రతిపాదన ఉన్నది. ఈఎస్‌వోపీ పరిధిలోని ఉద్యోగులకు స్టాక్ షేర్ల ద్వారా వచ్చే లాభాలను పంచుతారు.

నేటి నుంచి రీడింగ్ షురూ..

మూడు కమిషనరేట్ల పరిధిలో 12 పాయింట్లు అమలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మూడు కమిషనరేట్ల పరిధిలో మంగళ వారం నుంచి పాయింట్ల రీడింగ్ షురూ కానుంది. వాహనదారులు జాగ్రత్తగా వ్యహరించకుంటే ప్రతి ఉల్లంఘనల పాయింట్లు ఖాతాల్లో జమ కానున్నాయి. ఆధార్ లింక్‌తో అన్ని వివరాలు అప్‌లోడ్ చేస్తారు. గ్రేటర్‌లో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పెనాల్టీ పాయింట్ల విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఈ విధానం హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలో నేటి నుంచి అమల్లోకి రానుంది. ట్రాఫిక్ పోలీసులు ప్రత్యక్షంగా తనిఖీ చేసిన అనంతరం ప్రతి ఉల్లంఘనకు 1నుంచి 5 పాయింట్స్ వరకూ కేటాయిస్తారు. వారి వద్ద ఉన్న డిజిటల్ పరిక రాల్లో ఉల్లంఘనలను నమోదు చేయడంతో సాఫ్ట్‌వేర్‌లో ఆటోమేటిక్‌గా పాయింట్స్ అప్‌డేట్ అవుతుంటాయి. 12 పాయింట్లు 24 నెలలపాటు వెసులు బాటు కల్పించారు. రాంగ్‌రూట్, హెల్మెట్ లేకుండా తదితర ఉల్లంఘనలకు చలాన విధిస్తారు. దాంతోపాటే పాయింట్లు వేస్తారు. అక్కడికక్కడే వాహనాన్ని సీజ్ చేస్తారు. చలాన్లు చెల్లించిన అనంతరం వాహనం తిరిగిస్తారు. అయితే నిర్దేశించిన 12 పాయిం ట్స్ పూర్తయితే రవాణాశాఖ అధికారులు డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేస్తారు. ఇదిలా ఉండగా ఒక్కసారి లైసెన్స్ సస్పెండ్ అయిన వ్యక్తి తిరిగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనచోదకుడిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు వేస్తారు.

పాయింట్స్ పడకుండా చూసుకోవాలి: జాయింట్ కమిషనర్, ట్రాఫిక్ బాస్ డాక్టర్ రవీందర్.

నిబంధనలు ఉల్లంఘించే వారికి పెనాల్టీ పాయింట్ల విధానాన్ని ఖచ్చితంగా అమలు చేస్తాం. పాయింట్స్‌తోపాటు చలాన్లు సైతం చెల్లించాల్సి ఉంటుంది. పాయింట్ల విధానం వల్ల ప్రతి వాహనదారుడికి భద్రతతో పాటు నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుముఖం పడతామని చెప్పవచ్చు. వాహనదారులు క్రమశిక్షణను అలవర్చుకొని, నిబంధనలను పాటించడాన్ని అలవాటు చేసుకోవాలి. 12 పాయింట్లు పూర్తయితే కోర్టులో ఛార్జ్‌షీట్ వేస్తాం. దాంతో వాహనదారులకు మూడు నెలలపాటు జైలు శిక్షలు పడే అవకాశముంది. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి. పాయింట్స్ పడకుండా చూసుకోవాలి.

ఇదీ పాయింట్ల పట్టిక

- ఆటోలో సామర్థ్యం కంటే అదనంగా ప్రయాణికుల్ని ఎక్కిస్తే: 1
- సీట్ బెల్ట్ పెట్టకుండా కారు నడిపితే, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపితే: 1
- గూడ్స్ వాహనాల్లో ప్రయాణికుల్ని తీసుకెళ్లే : 2
- రాంగ్ రూట్‌లో వాహనం నడిపితే: 2
- సెల్‌ఫోన్ డ్రైవింగ్ /సిగ్నల్ జంపింగ్ చేస్తే/స్టాప్ లైన్ క్రాస్ చేస్తే/ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తే: 2
- జాతీయ రహదారుల్లో రోడ్డు భద్రత నిబంధనలకు విరుద్ధంగా వాహనాన్ని నిలిపితే: 2
- బీమా పత్రాలు లేకుండా వాహనం నడిపితే: 2
- ప్రమాదకర వస్తువుల్ని రవాణా చేసే వాహనాలకు పబ్లిక్ లయబిలిటీ సర్టిఫికెట్ లేకపోతే: 2
- వాహనదారుల ఐపీసీ (279/336/337/338) సెక్షన్లను ఉల్లంఘిస్తే: 2
- నిర్దేశిత వేగాన్ని మించుతూ, 40 కి.మీ. లోపు వేగంతో వాహనం నడిపితే: 2
- రేసింగ్‌కు పాల్పడితే: 3
- నిర్దేశిత వేగాన్ని మించుతూ, 40 కి.మీ.ల కంటే అదనపు వేగంతో వాహనం నడిపితే: 3
- మద్యం సేవించి ద్విచక్రవాహనం నడిపితే: 3
- మద్యం తాగి నాలుగు చక్రాల వాహనం నడిపితే: 4
- మద్యం తాగి బస్సు/క్యాబ్/ఆటో నడిపితే: 5
- ఐపీసీ 304(ఎ), 304(2)ని ఉల్లంఘిస్తే(ఎదుటి వ్యక్తి మరణించేందుకు కారకులైతే): 5
- వాహనంపై వెళ్తూ గొలుసుచోరీ/దోపిడీకి పాల్పడితే: 5

మిగులు విద్యుత్‌పై ముందడుగు

దక్షిణాది రాష్ట్రాల మధ్య సర్దుబాటుకు అంగీకారం

- విధివిధానాలకు ఉన్నతస్థాయి కమిటీ
- ఎస్ఆర్‌పీసీ సమావేశంలో నిర్ణయం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కడ మిగులు, లోటు విద్యుత్ ఉన్నా, సర్దుబాటు చేసుకొనే విధంగా విధివిధానాలకు ఖరారు చేయాలని దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ కమిటీ (ఎస్ఆర్‌పీసీ) నిర్ణయించింది. ఈ విధానం దేశంలోని విద్యుత్‌రంగానికి మార్గదర్శకంగా ఉండాలని, దక్షిణాది రాష్ట్రాల మధ్య విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ విషయాల్లో పరస్పర సహకారాన్ని అందిపుచ్చుకోవాలని తీర్మానించారు. ఎస్ఆర్‌పీసీ సమావేశం సోమవారంనాడు తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు అధ్యక్షతన విద్యుత్‌సౌధలో జరిగింది. సభ్య కార్యదర్శి ఎస్ఆర్ భట్, కర్నాటక ట్రాన్స్‌కో మేనేజింగ్ డైరెక్టర్ జావెద్ అక్తర్, ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌కో డైరెక్టర్ నాగరాజు స్వామి, కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డు సీఎమ్‌డీ డాక్టర్ కె ఎలంగోవన్, తమిళనాడు ట్రాన్స్‌కో ఎమ్‌డీ ఎస్ షణ్ముగం, సదరన్ రీజియన్ లోడ్ డిస్పాచ్ సెంటర్ జనరల్ మేనేజర్ అంబునెసన్, తెలంగాణ రాష్ట్ర ఇరు డిస్కంల సీఎమ్‌డీలు జి రఘుమారెడ్డి, ఎస్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య విద్యుత్ పంపిణీ కోసం చేసుకోవాల్సిన ఒప్పంద అవసరాలు, దానివల్ల కలిగే ప్రయోజనాలపై ఈ సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు దాన్ని అమ్మాలన్నా, కొనాలన్నా పవర్ ఎక్స్ఛేంజ్ ద్వారానే లావాదేవీలు నడపాల్సి ఉంటుందని, దీనికై ఒకరోజు ముందుగా సమాచారాన్ని ఇవ్వాల్సి ఉంటుందని ఎస్ఆర్‌పీసీ అధ్యక్షులు ప్రభాకరరావు వివరించారు. విద్యుత్ డిమాండ్ అంచానాలు తారుమారైనప్పుడు అనేక ఇబ్బందులు ఏర్పడుతున్న అంశాన్ని ఆయన ప్రస్తావించారు.



అంచనాలు తగ్గితే ఆయా రాష్ట్రాలు విద్యుత్‌ప్లాంట్లను బ్యాకింగ్‌డౌన్ చేయాల్సి వస్తున్నదని, దీనివల్ల ఫిక్సెడ్ ఛార్జీల భారం తిరిగి విద్యుత్ సంస్థలపైనే పడుతున్న విషయాన్ని వివరించారు. దీనికి భిన్నంగా దక్షిణాది రాష్ట్రాలు ఇకపై పరస్పర ఒప్పందాలకు వస్తే...ఎక్కడ మిగులు, లోటు విద్యుత్ ఉన్నా దక్షిణాది లోడ్ డిస్పాచింగ్ సెంటర్ (ఎస్ఆర్ఎల్‌డిసి)కు సమాచారం ఇస్తే...మిగులు రాష్ట్రం లోటు రాష్ట్రానికి తక్షణం విద్యుత్ సరఫరా చేసుకొనే విధంగా ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. దీనివల్ల అమ్మే, కొనుగోలు చేసే రెండు రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. ఈ ప్రతిపాదనకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. అయితే దీనికి సంబంధించిన విద్యుత్‌కొనుగోలు ఒప్పందాలు ఎలా ఉండాలి... విధివిధానాలు ఏంటనే అంశలను ఖరారు చేసేందుకు ఎస్ఆర్ భట్ నేతృత్వంలో ఓ కమిటీని నియమించాలని నిర్ణయించారు. ప్రాథమిక ముసాయిదాకు ఎస్ఆర్‌పీసీలోని సభ్యరాష్ట్రాలన్నీ ఆమోదం తెలిపాయి. ఆగస్టు 20న కేరళలో జరిగే ఎస్ఆర్‌పీసీ సమావేశంలో తుది ముసాయిదాపై చర్చించి, నిర్ణయం తీసుకోవాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు.

తెలంగాణ చొరవ భేష్ - ఎస్ఆర్ భట్

ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య వార్ధాలైన్ నిర్మించడానికి తెలంగాణ రాష్ట్రం చూపిన చొరవతో దక్షిణాది రాష్ట్రాలకు ఎంతో మేలు జరిగిందని ఎస్ఆర్‌పీసీ సభ్య కార్యదర్శి ఎస్ఆర్ భట్ అన్నారు. దీనివల్ల దేశంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా విద్యుత్‌ను అందిపుచ్చుకోవడం సాధ్యమౌతుందన్నారు. కేవలం మూడేండ్ల వ్యవధిలో తెలంగాణ రాష్ట్రం కరెంటు కష్టాలనుంచి గట్టెక్కి వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ అందించడం అసాధారణ విషయమని అభిప్రాయపడ్డారు.





మందెచ్చులవారు జానపద వృత్తిగాయకులు. యాదవకుల హక్కుదారులు.వీరిలో ప్రతి బృందం నాయకునికీ హక్కును చూపించే తామ్రపత్రం (రాగిరేకు శాసనం) ఉంటుంది. వీరు మనకు వివరించే విషయాన్ని బట్టి లేదా వీరి దగ్గర ఉన్న తామ్ర పత్రాన్ని బట్టి మొదట్లో వీరు హక్కుదార్లని, కాలక్రమేణా ఆశ్రితులని తెలుస్తున్నది. వీరు జానపద సంస్కృతికి చేస్తున్న సేవ గురించిన ప్రత్యేక వ్యాసం ఇది.

మందెచ్చుల జీవనగానం

మందెచ్చులవారు ప్రతి రెండు లేదా మూడేండ్లకొకమారు హక్కుగల గ్రామంలోని యాదవుల ఇండ్లదగ్గరకు పోతారు. అక్కడ యాదవుల కోరిక మేరకు కథలు చెప్పి, బుట్టబొమ్మల ప్రదర్శన ఇస్తారు. ప్రతిఫలంగా గొర్లమంద గల యాదవుల నుండి లేగదూడను తీసుకుంటారు. కులపెద్ద నుండి 'పొగసత్రం' (తాత్కాలిక నివాసం) పొందుతారు. పాలేరుతనమున్న యాదవుని నుండి ఏడాదిలో ఒక నెల జీతం, యాదవ కుటుంబంలో పిల్లలు పుడితే పురుడు కట్నం, పెరిగితే పెండ్లి కట్నం, చస్తే చావుకట్నం వంటివి హక్కుగా పొందుతారు. ప్రతి యాదవ కుటుంబం నుండి యాదవకుల పెద్దలు నిర్ణయించిన మొత్తాన్ని పొందుతారు. దీనిని బట్టి మందెచ్చులవారు మనకు ఆశ్రితులుగా కనబడతారు. యాదవులు వీరిని అడ్డివారిగా భావిస్తారు. అయితే మందెచ్చులవారు మాత్రం తాము యాదవ కుల హక్కుదార్లుగా ప్రకటించుకుంటారు. వీరు కేవలం యాదవ లేక గొల్లవారి దగ్గరకు వెళ్లి నిర్ణయించిన మొత్తాన్ని వసూలుచేసుకుంటూ; యాదవుల మేకలు, గొర్రెల మందలపై 'బలి' చల్లుతారు. ఇట్లా చేస్తే ఈ మందలు వృద్ధి పొందుతాయనేది వారి నమ్మకం.

మందెచ్చులవారు తెలంగాణలోని పాత వరంగల్, కరీంనగర్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నివసిస్తున్నారు. అట్లాగే వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో వ్యవహరించ బడుతున్నారు. మంద అంటే గొర్రెలు, మేకలు, ఆవుల మంద అనీ, హెచ్చు అంటే వృద్ధికావడమని అర్థం. సామాన్యార్థంలో వీరిని మందెచ్చుల అని వ్యవహరిస్తారు.

గ్రామాలకు పోయి...

మందెచ్చులవారు తమకు హక్కు గల గ్రామాలకు పోయి కుల పెద్ద ఇంట్లో బుట్టబొమ్మలు దించుతారు. గుడారాలు వేసుకొని, లేదా యాదవులు ఇచ్చిన తాత్కాలిక ఇండ్లలో ఉంటారు.తాము గ్రామానికి వచ్చినట్లు తెలియచేస్తూ 'నపీర' అనే వాయిద్య పరికరాన్ని ఊదుతారు. మరుసటి రోజున కుల పెద్ద అంగీకారం మేరకు యాదవులు కోరుకున్న కథను వీరు చెబుతారు. యాదవ కులం కోసం చెప్పే మొదటి కథ కాబట్టి దాన్ని 'కులకథ' అంటారు. కులకథను చెప్పిన తరువాతనే 'పొలికథ' చెబుతారు. అంటే బలి చల్లే ముందు చెప్పే కథన్నమాట. తరువాత రోజుల్లో బుట్టబొమ్మల ప్రదర్శన కాని, కథలు చెప్పడం కాని చేస్తారు.

డోలువాయిద్య సహకారంతో కథలు చెబుతారు. ఈ డోలును 'రడవీర' అంటారు. ఈ కథలకు వాయిద్య సహకారం అందించేవారు కూడా మందెచ్చులవారే ఉంటారు. ప్రధాన కథకుడు ఒకరు, సహ కథకులు ఇద్దరు, వంతలు లేక వాయిద్య సహకారం అందించేవారు నలుగురు ఉంటారు. మొత్తం మీద ఎనిమిది నుండి పదిమంది వరకు కథను చెబుతారు. మందెచ్చులు చెప్పే కథల్లో ముఖ్యమైనవి పెద్దిరాజు కథ, కరియావుల గంగురాజు కథ, కాటమరాజు కథ, ఎర్రన్న కథ, పోలురాజు కథ, ఎలనూకరాజు కథ, నలనూకరాజు కథ, ఆడబిడ్డ కొంరవ్వ కథ, పాపమ్మ కథ, కాంభోజరాజు కథ, కనకతారావథ, బొల్లావు కథ వంటి వాటిని మొత్తం ఏడు రోజులు చెబుతారు. నెల్లూరు యుద్ధం కథను 15 రోజులు; వలరాజు కథ, నలరాజు కథ, నలముక్కురాజు కథ, సిరిపెరంబుర్ కథ, ఎండిరాజు బంగారాజు కథ, సన్యాసమ్మ కథ, శివమల్లికాదేవి వంటి కథలను మూడు రోజులు చెబుతారు. ఇక అంజమ్మ కథ, అమ్రసింగుమరాజు కథ, ధనసూర మారాజు కథ, కంసమర్ధన కథ, ఎరగడ్డపాడు కథ, రక్తకుమారసామి కథ, చిలుక కథ, ఏనుగు మల్లయ్య కథ, అయిదు మల్లెపూల కథలను ఒక్క రోజు చెబుతారు. వీటితోపాటు యమంద్రిక కథ, ప్రొసేనమారాజు కథ, ఎల్లమ్మ కథ, సిందేవి కథ, మాండోదరి కథ, బలిచక్రవర్తి కథ, నలచక్రవర్తి కథ, సువర్ణ సుందరి కథ, సారంగధరుని కథ, బస్వన్న కథ, మాందాత కథ, వలరాస మల్లయ్య కథ, సత్యహరిశ్చంద్రమా రాజు కథ, సిరిదొండ మారాజు కథ, దొనకొండ గంగ కథ వంటి అనేక కథలను కూడా వీరు చెబుతారు. కథ చెప్పడానికి ముందు గంగాదేవిని

"శరణు శరణు మా కన్నా తల్లి శంభావరాణి, శంభావరాణి
శరణు జూడు మా కన్నా తల్లీ, గంగాభవాని, దేవీ భవాని"

అంటూ శరణు వేడిన తరువాత ఆది గణపతిని తలుస్తారు. కథ చెప్పేటప్పుడు మధ్య మధ్య అనేక సామెతలు, పొడుపు కథలు, హాస్య కథలను చెబుతూ ప్రేక్షకులను నవ్విస్తూ, సందేశాన్ని కూడా ఇస్తుంటారు.

వీరు రడవీర, జగ్గు చిన్నతాళాలు, పెద్ద తాళాలు, నపీర, కాళ్ల గజ్జెలు వంటి వాయిద్య పరికరాలతో కథ చెబుతారు. కథ చెప్పడానికి ముందు; మధ్య మధ్యలోనూ నపీర ఊదుతారు. కొన్ని చోట్ల కథా ప్రదర్శనలో చిరుతలను కూడా ఉపయోగిస్తారు. మందెచ్చులవారు చెప్పే కథల్లో స్త్రీ వేషధారణను పురుషులే ధరించి కథాగానంలో పాల్గొంటారు. అయితే కొన్ని చోట్ల ఇట్లా ఉండదు. స్త్రీ వేషధారి చేతిలో జేబు రుమాలు, పురుషవేషధారి చేతిలో అనుసుల కట్టె (రాగి, ఇత్తడి, వెండి అనుసులు కంచరితో 'బూతంకూస', లేదా 'జట్టిరేగు' చెట్టు నుండి తెచ్చిన కర్రకు కొట్టిస్తారు) కనిపిస్తుంది. సహాయ కథకులు, వాద్యసహాయకులు, వంతలు తమకున్న దుస్తులనే ధరించి కథాప్రదర్శనలో పాల్గొంటారు.

యాదవుల పెద్ద ఇంటిదగ్గర కాని, కథ చెప్పించే యాదవ గృహస్థు ఇంటిదగ్గర కాని, లేక నాలుగు రోడ్ల కూడలిలో కాని కథ చెబుతారు. వీరు చెప్పే కథల్లో వస్తువు యాదవుల ఘన చరిత్రను చాటేదై ఉంటుంది. యాదవులు పశువుల కోసం, రాజ్యాల కోసం చేసిన యుద్ధాలు, చరిత్రకు సంబంధించిన ఇతివృత్తాలు గల కథలు నేర్చుకొని చెబుతుంటారు.

పొలికథ

మందెచ్చులవారు కుల కథ చెప్పిన తరువాత యాదవులు తమ మంద దగ్గర వీరి చేత గొర్రెను 'గావు' పట్టించి బలి చల్లించు కుంటారు. వారిని తమ మందల దగ్గరికి తీసుకుపోయి ఉదయం పూట మందల చుట్టూ యాదవ కులదేవతల బొమ్మలు పెట్టించి పొలికథను చెప్పిస్తారు. పొలికథగా కాటమరాజు కథను గాని లేక గంగాదేవి కథను కాని చెబుతారు. తరువాత మందెచ్చుల్లో ఒకరు గొర్రె గొంతును కొరుకుతూ మంద చుట్టూ తిరుగుతూ రక్తాన్ని పడతారు. ఆ రక్తంలో గడుక, పసుపు, సల్లవాయిలి, అడవి నిమ్మ, ఆకాశం మీది మొలక, పన్నెండు నిమ్మకాయలు, పన్నెండు గుమ్మడికాయలు, ఒక చెట్టు ఈతకల్లు మొత్తంగా కలిపి; గొసత్తి, గుండ్ల సత్తి, ఎరుకు సత్తి, దెయ్యం, పిశాచి, కామిని వంటివి ఏమీ ఆశించకుండా చేను, చులుక, గొడ్డు గోద, గొర్రె, మేక, ఇల్లు మీద బలి చల్లుకుంటారు. ఇట్లా గావు పట్టి బలి చల్లినందుకు వీరు ఒక మందకు నాలుగు నుండి ఎనిమిది వందల రూపాయలతోపాటు ఒక గొర్రెను లేక మేకను కట్నంగా తీసుకుంటారు.



బుట్టబొమ్మల ప్రదర్శన

మందెచ్చులవారు కథలు చెప్పడం, బలి చల్లడమే కాకుండా యాదవుల ఇండ్లలో ఎవరైనా చనిపోతే ఇంటిపెద్ద అంగీకారంతో బుట్టబొమ్మ ప్రదర్శన ఇచ్చి, చనిపోయిన వారిని స్మరిస్తూ స్తుతిస్తారు. వెదురు బొంగులను చీల్చి అల్లిన బుట్టల్లో ఈ బొమ్మలను ఉంచుతారు కాబట్టి వీటిని బుట్టబొమ్మలంటారు. నకాషివారు తయారుచేసిన బొమ్మలను వీరు కొనుక్కొచ్చి బుట్టల్లో భద్రపరుచుకుంటారు. ఈ బుట్ట బొమ్మల ప్రదర్శన ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం పన్నెండు గంటలకు ముగుస్తుంది. ఈ ప్రదర్శన ప్రారంభానికి ముందు... ఇంటిముందు వాకిలిలో చాపలు, గొంగళ్లు పరచి కొంచెం వెనుకవైపున పీటలు వేసుకుని కూర్చుని, మందెచ్చుల నాయకుడు ఒక్కో బొమ్మను పట్టుకొని ఎగిరిస్తూ, పాట పాడుతూ ఆ బొమ్మకు సంబంధించిన సంక్షిప్త కథను చెప్పి, ఆ బొమ్మను పరిచిన గొంగడి, చాపల మీద పెడతాడు. ఈ ప్రదర్శనలో కాటమ రాజు, పెద్దిరాజు పోలురాజు, గంగురాజు, పెద్దమదేవి, ఎర్రన్న, బత్తిరన్న, పాపవ్వ, కొంరవ్వ, చిలుక, ఎగోలం, పెద్దపులి, చిరుతగండు, కుక్క, తోడేలు, గంగాదేవి వంటి అనేక కథాపాత్రలు నూట యాభై నుంచి రెండొందల వరకు ఉంటాయి. అదే రోజు రాత్రి కథా ప్రదర్శనలో వారు కోరుకున్న కథను చెబుతారు.

బుట్టబొమ్మ ప్రదర్శనలో చివరన గంగా దేవి బొమ్మను తీసేటప్పుడు యాదవకుల స్త్రీ (ఇంటిపెద్ద) బోనం వండి తీసు కొస్తుంది. గంగాదేవి ముందు కొబ్బరికాయ కొట్టి అక్కడ ఉన్న ప్రేక్షకులందరికీ నుదుట పసుపుబొట్టు పెడుతుంది. తరువాత అందరూ గంగాదేవి మీద అక్షింతలు చల్లుతారు. తరువాత మందెచ్చు నాయకుడు గంగాదేవిని యాదవుని ఇంట్లోకి తీసుకుపోయి మంగళం పాడి త్యాగంగా వడ్లు, జొన్నలు, యాదవులు ఒప్పుకున్న కాడికి గొర్రెపిల్ల లేదా తల్లి గొర్రె; గంగాదేవికి చీర, రవిక; చనిపోయిన వ్యక్తి తిన్న గిన్నె, చెంబు, దుస్తులు, బోలు కడియం, దండకడియం, కొనకపోగు (చెవి కొసన ధరించే పోగు), వంటివి తీసుకుంటాడు.

ఇట్లా యాదవులను ఆశ్రయించి బతుకుతున్న మందెచ్చులవారు చాలా వెనుకబడి ఉన్నారు. వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి.

-డా.రంగు రాజ పాపయ్య






ఎలుగుబంటిని బలిస్తారు!

అయిను ప్రజలు జపాన్‌లో నివసించే స్థానిక తెగవారు. వీరికి మిగతా జపాన్ ప్రజల్లా వరిపంట పండించడం తెలియదు. నిజానికి వీరు వేట, ఆహార సేకరణపై జీవించే ఆదివాసీలు. ఉత్తర జపాన్ దీవి హొక్కయిడోలో వీరు ఎక్కువగా జీవిస్తున్నారు. వీరు ఎలుగుబంటి, జింక వంటి జంతువులతో పాటు సముద్రంలో దొరికే చేపలు, ఇతర జీవాలను వేటాడుతూ జీవించేవారు. అయితే జపనీయులు వారిని సముద్ర తీరం నుంచి లోపలి భూభాగాలకు తరిమివేయడంతో సముద్రంపై జీవించడం తగ్గిందంటారు. వీరు ఒకే చోట విస్తరించి లేరు. రష్యాలో కూడా వీరి ఉనికి కనిపిస్తుంది. అయినా ప్రజల కండ్లు గుండ్రంగా ఉండి మామూలు జపనీయులకన్నా శరీరంపై జుత్తు ఎక్కువగా ఉంటుంది.

వీరు తమ మత విశ్వాసాల్లో భాగంగా గుడ్లగూబలు, నక్కలు, ఎలుగుబంట్లను అనేక సందర్భాల్లో బలిస్తారు. ముఖ్యంగా ఎలుగు బంటి వారి నమ్మక వ్యవస్థలో చాలా కీలక స్థానాన్ని కలిగి ఉంది. దాన్ని మనుషులమధ్య తిరుగుతున్న దేవునిగా భావిస్తారు. ఎలుగుబంటిని బలి ఇస్తే మానవ ఆత్మలు సంతృప్తి చెందుతాయనేది వారి నమ్మకం. అయితే బయటివారికి ఈ ఆచారం భయంకరంగా కనిపిస్తుంది. పిల్లలున్న ఎలుగుబంటి గుహలోకి ప్రవేశించి దాన్ని చంపేస్తారు. దాని పిల్లలను రెండేండ్లు బంధించి పెంచిన తరువాత ఈటెలతో పొడిచి చంపుతారు. ఇదంతా మత విశ్వాసంలో భాగంగానే జరుగుతుంది. ఇట్లా చంపిన తరువాత ఎలుగు రక్తాన్ని గ్రామస్తులు తాగుతారు. అట్లాగే దాని మాంసాన్ని తింటారు. ఎలుగు చర్మాన్ని ఒక ఈటెకు చుట్టి నరికిన ఎలుగు తలను ఈటె పైన గుచ్చుతారు. ఈ తల ఉన్న ఈటెను వీరు పూజిస్తారు. ఈ ఆచారం ఒకప్పుడు విస్తృతంగా పాటించేవారు. ఇప్పుడు అక్కడక్కడా దీన్ని అనుసరిస్తున్నారు.



ఆఫ్రికాతో మన బంధం అతి ప్రాచీనం



ఆఫ్రికాతో భారత భూభాగ సంబంధాలు అతి ప్రాచీనమైనవి. అయితే ఆ సంబంధాలకు సంబంధించిన వివరాలు చాలావరకు మరుగునపడే ఉన్నాయి. దీనికి కారణం అంతగా పరిశోధన జరగకపోవడమే అని చెప్పవచ్చు.పశ్చిమ భారత సముద్ర తీరం, దక్షిణ తీరంతో అరబ్, ఆఫ్రికా తీరాలకు ఉన్న సంబంధంపై ఎంతో సమాచారం ఉంది. రుతుపవనాలను కనిపెట్టడం ఇండో-ఆఫ్రికన్ వ్యాపార సంబంధాలకు ఎంతో ఊతమిచ్చింది. ఆఫ్రికాకు, భారతదేశానికి మధ్య సంబంధాలు ఏర్పడటానికి ప్రకృతి శక్తులు, భౌగోళిక అనుకూలత ఎంతో దోహదం చేశాయి. మొంబాసాకు ముంబాయికి మధ్య డైరెక్టుగా ఉన్న దూరం కేవలం 2500 మైళ్లు మాత్రమే. ఈశాన్యం నుంచి ఆరు నెలల కాలం పవనాలు వీస్తే మిగతా ఆరునెలలు ఆగ్నేయం నుంచి వీస్తాయి. కాబట్టి రుతుపవనాలకు అనుగుణంగా నావికులు తమ పడవల తెరచాపలను ఎత్తి ఏ భూ భాగానికి వెళ్ళాలో ఆ భూభాగం వైపు చుక్కాని పడితే చాలు సునాయాసంగా అక్కడికి చేరుకునేవారు. నవంబర్-ఫిబ్రవరి మధ్య ఇండియా నుంచి ఆఫ్రికావైపు వెళ్ళాలనుకున్న వారు బయలుదేరేవారు. తీసుకువెళ్ళిన సరుకులను అమ్మి అక్కడ చౌకగా దొరికే వస్తువులను, విలువైన వస్తువులను మళ్లీ పడవలకు ఎక్కించి తాము ఎక్కడి నుంచి వచ్చామో అక్కడికి మరుసటి ఆరు నెలల్లో బయలుదేరేవారు. ఈ విధంగా కొన్ని శతాబ్దాలపాటు సముద్రవ్యాపారం జరిగింది. క్రీస్తుశకం 47వ శతాబ్దంలో హిప్పాలస్ అనేవాడు ఈ రుతుపవనాలను కనుగొని యూరప్‌కి ప్రయాణం చేసినప్పటి నుండి అరబ్బులకు, భారతీయులకు ఈ రుతుపవనాలకు సంబంధించిన జ్ఞానం అబ్బింది. రుతుపవనాలను కనిపెట్టినవాని పేరుమీదుగానే యూరోపియన్స్ ఈ రుతుపవనాలను 'హిప్పాలస్' అని పిలుస్తున్నారు.


అయితే భారత దేశానికి, ఆఫ్రికాకు కరెక్టుగా ఎప్పటి నుంచి సంబంధాలున్నాయనే సంగతి తెలుసుకోవడం చాలా కష్టమయిందే. పురావస్తుశాస్త్రం, మానవశాస్త్రం, నాణేలశాస్త్రం, సమాజశాస్త్రం, జానపదం, భాషాశాస్త్రం వంటి శాస్త్రాలను అనేక ప్రాంతాలకు సంబంధించిన భాషల్లో అధ్యయనం చేస్తే కానీ అర్థం కాదు. ఇందుకు ఎంతో శ్రమ, కృషి అవసరం.

క్రీస్తుశకం మొదటి శతాబ్దానికి ముందు...

ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త మార్టిమర్ వీలర్ అన్నట్లు "ఆసియా ఖండం నిర్ద్వంద్వంగా నాగరికతకు పుట్టినిల్లు". అయితే నిజంగా నాగరికత ఎక్కడ పుట్టిందనే విషయాన్ని కచ్చితంగా చెప్పడం కష్టమే. అందుకే "ఆఫ్రికా కూడా మానవ నాగరికతకు పుట్టినిల్లని భావించవచ్చు"ని వీలర్ మహాశయుడు అన్నారు. పదిలక్షల డెబ్బయ్ అయిదు వేల ఏండ్ల క్రితం మొదటగా పనిముట్లను తయారుచేసుకున్న మనిషి ఆఫ్రికాలో నివసించినవాడై ఉండవచ్చు. అయితే ఈ మనిషి కేవలం ఆహార సేకరణ చేస్తూ ఆఫ్రికాలో జీవించాడు. ఆసియా మనిషి మాత్రం మరో అడుగు ముందుకేసి తొమ్మిది వేల ఏండ్ల క్రితం ఆహారాన్ని ఉత్పత్తి ప్రారంభించాడు. ఆఫ్రికాలో ప్రధానంగా ఐదు జాతుల ప్రజలు ఉన్నారు. వీరిలో అధిక శాతం నీగ్రోలే ఉన్నారు. అయితే నీగ్రోల పుట్టిల్లు ఆసియా (ఇండియా), ఆఫ్రికా, యూరప్‌లో ఏదో ఒకటై ఉండవచ్చని ఒక సూచన ఉంది. అయితే కచ్చితంగా ఫలానా ప్రదేశం అని చెప్పలేం అని శాస్త్రవేత్తలు అంటున్నారు. భారతీయుల్లోని కొన్ని సమూహాల్లో 'సికిల్ సెల్స్' (కొడవలి ఆకారంలో ఉండే ఎర్రరక్త కణాలు) ఉండటం భారత దేశమే నీగ్రోలకు మాతృభూమి అని చెప్పడానికి ఊతం ఇస్తుందని కొందరి వాదం.



Normal Red Blood Cell



Sickle Shaped Red Blood Cell



కామ్మిడే, బర్కిట్ వంటి వారు దక్షిణ భారతదేశంలోను, దక్షిణాఫ్రికాలోను లభించిన ప్రాచీన రాతియుగమానవులు తయారుచేసుకున్న రాతి పనిముట్ల మధ్య అద్భుతమైన పోలికలను కనుగొన్నారు. కామ్మిడే దక్కన్, దక్షిణ భారత దేశంలో తిరిగి అనేక ప్రాచీన మానవుని పనిముట్లు సేకరించాడు. దక్షిణాఫ్రికా రాతి యుగాలపై ఎంతో పరిశోధన చేసిన బర్కిట్ కూడా ఎన్నో పనిముట్లను సేకరించారు. వీరిద్దరూ కలిసి వేల మైల్ల దూరంలో ఒకే విధమైన రాతిపనిముట్లు కనిపించినట్లు పేర్కొంటూ తమ విశ్లేషణలతో 'ఏంటిక్విటీ' అనే రీసెర్చ్ జర్నల్‌లో చాలా వ్యాసాలు రాశారు. తమ వ్యాసాల ద్వారా ఈ రెండు ప్రదేశాల్లో నివసించిన జాతుల మధ్య దగ్గరి సంబంధం ఉందని చెప్పారు. ఆ తరువాత వచ్చిన పరిశోధకులు డి.క్లార్క్, వి.డి.కృష్ణస్వామి, హెచ్.డి. సంకాలియా వంటి పరిశోధకులు ఈ విషయాన్ని ధృవపరిచారు.



- మౌక్తిక్

ప్రొ కబడ్డీలో నేడు
గుజరాత్ x ఢిల్లీ
రాత్రి 8 గంటలకు
హైదరాబాద్ x లక్నో
రాత్రి 9 గంటలకు
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం



ధోని, యువీలను తొలగించలేం!

ఏదైనా ప్రణాళిక ప్రకారమే • చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్

ముంబయి : టీమ్ ఇండియా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లోకి చేరినా.. తుది ఫలితంతో విమర్శల పాలైన ఆటగాళ్లు ఇద్దరే ఇద్దరు!. వెస్టిండీస్‌లోనూ సిరీస్ ఫలితం కోసం ఆఖరు మ్యాచ్ వరకూ వేచి చూడాల్సి వచ్చినందుకు విమర్శలెదుర్కొన్న ఆటగాళ్లు మళ్లీ ఇద్దరే!. వారే టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని, సీనియర్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్. భారత్‌కు రెండు ప్రపంచకప్‌లు తీసుకొచ్చిన ఘనమైన రికార్డు మహి సొంతమైతే, టీమ్ ఇండియా రెండు సార్లు ప్రపంచకప్ నెగ్గటంలో ప్రధానపాత్ర పోషించిన రికార్డు మరొకరిది. 2014-15 బోర్డర్, గవాస్కర్ సిరీస్ సందర్భంగా టెస్టు క్రికెట్‌కు ధోని వీడ్కోలు పలికినా.. ఇంకా యువీ ఎలాంటి ప్రకటన చేయలేదు. వన్డేలకు సంబంధించి ఫామ్, ఫిట్‌నెస్ సహకరించినంత కాలం జాతీయ జట్టుకు ఆడతానని యువరాజ్ చెప్పగా, కెరీర్‌పై మహి ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. ఇటీవల వీరిద్దరి ఫామ్ సైతం ఆశాజనకంగా లేకపోవటంతో మహి, యువీలను సాగనంపాలనే డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. 2019 ప్రపంచకప్ దృష్ట్యా ఇప్పటి నుంచే కొత్త జట్టును తయారు చేయాల్సిన అవసరం ఉందని విమర్శకులు వాదిస్తున్నారు. ఇదే విషయం జాతీయ సీనియర్ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెస్కె ప్రసాద్‌ను అడగగా అతడు భిన్నంగా స్పందించాడు. ' దీనిపై ఆలోచన చేయాలి. చర్చించాల్సిన అవసరం ఉంది. మేమొక నిర్ణయం తీసుకుంటాం. ప్రతిస్పందన ఎలా ఉంటుందో చూడాలి. జట్టుకు ఎవరి ఉపయోగం ఎంతో మాకు తెలుసు. ఒక్కో స్థానంపై నిర్ణయం తీసుకుంటాం. ఎప్పుడు అనేది చెప్పలేం. కానీ ఏదైనా ఆకస్మాత్తుగా జరుగదు. ఎలాంటి ప్రణాళిక లేకుండా దీన్ని చేయలేం' అని విస్డెన్ ఇండియాతో ప్రసాద్ పేర్కొన్నాడు. ఇద్దరు సీనియర్ ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేయటం సాధారణ విషయం కాదు, అది ప్రణాళికాబద్ధంగా చేయాల్సిన ప్రక్రియ. ఇంకా ప్రపంచకప్ ప్రణాళిక దృష్ట్యా ఆలోచించలేదని ప్రసాద్ తెలిపాడు.

ధోని గొప్ప నాయకుడు

కోహ్లి అతడిని దాటేస్తాడు: చీఫ్ కోచ్ రవిశాస్త్రి

కొలంబో : టీమ్ ఇండియా చీఫ్ కోచ్ రవిశాస్త్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత జట్టు సారథ్యంపై మాట్లాడిన శాస్త్రి.. మహేంద్రసింగ్ ధోనిని చాంపియన్ లీడర్‌గా అభివర్ణించాడు. అదే సమయంలో ప్రస్తుత సారథి విరాట్ కోహ్లి రాబోయే కాలంలో మహిని దాటేస్తాడని విశ్వాసం వ్యక్తం చేశాడు. ' భారత క్రికెట్‌లో మహేంద్రసింగ్ ధోని కెప్టెన్సీ రికార్డు ఆల్‌టైమ్ రికార్డు. అన్ని ఐసీసీ టైటిళ్లు నెగ్గాడు. వరల్డ్ టీ20, ప్రపంచకప్, చాంపియన్‌షిప్స్ ట్రోఫీ సహ టెస్టుల్లో నెం.1 ర్యాంక్ సాధించాడు. ఇవి కాకుండా ఓ వరల్డ్ టీ20 ఫైనల్స్, రెండుసార్లు టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్స్, వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్స్‌లో జట్టును నడిపించాడు. ఇక టెస్టుల్లోనూ అతడి రికార్డులు మిగతా కెప్టెన్ల కంటే ఎంతో మెరుగైనవి' అని శాస్త్రి అన్నాడు. ' విరాట్ కోహ్లి సైతం ఇదే దిశగా పయనిస్తున్నాడు. ఇంకా ఆరంభ దశలోనే ఉన్నా ధోనిని అందుకోగలడు. క్రికెట్‌తో 35 ఏండ్లుగా మమేకమై ఉన్నాను. సచిన్ టెండూల్కర్ తర్వాత అంత వేగంగా రికార్డులు తిరగరాసిన ఆటగాడు కోహ్లి. ఇంకా అతడు కెరీర్‌లో సగం మ్యాచులే ఆడాడు. అతడు గమ్యం చేరుకునే సరికి రికార్డులు ఆలోచిస్తే.. అద్భుతమే' అని అభిప్రాయపడ్డాడు. టెస్టు సారథిగా 27 టెస్టుల్లో కోహ్లి 17 విజయాలు సాధించాడు. ధోని 60 టెస్టుల్లో 27 విజయాలు సాధించాడు. విరాట్ గెలుపు శాతం 62.96 కాగా, మహి 45 శాతం కల్గి ఉన్నాడు.



నెటిజన్ దురుసుతనం

జ్వాలతో అనుచిత వాగ్వాదం

నవతెలంగాణ-హైదరాబాద్ : భారత క్రీడా రంగంలో బంధుప్రీతి, పక్షపాతం, అవినీతి, సెలెక్షన్ లోగుట్టుపై నిర్భయంగా మాట్లాడిన అతి తక్కువ మంది అథ్లెట్లలో మన హైదరాబాదీ షట్లర్ గుత్తా జ్వాల ఒకరు. అధికారుల పక్షపాత వైఖరి, సెలెక్షన్ ప్రక్రియలో లోసుగులు సహా మహిళా అథ్లెట్లు, డబుల్స్‌పై వివక్షను సైతం ఆమెను ప్రశ్నించారు. తనపై వచ్చిన ఎన్నో విమర్శలను సైతం పద్ధతి ప్రకారం తిప్పికొట్టింది. అయితే, తాజాగా సోషల్ మీడియా వేదికగా గుత్తా జ్వాల అనూహ్యంగా ఓ నెటిజన్ నుంచి అనుచిత ప్రశ్న ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎప్పట్లాగే గుత్తా జ్వాల చాలా పద్ధతిగానే మందలించినా.. సదరు నెటిజన్ దుందుడుకు తనంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ' మీ అమ్మ ఎలెన్ గుత్తాది చైనా కాబట్టి మీరు ప్రధాని మోడీని ప్రతిసారి వ్యతిరేకిస్తున్నారు' అని గుత్తా జ్వాల, ఇన్సీ గుత్తాలపై ఓ ట్వీట్టరీ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీనికి దీటుగానే బదులిచ్చిన గుత్తా జ్వాల.. ' మాట్లాడే ముందు రెండుసార్లు ఆలోచించుకో' అని ట్వీట్ చేసింది. అయినప్పటికీ అతడు ఎందుకు మీ అమ్మ ఎలెన్ గుత్తా.. మోడీకి వ్యతిరేకం అంటూ అడిగాడు. ' తొలుత మీ పట్ల నాకు గౌరవం పోయింది. నా నుంచి నీకు సమాధానం వస్తుందని అనుకోవట్లేదు. నీకు ఏమైనా సందేహం ఉంటే.. నేరుగా అడుగు' అని గుత్తా బదులిచ్చింది. అయినప్పటికీ ఆ నెటిజన్ అర్థం పర్థం లేని ట్వీట్‌లు చేస్తుండటంతో.. అతడిని బ్లాక్ చేస్తానని జ్వాల హెచ్చరించాల్సి వచ్చింది. అసలు వాదనలోకి తల్లిదండ్రుల ప్రస్తావన తీసుకురావటం ఏంటని సైతం జ్వాల మండిపడింది. సోషల్ మీడియా వేదికగా గుత్తా జ్వాలను టార్గెట్ చేసినట్లున్న సదరు నెటిజన్.. అసలు సంబంధం లేని వ్యాఖ్యలు, పొంతన లేని ప్రశ్నలతో దురుసుతనం ప్రదర్శించాడు.

ఎందుకు అమలు చేయలేదు?

ఏఎఫ్ఐతో కేరళ హైకోర్టు

కోచి : అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ)పై కేరళ హైకోర్టు మండిపడింది. ఇటీవల ఇచ్చిన తీర్పును ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ఆదేశించింది. భువనేశ్వర్‌లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో పి.యు చిత్ర స్వర్ణం సాధించింది. కానీ లండన్‌లో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్స్‌కు ఆమెను ఎంపిక చేయలేదు. దీనిపై కేరళ హైకోర్టును ఆశ్రయించిన చిత్ర.. అనుకూల తీర్పు సాధించింది. కోర్టు తీర్పు మేరకు చిత్రను ఎంపిక జాబితాలో చేర్చాలని అంతర్జాతీయ అథ్లెటిక్ ఫెడరేషన్‌ను కోరింది. కానీ వరల్డ్ బాడీ అందుకు అంగీకరించలేదు. ఇదే విషయాన్ని ఏఎఫ్ఐ అధికారులు కేరళ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి తెలియజేశారు. దీంతో కోర్టు ధిక్కరణ కింద పి.యు చిత్ర మళ్లీ కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారించిన హైకోర్టు.. తొలుత ఎంపిక చేయని సుధాసింగ్ పేరును చేర్చినప్పుడు, చిత్రను ఎందుకు ఎంపిక చేయలేదో సమాధానం చెప్పాలని ఆదేశించింది.

వైల్డ్ కార్డ్ ఇవ్వాలి : సీఎం పినరయి

పి.యు చిత్రకు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇవ్వాలని కేరళ సీఎం పినరయి విజయన్ డిమాండ్ చేశారు. చిత్రను ఎంపిక చేయకపోవటంపై ఏఎఫ్ఐ వైఖరిని తప్పుపట్టిన సీఎం... తక్షణమే ఆమెకు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇచ్చేలా చూడాలని కోరారు. ఇక చిత్రను ఎంపిక చేయకపోవటం వెనుక ఏఎఫ్ఐ కుట్ర పన్నిందని కేరళ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు టి.పి దాసన్ ఆరోపించారు. నిరుపేద కూలీ కుటుంబం నుంచి వచ్చిన పి.యు చిత్ర 1500 మీటర్ల రేసును 17.92 సెకండ్లలోనే పూర్తి చేసింది.



ఓవల్‌లో సఫారీ చిత్తు

239 పరుగులతో ఇంగ్లాండ్ ఘన విజయం

ఓవల్ : చారిత్రాత్మక ఓవల్ టెస్టులో ఆతిథ్య ఇంగ్లాండ్ అదిరే విజయాన్ని అందుకున్నది. నాల్గో ఇన్నింగ్స్‌లో డీన్ ఎల్గార్ (136, 228 బంతుల్లో 20 ఫోర్లు) సెంచరీతో ప్రతిఘటించినా.. ఇంగ్లాండ్ విజయాన్ని ఆపలేకపోయాడు. 492 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా.. ఇంగ్లాండ్ స్పిన్నర్ మోయిన్ అలీ (4/45) హాట్రిక్ విన్యాసానికి చిత్తుగా ఓడింది. ఎల్గార్ పోరాటం ఇంగ్లీష్ బౌలర్ల జోరు ముందు సరిపోలేదు. రెండో ఇన్నింగ్స్‌లో సఫారీలను 252 పరుగులకే కుప్పకూల్చిన రూట్‌సేన.. 239 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ మ్యాచ్ ఓవల్ స్టేడియంలో 100వ టెస్టు కావటంతో.. ఈ విజయం మరింత ప్రత్యేకత సంతరించుకున్నది. ఇక బ్యాటింగ్‌కు కష్టసాధ్యమైన ఓవల్‌లో తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించిన బెన్ స్టోక్స్ (112) 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 353 పరుగులు చేయగా, దక్షిణాఫ్రికా 175కే ఆలౌట్ అయ్యింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 313 పరుగులు చేసింది. నాల్గో ఇన్నింగ్స్‌లో హాట్రిక్ వికెట్లు కూల్చిన మోయిన్ అలీ.. ఓవల్‌లో తొలి హాట్రిక్ సాధించిన బౌలర్‌గా నిలిచాడు. నాల్గు మ్యాచుల టెస్టు సిరీస్‌లో 2-1తో ఇంగ్లాండ్ ఆధిక్యం సాధించింది.



తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఎల్.బి స్టేడియంలో నిర్వహించిన తెలంగాణకు హరిత హరంలో కార్యక్రమంలో టీమ్ ఇండియా మహిళల కెప్టెన్ మిథాలీరాజ్ పాల్గొన్నారు. ఎల్.బి స్టేడియం నుంచి ర్యాలీను జెండా ఊపి ప్రారంభించిన మిథాలీరాజ్.. స్టేడియం ప్రాంగణంలో మొక్క నాటారు. కార్యక్రమంలో అధికారులు, స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



దత్తాత్రేయకు వినతి పత్రం ఇస్తున్న పద్మారావు

రైల్వే భూములు ఇప్పించండి

- కేంద్రమంత్రి దత్తాత్రేయను కోరిన మంత్రి పద్మారావు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని రైల్వేభూములను డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి ఇప్పించాలని కేంద్రమంత్రి దత్తాత్రేయను రాష్ట్ర మంత్రి పద్మారావు కోరారు. సోమవారం కంటోన్మెంట్ బోర్డు సభ్యులతో కలిసి దత్తాత్రేయను ఆయన కార్యాలయంలో కలిశారు. కాగా మౌలాలి తార్నాక వద్ద ఉన్న 12 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించేందుకు రైల్వే అధికారులు కొంత అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని దత్తాత్రేయ తెలిపారు. అయితే చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ భూమిని రైల్వేశాఖకు ఇచ్చి బదులుగా తార్నాక వద్ద స్థలం అడగాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. ఇందుకు సంబంధించి పద్మారావుతో కలిసి కేంద్ర రైల్వేమంత్రి సురేష్‌ప్రభును కలుస్తున్నట్టు తెలిపారు. కాగా కంటోన్మెంట్ ఏరియాలో అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు న్యూబిల్డింగ్ బైలాస్ అమలు చేయాలని సభ్యులు కోరినట్టు వివరించారు. సమావేశనంతరం పద్మారావు మాట్లాడుతూ.. రైల్వే భూమిని పేదల ఇండ్ల నిర్మాణానికి కేటాయించేలా సహకరించాలని దత్తాత్రేయను కోరామని చెప్పారు. రైల్వే భూమికి బదులుగా స్థలం లేదా డబ్బు ఏం అడిగినా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు.

నలభైయేండ్లకే ముసలితనం

రెండు దశాబ్దాల కిందటి వరకూ మహబూబ్‌నగర్ జిల్లాలోని రంగారెడ్డిగూడ ఎటు చూసినా పచ్చని పొలాలతో ఆహ్లాదంగా ఉండేది. రైతుల ఇండ్లన్నీ ధాన్యం రాశులతో కళకళలాడేవి. ఎంత కరువు కాలమైనా వలసలు లేని గ్రామమది. కాలం గిర్రున తిరిగింది. అభివృద్ధి, ఉద్యోగాలు అంటూ... ఆ గ్రామంపై ఏలికలు స్పాంజ్ ఐరన్ కంపెనీని రుద్దారు. భయంకరమైన కాలుష్యం వదులున్న ఆ కంపెనీతో ఇప్పుడు ఆ ఊరు వల్లకాడుగా మారుతున్నది. ఆ ఊర్లోని వారు నలభైయేండ్లకే ముసలివారిగా మారి మంచానికే పరిమితమవుతున్నారు. గర్భస్త శిశువులపై తీవ్రప్రభావం పడుతున్నది. పుట్టిన పిల్లలు పుట్టినట్టే చనిపోతున్నారు. ఒకవేళ బతికినా ఎదుగుదల లోపంతో అల్లాడుతున్నారు. బుద్ధిమాంద్యంతో విగత జీవులుగా బతుకీడుస్తున్నారు. యువత నుంచి పండు ముసలి వరకూ ఒళ్లు నొప్పులతో, నరాల బలహీనతతో బాధపడుతున్నారు.

పిట్టల్లా రాలుతున్న పసి మొగ్గలు

- గర్భస్త శిశువులపైనా ప్రభావం
- భయంకరమైన కాలుష్యం వెదజల్లుతున్న స్పాంజ్ ఐరన్ కంపెనీ
- రోగాల బారిన రంగారెడ్డిగూడవాసులు

నవతెలంగాణ-మహబూబ్‌నగర్‌ప్రతినిధి

మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం రంగారెడ్డిగూడ సమీపంలో 21 ఏండ్ల కింద స్పాంజ్ ఐరన్ కంపెనీని ఏర్పాటు చేశారు. ఈ కంపెనీ వల్ల విడులయ్యే కాలుష్యం వల్ల రంగారెడ్డిగూడ పూర్తిగా కాలుష్యకారక ప్రాంతంగా మారింది. ఈ కంపెనీ కాలుష్య ప్రభావం రాజాపూర్, బాలానగర్ మండలాల్లోని గుండ్ల పోచంపల్లి, అగ్రహారం, పొట్లపల్లి, కేతిరెడ్డిపల్లి, బీబీనగర్ గ్రామాలపైనా ఉంది. 24 గంటలూ నడిచే ఈ పరిశ్రమల నుంచి వచ్చే పొగ, ఇనుపరజనుతో కూడిన తుంపర ఇండ్లపైకి వచ్చి చేరుతుండటంతో ఆ గ్రామాల వారు శ్వాసకోస సంబంధ వ్యాధులకు గురవుతున్నారు. కొంత మందికి కాళ్లు చచ్చుపడి పోయాయి. మరికొందరికి క్షయ, దమ్మువంటి రోగాలు వచ్చి



చనిపోయారు. అనేక మందికి చర్మవ్యాధులు ప్రబలి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ ప్రాంతాల్లో మొలిచిన గడ్డి తిని పశువులు సైతం మృత్యువాత పడిన సందర్భాలూ ఉన్నాయి. గర్భవతులు రక్తహీనతతో బాధపడుతున్నారు. నరాల బలహీనతతో పిండం మలుచుకుపోతోంది. బిడ్డ పుట్టినా ఎదగడం లేదు. పుట్టిన ప్రతి బిడ్డా బుద్ధి మాంద్యంతో బాధపడుతున్న దుస్థితి ఉంది. రంగారెడ్డిగూడలో మూడేండ్లలో 26 మంది బుద్ధి మాంద్యంతో పుట్టారు. 10 మందికి పైగా చనిపోయారు. ఏ ఆస్పత్రికి పోయినా...కాలుష్యం వల్లే ఇలా జరుగుతుందని డాక్టర్లు చెబుతున్నారని, ఒక్కో కుటుంబం ప్రతి నెలా వైద్య ఖర్చుకు రూ.4 వేలకు పైనే ఖర్చు చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. రంగారెడ్డిగుడకు చెందిన అంతయ్య ఉద్యోగి. ఇంటికొచ్చినప్పుడల్లా తీవ్ర అనారోగ్యం పాలవుతున్నాడు. ఇందిరమ్మకు కాళ్లేతులు చచ్చుబడిపోయాయి. మంగమ్మకు చర్మవ్యాధి వచ్చి ఇంటి నుంచి బయటకు వెళ్లే స్థితి లేదు. శ్రీను అనే వ్యక్తి బిడ్డ, ఆనంద్ కుమారులు మందబుద్ధితో పుట్టారు. నర్సమ్మ ఆరునెలల కింద చనిపోయింది.

వ్యర్థాలు అక్కడే... అడుగంటిన భూగర్భ జలాలు

దీని నుంచి వెలువడే కాలుష్య వ్యర్థాలను తీసుకెళ్లి దూర ప్రాంతాల్లో పడేయాలి. యాజమాన్యం మాత్రం గ్రామాల సమీపంలో గుంతలుతీసి అందులో పడేస్తున్నారు. దీంతో ఆ మండలాల్లోని భూగర్భజలాలన్నీ కలుషితమైపోయాయి. భూగర్భజలాలు కూడా 300 నుంచి 330 అడుగుల లోతుకు పడిపోయాయి. నేల కూడా విషతుల్యమైంది. గతంలో కూరగాయలు, పత్తి పంటలు బాగా పండేవి. ప్రస్తుతం కూరగాయల తోటలే వేయట్లేదు. గతంలో ఎకరాకు సగటున 15 క్వింటాళ్ల పత్తి దిగుబడి రాగా... ప్రస్తుతం సగటున ఆరేడు క్వింటాళ్లు కూడా రావటంలేదు. బోర్ల నుంచి నీరు పచ్చగా వస్తున్నది. ఆ నీళ్లను తాగరాదని అక్కడి డాక్టర్లు కూడా హెచ్చరిస్తున్నారు. మొదట కంపెనీ వారు మినరల్ వాటర్‌ను సప్లై చేస్తామని చెప్పారు. కానీ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో ఒక్కో కుటుంబం సగటున రోజుకు రూ.20 నుంచి 30 పెట్టి మినరల్ వాటర్ కొనుక్కుని తాగుతున్నారు.

మా దృష్టికి తీసుకొస్తే... చర్యలు తీసుకుంటాం

స్పాంజ్ ఐరన్ కంపెనీ నుండి జల, వాయు కాలుష్యం వస్తుందని గతంలో మా దృష్టికి వచ్చింది. ఫ్యాక్టరీని పరిశీలించి రెండు నెలలు మూసి వేయించాం. పొల్యూషన్ నియంత్రించే చర్యలు తీసుకుంటామని కంపెనీ నిర్వాహకులు హామీనివ్వడంతో తిరిగి తెరిపించాం. ఈ కంపెనీ నుండి ప్రజలకు ఇంకా ఏమైన అసౌకర్యాలు కల్గుతున్నాయని తెలిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

దయానంద్ - రాష్ట్ర పొల్యూషన్ నియంత్రణాధికారి

ఎప్పుడు ఏ రోగమొస్తుందో ఏమో తెలుస్తలేదు..

మాకునన్నీ రోగాలు మరెవ్వరికీ లేవు. ఇయ్యాల ఇట్లున్నం. రేపు ఏ రోగమొస్తుందో తెలుస్తలేదు. పుట్టిన బిడ్డలు బతుకుతారనే నమ్మకమూ లేదు. చిన్నపిల్లలను దవాఖానాల చుట్టూ తిప్పలేకపోతున్నం. చర్మవ్యాధులు వస్తున్నాయి. ఉబ్బసం వస్తే... చావే. 20 ఏండ్లుగా ఇదే కంపెనీలో పనిచేసిన మాకు 40 ఏండ్లకే ముసలితనం వచ్చింది. ఎక్కడికి పోలేం. దవాఖానాలకు ఖర్చు పెట్టి అప్పులపాలవుతున్నం.



మంగమ్మ

ఐరన్ కంపెనీపై మన్ను పోయా

20 ఏండ్లుగా ఇదే కంపెనీలో పనిచేసిన. రెక్కలు ఆడినంతకాలం పని చేయించుకున్నరు. కంపెనీ పొగ, విషంతో కూడిన వస్తువులు తాకి ఒళ్లంతా విషంగా మారింది. రెండు కాళ్లు పనిచేస్తలేవు. ఒక్క మందుగోళీలకే నెలకు వెయ్యి రూపాయలైపోతున్నయి. అప్పు చేసి దవాఖానాల చూపెట్టుకుంటున్నం. ఆ కంపెనీలో పని చేసినందుకే ఈరోగం వచ్చింది.

- యాదమ్మ, గతంలో పనిచేసిన కార్మికురాలు

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.